

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

# వ్యవసాయం

సెప్టెంబర్, 2023

సంపుటి - 9 | సంచిక-09 | పేజీలు- 52 | వెల : ₹ 20/-



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక



77వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ ఎం. వెంకట రమణ



ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతి సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలదండ వేసి పుష్పాంజలి ఘటిస్తున్న రిజిస్ట్రార్ డా॥ ఎం. వెంకట రమణ



విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న దూలపల్లిలోని అటవీ, సహజ వనరుల నిర్వహణ అధ్యయన కేంద్రం



విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన అమెరికా వ్యవసాయ విభాగంకు చెందిన వ్యవసాయ నిపుణులు డా॥ ధ్రువ్ సూద్



వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో జాతీయ క్రీడల దినోత్సవం కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

సెప్టెంబర్, 2023
శ్రీ శోభకృత్ నామ సం॥ర
నిజ శ్రావణ బహుళ విదియ
నుండి బాద్రపద పాడ్యమి వరకు



## సంపాదక వర్గం



ప్రధాన సంపాదకులు

డా॥ చల్లా వేణు గోపాల రెడ్డి
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

డా॥ ఎన్. రామగోపాల వర్మ
ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)

డా॥ ఎ. వి. రామాంజనేయులు
ప్రధాన శాస్త్రవేత్త (అగ్రో) & హెడ్

పర్యవేక్షణ

డా॥ ఆర్. సునీత దేవి
సీనియర్ శాస్త్రవేత్త (ఎంటమాలజి)



వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు.
డి. డి. అయితే
Principal Agricultural Information Officer, AI&CC and PJTSAU Press
పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి



చిరునామా :
ప్రిన్సిపల్ అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.
తెలంగాణ రాష్ట్రం, ఫోన్ నెం. 040-24015380
e-mail : pjtsau.paio@gmail.com
vyavasayam.pjtsau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం.......................................5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు.............. 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ.................... 15
4. సాంకేతిక వ్యాసాలు
- వరిలో సుడిదోమ వలన కలిగే దోమపోటు- యాజమాన్యపద్ధతులు...................................... 16
- వరినాశించే బ్యాక్టీరియా ఎండాకు తెగులు మరియు పాము పొడతెగులు - వాటి యాజమాన్యం................ 18
- వర్షాధార మొక్కజొన్న సాగులో ఎదురయ్యే సమస్యలు సూచనలు.................................................. 20
- కంది పంటలో చిగుర్లు తుంచే విధానం-ప్రయోజనాలు... 22
- ఉత్తర తెలంగాణ జిల్లాలలో వర్షాభావ పరిస్థితులు- వివిధ పంటలలో పాటించవలసిన సూచనలు.............. 23
- పంటల సాగులో ఆకర్షక మరియు రక్షక పంటల ప్రాముఖ్యత............................................. 25
- ఆహార వికిరణం- ఆహారాన్ని నిల్వ చేయుటలో నూతన ఒరవడి.................................................26
- ప్రత్తిలో రసం పీల్చే పురుగుల యాజమాన్యం............... 28
- సకశేరుక చీడల నుండి పంట రక్షణ....................... 30
- సెప్టెంబర్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు............................................ 32
- వ్యవసాయ పదవినోదం.................................. 34
- నిమ్మ, బత్తాయి తోటలలో వేరుకుళ్ళు తెగులు యాజమాన్యం............................................. 35
- లేత ఆయిల్‌పామ్ తోటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..... 36
- ఆస్టరు పూల సాగుకు శీతాకాలం బాగు.....................38
- కిచెన్ గార్డెనింగ్...ఆరోగ్యానికి వరం.........................40
- రక్తహీనతకు పోషకాహారంతో పరిష్కారం....................42
- మేలు జాతి పందుల ఎంపిక-వాటి రవాణాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.................................. 44
5. టి.వి.చానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు.......................................... 46
6. రైతన్నకో ప్రశ్న...............................................47
7. విశ్వవిద్యాలయ వార్తలు.....................................48
8. రైతు విజయగాథ
- సమగ్ర వ్యవసాయంతో అభివృద్ధి పథంలో నడుస్తున్న సిద్ధిపేట జిల్లా ఇబ్రహీంపూర్ గ్రామ యువ రైతు- దర్ని పరశురాములు.......................................... 49

# సెప్టెంబర్, మాసం క్యాలెండర్ - 2023

## శ్రీ శోభకృత్ నామ సం॥ నిజ శ్రావణ బహుళ విదియ నుండి భాద్రపద బహుళ పాడ్యమి వరకు

| SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | MON<br>సోమ<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ. 3.00-4.30 | WED<br>బుధ<br>రాహుకాలం<br>మ. 12.00-1.30 | THU<br>గురు<br>రాహుకాలం<br>మ. 1.30-3.00 | FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ. 10.30-12.00 | SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ. 9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| | | | | | **1** నిజ శ్రావణ బ॥ విదియ తె. 3-21, పూర్వాభాద్ర సా. 6-48, తె.వ. 3-49 ల 5-19 | **2** తదియ రా. 1-15, ఉత్తరాభాద్ర సా. 5-22, తె.వ. 4-46 ల |
| **3** చవితి రా. 11-24, రేవతి సా. 4-11, ఉ.శే.వ. 6-17 | **4** పంచమి రా. 9-54, అశ్విని ప. 3-18, ఉ.వ. 11-26 ల 12-59, రా.వ. 12-41 ల 2-15 | **5** షష్ఠి రా. 8-46, భరణి ప. 2-47, రా.వ. 2-45 ల 4-20 | **6** సప్తమి రా. 8-07, కృత్తిక ప. 2-43, వర్జ్యము లేదు | **7** అష్టమి రా. 7-56, రోహిణి ప. 3-08, ఉ.వ. 6-59 ల 8-37, రా.వ. 8-56 ల 10-36 | **8** నవమి రా. 8-17, మృగశిర సా. 4-03, రా.వ. 12-56 ల 2-38 | **9** దశమి రా. 9-08, ఆర్ద్ర సా. 5-27, వర్జ్యము లేదు |
| **10** ఏకాదశి రా. 10-25, పునర్వసు రా. 7-18, ఉ.వ. 6-22 ల 8-06, తె.వ. 4-02 ల 5-47 | **11** ద్వాదశి రా. 12-05, పుష్యమి రా. 9-31, వర్జ్యము లేదు | **12** త్రయోదశి రా. 2-01, ఆశ్రేష రా. 12-00, ఉ.వ. 11-38 ల 1-24 | **13** చతుర్దశి తె. 4-05, మఘ రా. 2-36, ప.వ. 1-18 ల 3-04 | **14** అమావాస్య పూర్తి, పుబ్బ తె. 5-09, ఉ.వ. 11-27 ల 1-13 | **15** అమావాస్య ఉ. 6-07, ఉత్తర పూర్తి, ప.వ. 1-03 ల 2-49 | **16** భాద్రపద శు॥ పాడ్యమి ఉ. 7-53, ఉత్తర ఉ. 7-32, సా.వ. 4-37 ల 6-21 |
| **17** విదియ ఉ. 9-17, హస్త ఉ. 9-31, సా.వ. 6-02 ల 7-44 | **18** తదియ ఉ. 10-15, చిత్ర ఉ.11-05, సా.వ. 4-55 ల 6-36 | **19** చవితి ఉ. 10-43, స్వాతి ప. 12-09, సా.వ. 5-52 ల 7-31 | **20** పంచమి ఉ. 10-39, విశాఖ ప. 12-43, సా.వ. 4-44 ల 6-20 | **21** షష్ఠి ఉ. 10-08, అనూరాధ ప. 12-49, సా.వ. 6-19 ల 7-54 | **22** సప్తమి ఉ. 9-07, జ్యేష్ఠ ప. 12-27, రా.వ. 8-11 ల 9-44 | **23** అష్టమి ఉ. 7-43, నవమి తె. 5-57, మూల ఉ. 11-42, ఉ.వ. 10-08 ల 11-42, రా.వ. 8-51 ల 10-23 |
| **24** దశమి తె. 3-50, పూర్వాషాఢ ఉ. 10-37, సా.వ. 6-09 ల 7-40 | **25** ఏకాదశి రా. 1-37, ఉత్తరాషాఢ ఉ. 9-16, ప.వ. 1-00 ల 2-30 | **26** ద్వాదశి రా. 11-15, శ్రవణం ఉ. 7-45, ధనిష్ఠ తె. 6-05 ప.వ. 11-28 ల 12-57 | **27** త్రయోదశి రా. 8-49, శతభిషం తె. 4-26, ప.వ. 12-47 ల 2-16 | **28** చతుర్దశి సా. 6-26, పూర్వాభాద్ర రా. 2-48, ఉ.వ. 10-23 ల 11-53 | **29** పూర్ణిమ సా. 4-09, ఉత్తరాభాద్ర రా. 1-20, ఉ.వ. 11-48 ల 1-18 | **30** భాద్రపద బ॥ పాడ్యమి ప. 2-02, రేవతి రా. 12-06 ప.వ. 12-43 ల 2-14 |

**07 శ్రీ కృష్ణాష్టమి**    **18 వినాయక చవితి**    **28 ఈద్-మిలాదున్-నబీ**    **06 అర్బయాన్**

**పుబ్బ కార్తె (31.08.23 నుండి 13.09.23)**

| | |
|---|---|
| వరి | : రసాయనిక ఎరువులు వేయుట, సస్యరక్షణ, కలుపు తీయుట, ఎలుకల నిర్మూలన |
| జొన్న | : రబీ జొన్న వేయుటకు దుక్కులు తయారు చేయుట. |
| వేరుశనగ | : సస్యరక్షణ, కలుపు తీయుట. |
| సోయాచిక్కుడు | : పైరు కోయుట. |
| ప్రొద్దుతిరుగుడు | : సస్యరక్షణ, ఎరువులు వేయుట. |
| చెఱకు | : అడ్డాలి పంట వేయుట. |
| ఆముదం | : సస్యరక్షణ, ఎరువులు వేయుట. |

**ఉత్తర కార్తె (14.09.23 నుండి 27.09.23)**

| | |
|---|---|
| సజ్జ | : రబీ పంటలకు రసాయనిక ఎరువులు వేయుట, విత్తుట. |
| వేరుశనగ | : సస్యరక్షణ. |
| ఆముదం | : సస్యరక్షణ. |
| ప్రత్తి | : సస్యరక్షణ. |
| సజ్జ | : కోతలు. |
| నువ్వులు | : జూన్ నెలలో వేసిన పైరు కోతలు. |
| ప్రత్తి | : సస్యరక్షణ. |

# జీవ నియంత్రణ సాధనాలను ఉపయోగిద్దాం...
# సాగు ఖర్చును తగ్గించుకుందాం



యం. రఘునందన్ రావు
**ఉపకులపతి**

వ్యవసాయంలో చీడ పీడలు ఆశించడం వలన జరిగే పంట నష్టం దాదాపు 30-35% వరకు ఉంటుంది. రసాయనిక పురుగు మందులు వాడి చీడ పీడలను నివారించుకోవడం అన్నది అనవాయితీగా వస్తున్నది. మారుతున్న సేంద్రియ వ్యవసాయ పద్ధతుల నేపథ్యంలో క్రమంగా రసాయనిక పురుగు మందులకు ప్రత్యామ్నాయ పద్ధతుల వాడకం అనివార్యమయింది. రసాయనిక పురుగు మందులకు పురుగులు నిరోధక శక్తి పెంపొందించుకొని అది పనిచేయకపోవటం, ఒకవేళ పనిచేసినా రసాయనిక పురుగు మందుల అవశేషాలు ఉత్పత్తులలో ఉండిపోయి నాణ్యతాపరమైన సమస్యలు రావటంతో, ఈ మధ్యకాలంలో రైతాంగం కూడా సస్యరక్షణలో ప్రత్యామ్నాయ పద్ధతులపై శ్రద్ధ చూపటం జరుగుతున్నది. రసాయనిక పురుగు మందుల ప్రత్యామ్నాయ పద్ధతులలో అతి ముఖ్యమైనది, ఆచరణపరంగా సులువైనది జీవనియంత్రణ పద్ధతులని చెప్పవచ్చు.

చీడ పీడలు తమ సహజ శత్రువుచే నివారించబడడం అన్నది అనాదిగా వస్తున్నప్పటికీ వాటి నిష్పత్తి పంట పొలాలలో చాలా తక్కువగా ఉండటం వలన ఆశించిన ఫలితాలు రైతాంగానికి చేరడం లేదు. సమగ్ర సస్యరక్షణలో జీవ నియంత్రణ పద్ధతులలో ముఖ్యసాధనాలయిన పరాన్నజీవులు, బదనికలు మరియు సూక్ష్మజీవుల ఆధారిత జీవ రసాయనాలను, విరివిగా ప్రచారంలోకి తేవడంతోపాటు వీటి లభ్యత మరియు వాడకంలో సౌలభ్యం ఉండటం వలన ఇటీవలి కాలంలో ఇవి బహుళ ప్రాచుర్యానికి నోచుకున్నాయి.

మన పంటలకు హాని చేసే పురుగుల మీద ఆశించే సహజ శత్రువులను మనం పరాన్నజీవులుగా పరిగణిస్తాము. గ్రుడ్డు, లార్వా మరియు ప్యూపా పరాన్నజీవులు వాడకంలో ఉన్నాయి. వీటిలో గ్రుడ్డు పరాన్నజీవి బాగా ప్రాచుర్యంలో ఉంది. వరి, ప్రత్తి, మొక్కజొన్న, ఆముదం మరియు శనగ వంటి ముఖ్యమైన పంటల్లో ఆశించే పురుగులను తీసుకున్నట్లయితే రెక్కల జాతి పురుగులెక్కువగా ఉంటాయి. వీటి ఉధృతిని ట్రైకోకార్డు రూపంలో లభ్యమయ్యే గ్రుడ్ల పరాన్నజీవిని ఉపయోగించి సమర్థవంతంగా తగ్గించుకోవచ్చును.

హానికారక పురుగులను భుజిస్తూ వాటిని నష్టపరిమాణం స్థాయి చేరకుండా ఉండటంలో బదనికల పాత్ర చాలా ముఖ్యమైనదిగా చెప్పుకోవచ్చు. వీటిలో అల్లిక రెక్కల పురుగులు, అక్షింతల పురుగులు మరియు సాలీడు ప్రజాతులు జీవనియంత్రణలో ప్రముఖ పాత్ర పోషించేవిగా చెప్పుకోవచ్చు. అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి నాణ్యత కలిగిన జీవ రసాయనాలను అందించే ప్రక్రియలో భాగంగా రసాయనిక పురుగు మందులతో సమానంగా కొన్ని రకాల బ్యాక్టీరియా, వైరస్ మరియు శిలీంధ్ర ఆధారిత జీవ రసాయనాలను కూడా భారత పురుగు మందుల చట్టంలోకి తేవడం జరిగింది.

జీవ నియంత్రణ పద్ధతులు, జీవరసాయనాల లభ్యత మరియు వాడకంలో ఎదురయ్యే సమస్యలకు సమాధానంగా తెలంగాణ వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో మన వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి సాంకేతిక సహకారంతో జీవ నియంత్రణ ఉత్పత్తి కేంద్రాలను తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాకుండా రైతులు ప్రతిసారి మార్కెట్ మీద ఆధారపడకుండా కొన్ని రకాల పరాన్నజీవులను మరియు ఎన్.పి.వి వైరస్ ద్రావణాన్ని తమ స్థాయిలో తయారుచేసుకొని వాడుకోవడానికి కావలసిన శాస్త్రపరమైన శిక్షణను వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తూ, వీటి వాడకం మరియు నాణ్యతల గురించి రైతాంగంలో అవగాహన కూడా పెంచటం జరుగుతుంది.

రాష్ట్ర రైతాంగం రసాయన పురుగు మందుల వాడకాన్ని వీలయినంతవరకు తగ్గించి జీవ నియంత్రణ పద్ధతులు మరియు జీవ రసాయనాల వంటివి వినియోగించడం ద్వారా సాగు ఖర్చును తగ్గించుకొని, పురుగు మందుల అవశేషాలు లేని నాణ్యమైన పంట ఉత్పత్తులను పండించి అధిక లాభం పొందుతారని ఆశిస్తూ...

(యం. రఘునందన్ రావు)
**ఉపకులపతి**



# వరి

తెలంగాణ రాష్ట్రంలో వరి నాట్లు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ప్రస్తుతం వరి వివిధ దశల్లో ఉంది. వరి ఎక్కువ శాతం పిలకలు తొడిగే దశలో ఉంది. ఈ దశలో సరియైన ఎరువుల యాజమాన్యం మరియు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లైతే వరిలో మంచి ఫలితాలు పొందవచ్చు. ఈ సమయంలో వరిలో కలుపు నివారణ కూడా చాలా అవసరం. ఆశించిన దిగుబడులు పొందాలంటే మంచి రకముతో పాటుగా ఈ దశలో పాటించే యాజమాన్య పద్ధతులు చాలా ముఖ్యం.

మొత్తం భాస్వరం ఎరువును దమ్ములోనే వేయాలి. నత్రజని ఎరువును 3-4 దఫాలుగా వేయాలి. దమ్ములోనూ, పంట బాగా దుబ్బు చేసే దశలో (30-35 కిలోల యూరియా) మరియు అంకురం తొడిగే దశలోనూ (30-35 కిలోలు) బురద పదునులో వెదజల్లి 36-48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి. పొటాష్ ఎరువును రేగడి నేలల్లో ఆఖరి దమ్ములో సగం (14 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) / ఎకరాకు అంకురం ఏర్పడే దశలో (14 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) / ఎకరాకు మిగతా సగాన్ని వేయాలి.

- ప్రధాన పొలంలో పిలకలు వేసేదశలో 2 సెం.మీ. వరకు నీరు ఉండే విధంగా చూడాలి.
- సెప్టెంబర్ నెలలో నాటు వేసిన వరిలో పూత సమయంలో అధిక చలి కారణంగా గింజలు పాలుపోసుకోక తాలుగా మారతాయి. అందువలన సెప్టెంబర్‌లో నాట్లు వేయకూడదు.
- పొలంలో ఊద, ఒడిపిలి వంటి కలుపు మొక్కలు ఉన్నట్లైతే నాటిన 15-20 రోజులకి సైహలోఫాప్-పి-బ్యుటైల్ 1.5 మి.లీ. లేదా బిస్‌పైరిబాక్ సోడియం 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాలలో ఉల్లికోడు అధికంగా ఆశిస్తుంది. కావున పొలంలో 5 శాతం ఉల్లిగొట్టాలు లేదా దుబ్బుకి ఒక కోడు సోకిన పిలక గమనించినట్లైతే కార్బోఫ్యూరాన్ 3జి 10 కిలోలు లేదా ఫిప్రోనిల్ 0.3జి గుళికలు 8 కిలోలు ఎకరానికి చల్లుకోవాలి.
- రైతులు క్రమం తప్పకుండా పొలంలో తిరుగుతూ పురుగులు-తెగుళ్ళ ఉనికి/ఉధృతిని తెలుసుకోవాలి. సెప్టెంబర్ నుండి వరి పంటను సుడిదోమ ఆశిస్తుంది. పిలకదశలో దుబ్బుకి 20-25 దోమలు ఉన్నట్లైతే అంకురం నుండి ఈనిక దశలో దుబ్బుకి 10-15 దోమలు ఉన్నట్లైతే తొలిదశలో ఎసిఫేట్ + ఇమిడాక్లోప్రిడ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. దోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే డైనోటెఫ్యూరాన్ 20 యస్.జి 0.4 గ్రా. లేదా పైమెట్రోజైన్ 50 డబ్ల్యుజి 0.6 గ్రా. లేదా ట్రైఫ్లూమెజోపైరిమ్ 0.485 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 40% + ఎథిప్రోల్ 40% డబ్ల్యు.జి 0.25 గ్రా. లీటరు నీటికి మొక్కల మొదళ్ళపై పడేటట్లు పిచికారి చేయాలి.
- కాండం తొలిచే పురుగు (మొగి పురుగు) నివారణకి చదరపు మీటరుకి ఒక తల్లి పురుగు లేదా గ్రుడ్ల సముదాయం లేదా 10 శాతం చనిపోయిన మొవ్వులు గమనించినట్లైతే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఇందుకోసమై పిలకదశ / దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకి 10 కిలోల చొప్పున లేదా ఎసిఫేట్ 75 ఎస్.పి 1.5 గ్రా. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 యస్.పి. 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. అంకురం నుండి చిరుపొట్ట దశలో ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 యస్.పి 2 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 యస్.సి 0.3 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- ప్రధాన పొలంలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉంది. కావున అగ్గి తెగులు మచ్చలు తొలిదశలోనే గుర్తించి ఐసోప్రోథయోలోన్ 1.5 మి.లీ. లేదా ట్రైసైక్లజోల్ 0.6 గ్రా.



లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్ + మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలపి పిచికారి చేయాలి.

- పొలంలో గట్ల వెంబడి ఉన్న మొక్కలలో 10 శాతం పిలకలలో పాముపొడ తెగులు ఉన్నట్లు గమనించినట్లైతే హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- సెప్టెంబర్ నెలలో ఎడతెరిపి లేకుండా (2-3 రోజులు) గాలులతో కూడిన వర్షాలు పడినట్లైతే తుఫాను దాటికి రోజుల తరబడి వర్షం కురిసినట్లైతే బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశిస్తుంది. తెగులు 5 శాతం కంటే ఎక్కువైతే నత్రజని ఎరువులను వేయటం తాత్కాలికంగా ఆపివేయాలి. తెగులు ఆశించిన పొలం నుండి నీటిని ఒకటి రెండుసార్లు పూర్తిగా బయటికి పంపాలి. తెగులు వ్యాప్తిని అరికట్టుటకు అగ్రిమైసిన్ 0.4 గ్రా. లేదా ప్లాంటామైసిన్ లేదా పోషామైసిన్ 0.2 గ్రా. 5-7 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**డా॥ సిహెచ్. దామోదర్ రాజు, ప్రధాన శాస్త్రవేత్త (వరి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9440225385**

## మొక్కజొన్న

- వర్షపు తేమను ఉపయోగించుకొని మోకాలిదశలో ఉన్న మొక్కజొన్న పైరుకు ఎకరాకు 50 కిలోల యూరియాను పైపాటుగా వేయాలి లేదా పూతదశలో ఉన్న పైరుకు ఎకరాకు 50 కిలోల యూరియా మరియు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలి.
- మొక్కజొన్నను కత్తెర పురుగు ఆశించినచో రైతులు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి సుడుల భాగం తడిచేటట్లు సాయంకాలం వేళలో పిచికారి చేయాలి.
- ఎదిగిన లార్వాల నివారణకు విషపు ఎరను పెట్టుకోవాలి వరితవుడు 10 కిలోలు + బెల్లం 2 కిలోలు + 2-3 లీటర్ల నీటిలో కలిపి 24 గంటలు పులియనిచ్చి మరుసటి రోజు థయోడికార్బ్ 100 గ్రా. కలిపి ఉండలుగా తయారుచేసి సాయంకాలం వేళలో మొక్కల సుడులలో వేసుకోవాలి.
- పేనుబంక ఆశించినచో డైమిథోయేట్ 30 ఇ.సి. 2 మి. లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- ఆకుమాడు తెగుళ్ళు ఆశించిన పైరుకు మ్యాంకోజెబ్‌ను 2.5 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

## చిరుధాన్యాలు

**సజ్జ:** పంట పూతదశలో ఉంటుంది. వానాకాలంలో వర్షాధారంగా పంటను సాగు చేసినప్పుడు నీటిపారుదల అవసరం ఉండదు. అయితే 20-25 రోజులకు మించి బెట్టపరిస్థితులు ఏర్పడితే పూత మరియు గింజ కట్టే దశలో నీటితడులు ఇవ్వడం ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చు. ఈ సమయంలో గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. మొక్కలు పుష్పించే సమయంలో మబ్బులతో కూడిన వాతావరణం మరియు వర్షపు తుంపరలు తేనెబంక తెగులు వ్యాప్తికి దోహదపడతాయి. ఈ తెగులు నివారణకు పైరుపూతదశలో కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వారం వ్యవధిలో వ్యాధి తీవ్రతను బట్టి రెండుసార్లు సస్యరక్షణ చర్యలను చేపట్టాలి.

**రాగి:** ఈ పంటలో ఎదిగిన మొక్కలలో అగ్గితెగులు ఆశించినప్పుడు ఆకులు, కణుపులు, వెన్నులపైన నూలుకండె ఆకారం మచ్చలు ఏర్పడతాయి. కణుపులపై తెగులు ఆశిస్తే కణుపులు విరిగి పోతాయి. వెన్నుపై ఆశిస్తే గింజలు తాలుగా మారుతాయి.



మొక్కలపై తెగులు ఆశించినప్పుడు 1 గ్రా. కార్బెండాజిమ్ లేదా మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పంటపూత, గింజ పాలుపోసుకునే దశల్లో పైరు నీటి ఎద్దడికి గురికాకుండా చూడాలి.

**కొర్ర:** పంటలో అగ్గితెగులు గమనించినట్లైతే నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లేదా ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అధిక దిగుబడులను పొందాలంటే పూత మరియు గింజపాలు పోసుకునే దశల్లో పైరు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి.

**జొన్న:** జొన్నని 35 రోజుల తర్వాత నుండి పంటను కోసే వరకు కాండం తొలుచు పురుగు ఆశించే ఆస్కారం ఉంది. కావున ఈ పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను కాండపు సుడుల్లో ఒక ఎకరానికి 4 కిలోలు వేయాలి. తప్పని సరిగా మందును కాండపు సుడుల్లో పడేలాగ వేయాలి.

**డా॥ యం. వి. నగేష్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు) & హెడ్, మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8008404874**

## వేరుశనగ

**వేరుశనగ:** వానాకాలంలో విత్తుకున్న వేరుశనగ పంటలో లద్దె పురుగు ఆశించినట్లైతే పురుగులు తొలిదశలో ఉన్నప్పుడు 5% వేప గింజల కషాయం పిచికారి చేసుకోవాలి. ఎకరాకు 8-10 పక్షి స్థావరాలను అమర్చాలి. ఎదిగిన లార్వాలను నివారించేందుకు ఫ్లూబెండమైడ్ 20% డబ్ల్యుజి 0.6 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఆకుమచ్చ తెగుళ్ళను గమనించినట్లైతే 2 మి.లీ. హెక్సాకొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

యాసంగిలో వేరుశనగ పంటను విత్తుకోవడానికి సెప్టెంబర్ 15 నుండి విత్తుకోవచ్చు. నేలను మెత్తగా దున్ని చదును చేసుకోవాలి. ఆఖరి దుక్కిలో 4-5 టన్నుల పశువుల ఎరువు, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మరియు 20 కిలోల యూరియా వేసుకోవాలి. ఎకరానికి 65-80 కిలోల గింజ అవసరమవుతుంది. ఒక కిలో విత్తనానికి 3 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1 గ్రా. టెబ్యుకొనజోల్‌తో విత్తనశుద్ధి చేయాలి. వరుసకు వరుసకు మధ్య 22.5 సెం.మీ. మొక్కకు మొక్కకు మధ్య 10 సెం.మీ. దూరం ఉండే విధంగా విత్తుకోవాలి. అలాక్లోర్ అనే కలుపు మందును 1.5-2.0 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి 48 గంటలలోపు పిచికారి చేయాలి.

## ఆముదం

- భూమిలో తేమ ఉన్న సమయంలో 15 కిలోల యూరియాను పైపాటుగా వేయాలి. దాసరి పురుగు ఉధృతిని గమనించినట్లైతే తొలిదశలో 5 మి.లీ. వేపనూనె లీటరు నీటికి, పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే డైమిథోయేట్ 30% ఇసి 2 మి.లీ. లేదా మలాథియాన్ 50 ఇసి 3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఎకరాకు 8-10 పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలి. రసం పీల్చే పురుగుల నివారణకై ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పొగాకు లద్దె పురుగును గమనించినట్లైతే తొలిదశలో మోనోక్రోటోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. 5 కిలోల వరి తవుడు + 500 గ్రా. బెల్లం + 500 మి.లీ. మోనోక్రోటోఫాస్ కలిపి విషపు ఎరను వాడవచ్చును. ఎండుతెగులును గమినించినట్లైతే కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ళ దగ్గర నేలను తడపాలి. బూజు తెగులు రాకుండా ఉండేందుకు వాతావరణ



హెచ్చరికల ప్రకారం వర్షానికి 4-6 గంటల ముందు మరియు వర్షాలు తగ్గాక ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువును అదనంగా వేసుకుంటే తర్వాత వచ్చే గెలలు ఆరోగ్యంగా వస్తాయి.

## నువ్వులు

- ఆలస్యంగా విత్తుకున్న వర్షాధార పంట (లేట్ ఖరీఫ్) లో మొక్కలు మొలిచిన 15-20 రోజులకు అదనపు మొక్కలను మరియు కలుపు మొక్కలను తీసివేయాలి.
- విత్తిన 30-35 రోజులకు గొర్రుతో అంతరకృషి చేయాలి.
- విత్తిన 25-30 రోజులకు (వర్షాలు లేని యెడల) పలుచటి నీటి తడి ఇవ్వాలి.
- మొక్కలు మొలిచిన 7-20 రోజులలో మొక్కలు చనిపోవడం గమనించినట్లైతే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలుపుకొని మొక్కల మొదళ్ళ దగ్గర వేయాలి.

## ప్రొద్దుతిరుగుడు

పొగాకు లద్దెపురుగులను గమనించినట్లైతే నొవాల్యురాన్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. బీహారి గొంగళి పురుగు నివారణకై క్వినాల్‌ఫాస్ 25 ఇసి 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు, బూడిదతెగులు నివారణకై ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఆగష్టు రెండవ పక్షంలో విత్తిన ప్రొద్దుతిరుగుడు పంటపై రసం పీల్చే పురుగులను గమనించినట్లైతే మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

## కుసుమ

- సెప్టెంబర్ రెండవ పక్షం నుండి కుసుమను వేసుకోవచ్చు. తేమను నిలుపుకునే బరువైన నల్లరేగడి నేలలు కుసుమ సాగుకు అనుకూలం. ఎకరానికి 4 కిలోల విత్తనం అవసరం అవుతుంది. కిలో విత్తనాన్ని 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ లేదా 1 గ్రా. కార్బండాజిమ్ విత్తనశుద్ధి చేసుకోవాలి. ఎత్తు మడులు, కాలువల పద్ధతిలో నాటుకున్నట్లైతే తేమ సంరక్షణతోపాటు అధిక దిగుబడులు పొందవచ్చును.

**డా॥ యన్. వాణిశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.8186945838**

## సోయాచిక్కుడు

- ఈ మాసంలో సోయాచిక్కుడు పంట పూతదశ పూర్తి చేసుకొని కాయలు ఏర్పడటం నుండి గింజ అభివృద్ధి చెందే దశలో (50-70 రోజులు) ఉంది.
- పంటను ఆలస్యంగా విత్తుకోవడం, జూలై మాసంలో కురిసిన అధిక వర్షాల వల్ల అలాగే ఆగష్టు మాసం మొదటి పక్షంలో ఏర్పడిన స్వల్పకాలిక బెట్ట పరిస్థితుల వల్ల ఈ పంటలో ఎదుగుదల కొంతవరకు మందగించడం జరిగినది.
- అలాగే సోయాచిక్కుడు సాగు చేసిన ప్రాంతాలలో నత్రజని, ఇనుపధాతువు మరియు గంధకం వంటి పోషక లోపాలను కూడా గుర్తించడం జరిగింది.
- పోషకాల లోపాల సవరణకు నీటిలో కరిగే ఎరువులైన మల్టీ-కే (13-0-45) లేదా పాలీఫిడ్ (19-19-19/20-20-20) లీటరు నీటికి 10 గ్రా. కలిపి పిచికారి చేయవలెను.
- అలాగే సూక్ష్మధాతు లోపాల సవరణకు అగ్రోమిన్ మాక్స్ లేదా ఫార్ములా-4 లేక ఫార్ములా-6 ను లీటరు నీటికి 2.5 గ్రా. కలిపి కాయలు ఏర్పడే దశ నుండి 10-15 రోజుల వ్యవధిలో 2 సార్లు చేయవలెను.
- పల్లాకు తెగులు, లద్దెపురుగు, కాండపు ఈగ, పచ్చదోమ మరియు పేనుబంక సమస్యలు చాలా ప్రాంతాల్లో గమనించడం జరిగింది.



- పల్లాకు తెగులు సోకిన మొక్కల ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. పూత దశలో ఆశించినట్లైతే పూత, కాత పూర్తిగా రాలిపోవటం లేదా కాయ తయారవకపోవడం గమనించవచ్చు. ఎకరాకు 10 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకొని తెల్లదోమను అరికట్టవచ్చును. తెగులు ఆశించిన మొక్కలను పీకి లేదా ఆకు కొమ్మ కత్తిరించి పూడ్చిపెట్టాలి లేదా కాల్చివేయాలి. దీని నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా ఎసిటామిప్రిడ్ + బైఫెంథ్రిన్ 1.25 గ్రా. మందులలో ఏదేని ఒక దానిని లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.
- పైన సూచించిన మందులు మిగతా రసం పీల్చే పురుగులను కూడా నియంత్రిస్తాయి.
- పొగాకు లద్దెపురుగు ఆకులలోని పచ్చని పదార్థాన్ని గీకి తినడం వలన ఆకులు జల్లెడలుగా మారుతాయి. అంతేకాకుండా ఆకులకు రంధ్రాలు చేసి ఆకులను పూర్తిగా, పువ్వులను మరియు కాయలను కూడా తింటుంది. పురుగు ఉధృతిని గమనించడానికి ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలను అమర్చాలి. పురుగు గ్రుడ్లను మరియు తొలిదశ పురుగులను గమనించిన వెంటనే వేపనూనె (అజాడిరెక్టిన్) 1500 పి పి యం 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను. ఉధృతి ఎక్కువైనప్పుడు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా. లేదా ఫ్లూబెండమైడ్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సాకార్బ్ 0.6 మి.లీ. లేదా బ్రోఫ్లానిలిడ్ 0.005 మి.లీ. లేదా స్పైనోటోరమ్ 0.9 మి.లీ. లేదా టెట్రానిలిప్రోల్ 0.5 మి.లీ. లేదా నొవాల్యురాన్ + ఇండాక్సాకార్బ్ 1.65 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మందుల పిచికారి అనంతరం కూడా ఉధృతి తగ్గకపోతే విషపు ఎరలను వాడవలెను.
- కాండపు ఈగ నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఇథియాన్ 3 మి.లీ. లేదా లామ్డాసైహలోత్రిన్ 1.0 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ + లామ్డాసైహలోత్రిన్ 0.4 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ + లామ్డాసైహలోత్రిన్ 0.4 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- పెంకు పురుగు నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా. లేదా ఇథియాన్ 3 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా టెట్రానిలిప్రోల్ 0.5 మి.లీ. లేదా థయాక్లోప్రిడ్ 1.5 మి.లీ. లేదా బీటాసైఫ్లుత్రిన్ + ఇమిడాక్లోప్రిడ్ 0.7మి.లీ.లేదా థయోమిథాక్సామ్ + లామ్డాసైహలోత్రిన్ 0.4 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ + లామ్డాసైహలోత్రిన్ 0.4 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- ఆంత్రాక్నోస్ ఆకుమచ్చ మరియు కాయ తెగుళ్ళ నివారణకు ప్రొపికొనజోల్ 1.0 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ + సల్ఫర్ 2.5 గ్రా. లేదా పైరక్లోస్ట్రోబిన్ + ఇపాక్సీకొనజోల్ 1.5 గ్రా. లేదా పైరక్లోస్ట్రోబిన్ 2 గ్రా. లేదా ఫ్లుపైరాక్సాడ్ + పైరక్లోస్ట్రోబిన్ 0.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- విత్తనోత్పత్తి రైతులు, పూత దశ, కాయలు ఏర్పడు దశల్లో కూడా బెరుకులను గుర్తించి నిర్మూలించవలెను. పూత రంగులో తేడా కాయలపై నూగు, కాయ సైజు, కాయలలో విత్తనాల సంఖ్య అలాగే ఆకుల నిర్మాణంలో వ్యత్యాసాన్ని బట్టి బెరుకులను గుర్తించాలి.

**డా॥ శ్రీధర్ చౌహాన్, ప్రధాన శాస్త్రవేత్త (సోయాచిక్కుడు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, ఫోన్ నెం.9441167821**

## అపరాలు

తొలకరిలో వేసిన మినుము, పెసర పైర్లు పూత మరియు కాయ దశల్లో మరియు కంది శాఖీయ దశల్లో ఉన్నాయి. మినుము, పెసర పైర్లకు ముఖ్యంగా క్రింది పురుగులు మరియు తెగుళ్ళు ఆశించే అవకాశం ఉంది.



**తలమాడు లేదా మొవ్వుకుళ్ళు:** వైరస్ వల్ల కలిగే తెగులు, తామర పురుగులు దీని వ్యాప్తికి దోహదపడతాయి. ముఖ్యంగా బెట్ట వాతావరణంలో ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ తెగులును నివారించాలంటే తామర పురుగులను నియంత్రించాలి. వీటి నివారణకు 1 గ్రా. ఎసిఫేట్ లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి ఉధృతిని బట్టి వారం రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి. ఒక అడుగు ఎత్తులో నీలి రంగు జిగురు అట్టలను, ఎకరానికి 20 ఉంచినట్లైతే తామర పురుగుల ఉధృతిని తెలుసుకొనవచ్చును.

**పల్లాకు తెగులు:** పల్లాకు తెగులు సోకిన మొక్కలను మరియు ఇతర కలుపు మొక్కలను పీకి నాశనం చేయవలెను. పైరుపై ఒక అడుగు ఎత్తులో పసుపు రంగు రేకులను గాని అట్టలను గాని ఉంచి వాటి మీద ఆముదం గాని గ్రీజుగాని పూసినట్లైతే తెల్లదోమ ఉధృతిని తెలుసుకొనవచ్చును. తెల్లదోమ నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లీటరు నీటిని కలిపి, పురుగుల ఉధృతిని బట్టి 7 నుండి 10 రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి.

**మారుకా మచ్చల పురుగు:** పూతదశలో 'మారుకా' అను గూడు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేక నొవాల్యురాన్ 1.0 మి.లీ. లేక స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేక క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. మందును పిచికారి చేస్తే పురుగును నివారించవచ్చు. అవసరమైతే వారం రోజుల తర్వాత మరల పిచికారి చేయాలి.

**ఆకుమచ్చ తెగులు:** ఈ తెగులు సోకిన ఆకులపై గోధుమ రంగు గుండ్రని చిన్న చిన్న మచ్చలు కనిపిస్తాయి. ఈ మచ్చలు పెద్దవై ఆకులు ఎండి రాలిపోతాయి. దీని వలన కాయల్లో గింజలు సరిగా నిండవు. నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1 గ్రా. క్లోరోథలోనిల్ లేదా 1 గ్రా. కార్బెండాజిమ్ లేదా 1 గ్రా. థయోఫానేట్ మిథైల్‌లను కలిపి పిచికారి చేయాలి. మినుము, పెసర పైర్లను సెప్టెంబర్ రెండవ పక్షంలో వేసుకోవచ్చు.

**యాసంగి మినుము, పెసరకు అనువైన రకాలు:** ఎమ్.బి.జి 207, బి.జి.జి 1, టి.బి.జి 104, ఎల్.బి.జి 787, ఎల్.బి.జి 752, పి.యు 31, ఎమ్.బి.జి 1070

**పెసర:** ఎమ్.బి.జి 295, ఎమ్.బి.జి 385, ఎమ్.బి.జి 351, ఎమ్.బి.జి 347, ఎమ్.బి.జి 348, డబ్ల్యు.జి.జి 42, టి.యం 96-2, ఎల్.జి.జి 460, ఎల్.జి.జి 407, ఐ.పి.యం 2-14

**విత్తే సమయం:** యాసంగి-15 సెప్టెంబర్ నుండి అక్టోబర్ వరకు విత్తాలి.

**విత్తన మోతాదు:** 6-8 కిలోలు ఎకరాకు విత్తనం అవసరమవుతుంది.

**విత్తనశుద్ధి:** కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ లేదా మ్యాంకోజెబ్ మందుతో విత్తనశుద్ధి చేసిన తరువాత 5 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనశుద్ధి చేసి విత్తితే తొలిదశలో ఆశించే రసం పీల్చే పురుగులు మరియు తెగుళ్ళ బారి నుండి కాపాడుకోవచ్చును. చివరగా విత్తే ముందు 10 కిలోల విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చర్‌ను పట్టించి విత్తుకోవాలి.

**అంతరకృషి:** పెసర/మినుము పైరును 30 రోజుల వరకు కలుపు బారి నుండి రక్షించుకోవాలి. 20 రోజులు, 30 రోజుల దశలో గొర్రు/దంతి ద్వారా అంతరకృషి చేస్తే కలుపు నివారణతోపాటు తేమను కూడా నిలుపుకోవచ్చు.

కలుపు అధికంగా ఉండే భూములలో పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.0-1.4 లీటర్ల చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజుగాని పిచికారి చేయాలి. 20-25 రోజులలో వెడల్పాకు కలుపు నివారణకు ఇమజితాఫిర్ (పర్సుట్) 300 మి.లీ. ఎకరాకు లేదా గడ్డిజాతి కలుపు నివారణకు ఎకరాకు 400 మి.లీ. క్విజలోఫాప్ ఇథైల్ లేదా ప్రొపిక్విజాఫాప్ 10% ఇ.సి 250 మి.లీ.



పిచికారి చేయాలి. కలుపు మందులు పిచికారి చేసేటప్పుడు నేలలో తగు తేమ ఉండేలా చూసుకోవాలి.

**నీటి యాజమాన్యం:** వానాకాలంలో పెసర, మినుమును వర్షాధారంగా పండిస్తారు. బెట్ట పరిస్థితులలో అవసరం మేరకు కీలక దశల్లో 1-2 తడులు ఇచ్చినచో మంచి దిగుబడి సాధించవచ్చును.

**కీలక దశలు:** పూత మరియు కాయ తయారయ్యే దశలో పంట బెట్టకు గురికాకుండా చూడాలి. బెట్ట పరిస్థితుల్లో 2% (20 గ్రా. లీటరు నీటికి) యూరియా ద్రావణాన్ని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సార్లు పిచికారి చేయాలి.

**కంది:** కంది పైరును నీటి వసతి ఉన్న ప్రాంతాలలో సెప్టెంబర్ నెలలో సాగు చేసుకునే అవకాశముంది.

**రకాలు:** డబ్ల్యుఆర్‌జి-65, ఐసిపియల్-87119 (ఆశ), డబ్ల్యుఆర్‌జి-255, టిడిఆర్‌జి-59, ఐసిపియల్-2740, టిడిఆర్‌జి-4

**విత్తు సమయం:** సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 15 వరకు విత్తుకోవచ్చును.

**విత్తు దూరం:** భూ స్వభావాన్ని బట్టి 60×20 సెం.మీ. / 90×20 సెం.మీ. / 120×20 సెం.మీ. దూరాన్ని మార్చుకొనవలెను.

**ఎరువులు:** నత్రజని 20 కిలోలు, భాస్వరం 50 కిలోలు హెక్టారుకు దుక్కిలో వేయవలెను. సూటి ఎరువులు అయినటువంటి యూరియా మరియు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వాడవలెను.

కంది పెరిగే దశలో ఆకు చుట్టు పురుగు ఆశిస్తుంది. దీని ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే నివారణకు 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా 2 మి.లీ. క్వినాల్‌ఫాస్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**

## ప్రత్తి

- ప్రత్తి పంట ప్రస్తుతం పూత, కాత దశలో (60-75 రోజులు) ఉన్నది. జూలై మాసంలో కురిసిన అధిక వర్షాలు, తదనంతరం ఆగష్టు మొదటి పక్షంలో ఏర్పడిన తాత్కాలిక బెట్ట పరిస్థితుల వలన ప్రత్తి మొక్కల ఎదుగుదల ఆశించినంతగా లేదు.
- పై పాటుగా వాడవలసిన ఎరువులు, సకాలంలో చేపట్టవలసిన అంతరకృషి పనులు, సస్యరక్షణ చర్యలను చేపట్టలేకపోవడం దీనికి ప్రధాన కారణాలు.
- పై పరిస్థితుల దృష్ట్యా చాలా చోట్ల రసం పీల్చు పురుగులైన పేనుబంక, పచ్చదోమ, తామర పురుగు మరియు తెల్లదోమల ఉధృతి ఎక్కువగా కనిపిస్తుంది.
- గులాబి రంగు పురుగు కూడా పూత, కాత పైన అక్కడక్కడే కనిపిస్తుంది.
- అధిక వర్షాల వల్ల / బెట్ట పరిస్థితుల దృష్ట్యా ఎదుగుదల లోపించిన ప్రత్తిలో ఎకరాకు 30 కిలోల యూరియా మరియు 10 కిలోల పొటాష్ ఎరువులను భూమి ద్వారా చేనుకు అందజేయాలి. అలాగే పై పాటుగా లీటరు నీటికి 20 గ్రా. యూరియా లేదా 10 గ్రా. 19:19:19 లేదా 20:20:20 లేదా 13:0:45 లాంటి స్థూల పోషకాలను మరియు 5 గ్రా. సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని వారం-పది రోజుల వ్యవధితో చేనుపై 1-2 సార్లు పిచికారి చేయాలి.
- ఆకులు ఎరుపు లేదా పండాకుగా మారిన పరిస్థితులలో లీటరు నీటికి 10 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ + 2 గ్రా. జింక్ సల్ఫేట్ + 2 గ్రా. బోరాన్ + 10 గ్రా. యూరియాను కలిపి వారం-పది రోజుల వ్యవధిలో కనీసం రెండు సార్లు పిచికారి చేయాలి.
- ప్రత్తిని ఆశించిన రసం పీల్చే పురుగులైన పేనుబంక, పచ్చదోమ, తెల్లదోమ మరియు తామర పురుగుల నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లేదా సల్ఫాక్సాఫ్లోర్ 1 గ్రా. లేదా డైఫెన్‌థయురాన్ 1.25 గ్రా. లేదా



ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లీటరు నీటికి కలిపి మందులను మారుస్తూ పిచికారి చేయాలి.

- బెట్ట వాతావరణం వల్ల పూత, పిందె రాలటం ఎక్కువగా ఉంటే నివారణకు ప్లానోఫిక్స్ 2 మి.లీ. 10 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- చేనులో బాగా పెరిగిన మొండిజాతి కలుపు నివారణకు గొర్రు, గుంటకలతో లేదా పవర్ వీడర్‌తో 60-70 రోజుల వరకు క్రమం తప్పకుండా అంతరకృషి చేయాలి. తద్వారా పంట త్వరగా ఎదిగి, మంచి పూత మరియు కాతతో అధిక దిగుబడికి దోహదపడుతుంది.
- మొండిజాతి కలుపు నివారణకు లీటరు నీటికి 5 మి.లీ. పారాక్వాట్ లేదా 5 మి.లీ. గ్లూఫోసినేట్ అమ్మోనియం మరియు 20 గ్రా. యూరియా కలిపి ప్రత్తి పంటపై పడకుండా కేవలం కలుపు మొక్కలపై మాత్రమే పడేటట్లు పిచికారి చేయవలెను.
- ప్రత్తి పంటపై కనిపించు వివిధ ఆకుమచ్చల నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1.0 గ్రా. కార్బండాజిమ్ లేదా 2.5 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ మిశ్రమాన్ని 1-2 సార్లు పిచికారి చేయవలెను.
- గులాబి రంగు పురుగు నియంత్రణలో భాగంగా సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపట్టవలెను. పూతదశ నుండి ప్రత్తి చేనులో అవసరాన్ని బట్టి మందులను పిచికారి చేయాలి.
- పంట తొలిదశలో ఆశించు గుడ్డిపూలను ఎప్పటికప్పుడు ఏరి నాశనం చేస్తే ఈ పురుగు నివారణ చాలా సులభం అవుతుంది.
- గుడ్డిపూలను నిర్మూలిస్తూ అవసరాన్ని బట్టి లీటరు నీటికి 2 మి.లీ. క్వినాల్‌ఫాస్ లేదా 1.5 గ్రా. థయోడికార్బ్ లేదా 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ మందులను వారం-పది రోజులకొకసారి పిచికారి చేస్తుండాలి.
- పురుగు మందులలో 1-2 సార్లు 1500 పి.పి.యం వేపనూనెను లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేస్తుండాలి. ముఖ్యంగా పురుగు మందులను చల్లని సమయాల్లో పిచికారి చేయాలి. అలాగే 2 లేదా 3 పురుగు మందులను ఒకేసారి కలిపి పిచికారి చేయకూడదు అలాగే మందులను మార్చి వాడాలి.
- పిండినల్లి నివారణకు వయ్యారిభామ, తుత్తురు బెండ లాంటి కలుపు లేకుండా చూసుకుంటూ, అవసరాన్ని బట్టి 0.75 మి.లీ. సల్ఫాక్సాఫ్లోర్ లేదా 1 మి.లీ. బైఫెన్‌త్రిన్ + క్లోతయానిడిన్ లీటరు నీటికి కలిపి మొక్క అంతా బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి.
- ప్రత్తిని ఆశించే బ్యాక్టీరియా నల్లమచ్చ తెగుళ్ళ నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.
- అధిక సాంద్రత ప్రత్తిని సాగు చేసిన రైతులు, మెపిక్వాట్ క్లోరైడ్ అను అభివృద్ధి నిరోధక మందును (గ్రోత్ రిటార్డెంట్) 1.0-1.5 మి.లీ. లీటరు నీటికి 60 మరియు 80 రోజుల దశలో 2 సార్లు పిచికారి చేయవలెను. మొక్కల ఎదుగుదలను దృష్టిలో పెట్టుకొని పై పిచికారి మందును వాడవలెను, ప్రత్తి మొక్కల ఎదుగుదలను 1.0-1.5 మీ. ఎత్తు వరకు నియంత్రించవలెను. పై మందుల వాడకం ద్వారా అనవసరమైన శాఖీయ ఎదుగుదలను నియంత్రించును.

డా॥ శ్రీధర్ చౌహాన్, ప్రధాన శాస్త్రవేత్త, (ప్రత్తి) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, ఫోన్ నెం. 9441167821



## చెఱకు

- అధిక వర్షాలు మరియు తుఫాను గాలులకు పంట పడిపోకుండా మొక్కల వరుసల మొదళ్ళకు ఎత్తుగా మట్టిని ఎగ్రద్రోయాలి. నీటి ముంపునకు గురైన లేదా గురికాబోయే తోటల్లో, ప్రతి 24 మీ.కు 40 సెం.మీ. లోతు, 60 సెం.మీ. వెడల్పు గల కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. తోటల్లో నీరు నిల్వకుండా మురుగు నీటి కాల్వల ద్వారా గాని, లిఫ్టు పంపులు వినియోగించి గాని తరచుగా నీటిని తీసివేయాలి. మురుగు నీటిని తీసివేసిన తర్వాత భూమి ఆరినప్పుడు తోటలకు దగ్గర దగ్గరగా తడులు పెట్టాలి. ఈ మాసంలో దూదేకుల పురుగు పంటను ఆశించి పురుగులు ఆకుల అడుగుభాగాన గుంపులు గుంపులుగా చేరి, ఆకుల నుండి రసాన్ని పీల్చి వేయటం వలన ఆకులు వడలిపోతాయి. నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- వాతావరణం మబ్బుగా ఉండి 19-35 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత మరియు 80-90 శాతం గాలిలో తేమ ఉన్నప్పుడు తెల్ల పేను (ఊలి ఎఫిడ్) అభివృద్ధి చెందుతుంది. దీని యొక్క తల్లి మరియు పిల్ల పురుగులు ఆకుల అడుగుభాగంలో గుంపులుగా ఉండి రసాన్ని పీల్చడం వలన తెలుపు, పసుపు వర్ణం మిళితమైన మచ్చలు ఏర్పడతాయి. మొదట అంచులు తర్వాత మొత్తం ఆకులు క్రమేపి ఎండిపోతాయి. ఈ పురుగుల విసర్జన తియ్యని జిగట పదార్థం లాగా ఉండి కిందున్న ఆకుల పైభాగాన పడి, దాని మీద సూటీమోల్డ్ అనే నల్లని శిలీంధ్రం పెరిగి ఆకు మసిబారుతుంది. గాలి ద్వారా 1.5-2.0 కి.మీ. దూరం వరకు ఈ పురుగులు వ్యాప్తి చెందగలవు. పంటకు సిఫార్సు చేసిన మోతాదులో నత్రజని ఎరువులు వాడాలి. పురుగు ఆశించిన ఆకులను తీసి తగులబెట్టాలి. లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. మోతాదులో కలిపి పిచికారి చేయాలి.
- ఈ మాసంలో పిండి పురుగు కూడా పంటను ఎక్కువగా ఆశించి నష్టపరుస్తుంది. పురుగులు ఆకు తొడిమెలకు, చెఱకు గడలకు మధ్య గుంపులు గుంపులుగా చేరి గడల నుండి రసాన్ని పీల్చి వేస్తాయి. పంట పక్వానికి వచ్చునప్పుడు పిండినల్లి తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఉధృతంగా ఉన్నప్పుడు మొవ్వు ఎండిపోతుంది. ఎదిగిన తోటల్లో పురుగు నివారణకు ఆకులు రెలచి, బహిర్గతమైన కణుపుల మీద లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. మోతాదులో కలిపి పిచికారి చేయాలి. ఇటీవల కాలంలో ఆకుపై ఆశిస్తున్న పిండినల్లి (డిస్మికాకస్ కారెన్స్) నివారణకు కూడా పైన సూచించిన మందులను ఆకు తడిచేటట్లుగా పిచికారి చేసి పురుగును అదుపులో ఉంచవచ్చు.

డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్
వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్,
ఫోన్ నెం. 9849535756

## ఇంట్లోనే తేనె స్వచ్ఛత గుర్తించడం మీకు తెలుసా?



# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

భారత వాతావరణ విభాగం వారి సమాచారం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాలు జూన్ 22 వ తేదీన ప్రవేశించి జూన్ 24 వ తేదీన రాష్ట్రమంతటా విస్తరించాయి. రాష్ట్రంలో 01.06.2023 నుండి 31.08.2023 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 575.9 మి.మీ. గాను 642.5 మి.మీ. అనగా 12 శాతం అధిక వర్షపాతం నమోదైనది. ఆగష్టు మాసంలో కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 217.4 మి. మీ. గాను 79.9 మి.మీ. అనగా సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షపాతం (-63 శాతం) నమోదైనది.

రాష్ట్రంలో వానాకాలం పంటకాలానికి ఇప్పటి వరకు (30.08.2023) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి - 112 శాతం (5590978), జొన్న - 33 శాతం (26823), మొక్కజొన్న - 73 శాతం (521337), కంది - 60 శాతం (458608), పెసర - 43 శాతం (53474), మినుములు - 43 శాతం (19427), వేరుశనగ - 30 శాతం (9008), ఆముదము - 11 శాతం (3232), సోయాచిక్కుడు - 107 శాతం (443775) మరియు ప్రత్తి - 88 శాతం (4470360) సాగు చేయటం జరిగింది. ఈ సంవత్సరం వానాకాలంలో ఇప్పటి వరకు 94 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 69 శాతం, పప్పుదినుసులు 56 శాతం, నూనె గింజల పంటలు 88 శాతం సాగుచేయటం జరిగింది.

భారత వాతావరణ విభాగం న్యూఢిల్లీ వారి ముందస్తు వాతావరణ అంచనాల ప్రకారం, సెప్టెంబర్ మాసంలో తెలంగాణ రాష్ట్రంలోని ఈశాన్య జిల్లాలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం, దక్షిణ తెలంగాణ జిల్లాలలో సాధారణ వర్షపాతం, ఉత్తర మరియు మధ్య తెలంగాణ జిల్లాలలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగాను (ఈశాన్య జిల్లాలలో సాధారనం కంటే ఎక్కువగాను) మరియు కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.

## వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- వర్షాధార పంటలలో అంతర కృషి చేసి కలుపు నివారించి నేలలో తేమను సంరక్షించుకోవాలి మరియు చివరి అంతర కృషి తరువాత గొడ్డు చాలు వేయడం ద్వారా నేలలో తేమను సంరక్షించుకోవచ్చు.
- నీటి వసతి తక్కువగా ఉండి వరి పంట వేయలేని రైతులు సెప్టెంబర్ 15వ తేది తరువాత వారి ప్రాంతానికి అనువైన అపరాలను (పెసర మరియు మినుము), జొన్న, మొక్కజొన్న, వేరుశనగ మరియు కంది పంటలను తక్కువ నీటి వసతితో విత్తుటకు అనుకూల సమయం.
- వరి పంట పూతదశలో మానిపండు మరియు గింజ నల్ల మచ్చ తెగులు ఆశించే అవకాశం కలదు. నివారణకు, ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 25% + టేబుకోనజోల్ 50% (75 డబ్ల్యుజి) 160 గ్రా. ఎకరానికి లేదా ప్రోపికోనజోల్ 200 మి. లీ. ఎకరానికి లేదా పికాక్సీస్ట్రోబిన్ 7% + ప్రోపికోనజోల్ 12% ఎస్ సి 400 మి.లీ. ఎకరానికి పిచికారి చేయాలి.
- ప్రత్తిలో గులాబి రంగు పురుగు ఆశించుటకు అనుకూలం. పురుగు ఉనికిని గమనించడానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకొని వరుసగా 3 రోజులు 7-8 తల్లి రెక్కల పురుగులు గమనించినట్లయితే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నివారణకు 1 మి.లీ. పెన్‌ప్రోపాత్రిన్ లేదా 1 మి.లీ. క్లోరిపైరిఫాస్+సైపర్‌మెత్రిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పూత దశలో ఉన్న మొక్కజొన్న పంట బెట్ట పరిస్థితులను తట్టుకోలేదు కావున రైతులు పైరుకు జీవసంరక్షక నీటి తడి తప్పనిసరిగా ఇవ్వవలెను.
- కూరగాయ పంటలలో కాయతొలిచే పరుగుల ఉధృతిని గమనించుటకు 8-10 లింగాకర్షక బుట్టలను పంటకు ఒక అడుగు ఎత్తులో అమర్చుకోవాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9989625231





# వరిలో సుడిదోమ వలన కలిగే దోమపోటు - యాజమాన్య పద్ధతులు

డా॥ ఆర్. శ్రవన్ కుమార్, డా॥ యు. నాగభూషణం, డా॥ వై. హరి, డా॥ బి. సతీష్ చంద్ర, డి. అశ్విని, డా॥ కె. రాజేంద్రప్రసాద్, డా॥ సి.హెచ్. దమోదర రాజు మరియు డా॥ ఆర్. ఉమారెడ్డి

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్

మన తెలంగాణ రాష్ట్రంలో వరి ప్రధాన ఆహార పంట. వరి సాగులో పంట దిగుబడిని వివిధ రకాల పురుగులు, వివిధ రకాల తెగుళ్ళు ప్రభావితం చేస్తాయి. వరిని 100 కి పైగా వివిధ జాతులకి చెందిన పురుగులు ఆశించి నష్టం చేసినప్పటికీ, వాటిలో కొన్ని మాత్రమే దిగుబడిని ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. వరినాశించి ఎక్కువ నష్టం చేసే పురుగులలో సుడిదోమ ముఖ్యమైనది. వరి పంటను ఆశించే దోమలు రెండు రకాలు. ఒకటి గోధుమ రంగు దోమ, ఇంకొకటి తెల్లమచ్చ దోమ. ఈ సుడిదోమ వలన 10-70% నష్టం కలుగుతుంది. ఒక్కోసారి 100% నష్టం కూడా కలిగిస్తుంది. వరిలో ఈ సుడిదోమ వలన దోమ పోటు వచ్చి వరికి విపరీత నష్టం కలిగిస్తుంది.

**దోమ ఉధృతి పెరగటానికి అనుకూల అంశాలు:**

- దోమను తట్టుకోలేని రకాలను సాగు చేయటం.
- ఒక ప్రాంతంలో ఒకేసారి నాట్లు వేయకుండా, దఫా దఫాలుగా నాట్లు వేయడం.
- దగ్గర దగ్గరగా నాట్లువేయటం.
- పొలంలో పంట మొదటి దశ నుంచి చివర వరకు ఎక్కువ నీరు నిల్వ ఉంచటం.
- నత్రజని ఎరువులను సిఫారసు చేసిన దానికంటే ఎక్కువ వేయటం. పొటాష్ ఎరువులను తక్కువగా కాని, లేదా అసలు వేయకపోవడం.
- పగటి ఉష్ణోగ్రతలు 25-30$^0$ సెల్సియస్ మరియు రాత్రి ఉష్ణోగ్రతలు 20-21$^0$ సెల్సియస్ మధ్య ఉన్నప్పుడు, ఆగష్టు నెలలో 300- 400 మి.మీ. వర్షపాతం ఉన్నప్పుడు.
- పొలాల్లో, కాలి బాటలు తీయనప్పుడు
- పంట తొలిదశలో ఆశించే పురుగుల నివారణ కోసం క్లోరిపైరిఫాస్, ప్రొఫెనోఫాస్ లేదా లామ్డాసైహలోత్రిన్ మరియు బీటా సైఫ్లుత్రిన్ వంటి సింథటిక్ పైరిథ్రాయిడ్ మందులను వాడినప్పుడు

**సుడిదోమ జీవిత చక్రం:** పెద్ద దోమలు సుమారుగా 4-4.5 మి.మీ. పొడవు ఉంటాయి. పెద్దదోమలు పొడవాటి రెక్కలు కలవి మరియు పొట్టి రెక్కలు కలవి రెండు రకాలుగా ఉంటాయి. ఆడదోమ ఆకు మట్టలలో 200-300 గ్రుడ్లను చొప్పించి పెట్టును. గ్రుడ్ల నుండి 6 రోజులలో పిల్ల దోమలు వెలువడుతాయి. పిల్లదోమలు తొలుత తెలుపు రంగులో ఉండి తర్వాత గోధుమ రంగులోకి మారతాయి. పిల్లదోమ 5 దశల తర్వాత తల్లి (పెద్ద) దోమగా మారుతుంది. 15 రోజులలో పిల్లదోమ దశ పూర్తవుతుంది. తల్లి దోమలు 18-20 రోజులు మనుగడ సాగిస్తాయి.

**నష్టపరిచే విధానం - నష్ట లక్షణాలు:**

ఈ దోమలు వరిలో సంవత్సరం పొడవునా కనిపించినప్పటికీ, వానాకాలంలో సెప్టెంబర్ నుండి నవంబర్ వరకు, యాసంగిలో మార్చి 2వ వారం నుండి ఏప్రిల్ వరకు ఎక్కువగా ఆశిస్తాయి. పిల్ల మరియు పెద్ద దోమలు మొక్కల/దుబ్బుల మొదళ్ళ దగ్గర నీటిపై భాగంలో ఉండి కాండం నుండి రసాన్ని పీలుస్తాయి. మొదట దుబ్బుల మొదళ్ళ దగ్గర ఉన్న ఆకులు ఎండిపోయి గడ్డిలాగా అయి, తర్వాత పంట లేత పసుపు రంగుకి మారుతుంది. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పంట సుడులు సుడులుగా వలయాకారంలో ఎండిపోతుంది. అందుకే ఈ దోమను సుడిదోమ అని పిలుస్తారు. దీనినే దోమ పోటు లేదా హాపర్ బర్న్ అని అంటారు. దుబ్బుల మొదళ్ళ దగ్గర ఆకులపై మసి కనిపిస్తుంది. అందువలన దీనిని మసి పేను అని పిలుస్తారు. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పొలంలో నీటిని గమనించినట్లైతే ఈ దోమల సమూహం ఒక తెట్టులాగా తేలుతూ కనబడుతుంది. ఈ పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నట్లైతే పొలం ఎండిపోయి

పడిపోవటం, గొలుసులోని గింజలు తాలుగా మారటం, గింజ నాణ్యత దెబ్బతినటం, నూకశాతం ఎక్కువ కావటం జరుగుతుంది. సుడిదోమ వలన 'గ్రాసీ స్టంట్' అను వైరస్ తెగులు వ్యాప్తి చెందుతుంది.

తల్లి దోమ గ్రుడ్లను చొప్పించి పెట్టినప్పుడు చేసే రంధ్రాల వలన శిలీంధ్రాలు మరియు బ్యాక్టీరియా సూక్ష్మజీవులు మొక్కలలోనికి ప్రవేశించి తెగుళ్ళను కలిగిస్తాయి.

**యాజమాన్య పద్ధతులు:**

- దోమను తట్టుకొనే రకాలను సాగు చేయాలి. ఉదా॥ యం.టి.యు 1061 మరియు యం.టి.యు-1001 రకాలు దోమను బాగా తట్టుకొంటాయి. యం.టి.యు-1010, జె.జి.యల్-18047 (బతుకమ్మ), కె.యస్.యం-118 (కునారం సన్నాలు), జె.జి.యల్-24423, డబ్ల్యు.జి.యల్ -915, డబ్ల్యు.జి.యల్-697 అను రకాలు సుడిదోమను కొంతవరకు తట్టుకుంటాయి.
- నాట్లు దగ్గర దగ్గరగా వేయకుండా, చదరపు మీటరుకి సిఫారసు చేసిన విధంగా మొక్కలు ఉండేటట్లు నాట్లు వేసుకోవాలి.
- నాట్లు వేసేటప్పుడు ప్రతీ 2 మీ. కి 20 సెం.మీ. కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి.
- పొలం లోపల, గట్లపైన కలుపు మొక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలి.
- సిఫారసు చేసిన దానికన్నా ఎక్కువ నత్రజని ఎరువులను వాడకూడదు. నత్రజని ఎరువులను ఒకేసారి కాకుండా నిర్ధేశించిన మోతాదును 3-4 సార్లు వేయాలి.
- పొలాన్ని అప్పుడప్పుడు ఆరబెడుతూ నీటి తడులివ్వాలి.
- పైరు తొలిదశలో దోమ ఉధృతి పెరగటానికి ఉపయోగపడే రసాయనిక మందులను వాడకూడదు.
- పంట తొలిదశలో విచక్షణారహితంగా రసాయన పురుగు మందులను ఉపయోగించకూడదు. తద్వారా సాలె పురుగు, మిరిడ్ నల్లి, అక్షింతల పురుగుల వంటి మిత్ర పురుగులు సంరక్షింపబడి, వాటి సంఖ్య పెరిగి, దోమల సంఖ్య నియంత్రణలో ఉంటుంది.
- పిలక దశలో దుబ్బుకి 10-15, అంకురం నుండి ఈనిక దశలో దుబ్బుకి 20-25 దోమలు ఉన్నట్లైతే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. తొలిదశలో ఎసిఫేట్ 75 యస్.పి. 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. దోమ తీవ్రత ఎక్కువగా ఉన్నట్లైతే డైనోటెఫ్యూరాన్ 20 యస్.జి 0.4 గ్రా. లేదా బ్యుప్రోఫెజిన్ 1.6 మి.లీ. లేదా పైమెట్రోజైన్ 50 డబ్ల్యు.జి 0.60 గ్రా. లేదా ట్రైఫ్లూమెజోపైరిమ్ 0.485 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 40% + ఎథిప్రోల్ 40% డబ్ల్యు.జి 0.25 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ళపై పడేటట్లు పిచికారి చేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9885257714**

**పి.జె.టి.యస్.ఏ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:30 నుండి 2:30 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.**

| తేది | అంశం |
|---|---|
| 06-09-2023 | వరిలో సస్యరక్షణ |
| | కంద్ల కలక |
| 13-09-2023 | ప్రత్తిలో సూక్ష్మ పోషక లోపాలు - సవరణ |
| | మహిళా స్వయం ఉపాధి పథకాలు |
| 20-09-2023 | కందిలో మారుకామచ్చల పురుగు, శనగ పచ్చ పురుగు - సమగ్ర యాజమాన్యం |
| | చిరుధాన్యాల ప్రాముఖ్యత |
| 27-09-2023 | ప్రత్తిలో గులాబి రంగు పురుగు - సమగ్ర యాజమాన్యము |
| | చెట్ల పెంపకం మరియు ప్రాముఖ్యత |





# వరిని నాశించే బ్యాక్టీరియా ఎండాకు తెగులు మరియు పాముపొడ తెగులు - వాటి యాజమాన్యం

డి. అశ్విని, డా॥ ఆర్. శ్రవణ్ కుమార్, డా॥ సి.హెచ్. దామోదర రాజు మరియు డా॥ ఆర్. ఉమారెడ్డి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్

మన తెలంగాణ రాష్ట్రంలో వానాకాలంలో సాగు చేసే పంటల్లో వరి ప్రధానమైన పంట. అయితే ఈ పంటను అనేక రకాల తెగుళ్ళు, కీటకాలు ఆశించడం వల్ల దిగుబడులు చాలా వరకు తగ్గుతున్నాయి. వరిని తొలిదశలో ఆశించి నష్టం చేసే తెగుళ్ళలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు మరియు పాముపొడ తెగులు ముఖ్యమైనవి.

**బ్యాక్టీరియా ఎండాకు తెగులు:** వానాకాలంలో వరిని ఆశించే తెగుళ్ళలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు అత్యంత ప్రధానమైనది. సాధారణంగా ఈ తెగులు వరి పంట దుబ్బు కట్టేదశలో ఎక్కువగా ఆశిస్తుంది. ఈ తెగులు నివారణకు ఎలాంటి మందులు లేవు. కాబట్టి తెగులు లక్షణాలను తొలిదశలో గుర్తించి సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల ఎక్కువ నష్టం కలుగకుండా పంటను కొంతవరకు కాపాడుకోవచ్చు.

**తెగులు లక్షణాలు:** ఈ తెగులు ఆశించిన ఆకుల మీద పసుపు రంగు నీటి డాగు మచ్చలు ఏర్పడి అంచుల వెంబడి అలల మాదిరిగా పై నుండి క్రిందకు వ్యాప్తి చెందుతాయి. ఉదయం 7 గంటల ప్రాంతంలో తెగులు సోకిన ఆకుల నుండి పసుపు పచ్చని జిగురు పదార్థం పైకి వచ్చి సూర్యరశ్మికి గట్టిపడి గాలి వీచినప్పుడు ఆకుల నుండి నీటిలో రాలిపడతాయి. ఈ ఉండలు నీటి ద్వారా ఒక మొక్క నుండి ఇంకొక మొక్కకు, ఒక పొలంలో నుండి ఇంకొక పొలంలోకి వ్యాప్తి చెంది తెగులును వ్యాపింపచేస్తాయి.

వరి పైరు ఈనిక దశలో ఉన్నప్పుడు ఈ తెగులు ఆశించినట్లైతే ఆకుల్లో హరిత పదార్థం తగ్గి మొక్కలలో కిరణజన్య సంయోగ క్రియ తగ్గటం వలన వెన్నులు పాక్షికంగా బయటకు రావటం జరుగుతుంది. గింజలు పాలుపోసుకోక తాలు గింజలుగా మారతాయి. ఈ తెగులు యొక్క లక్షణాలు కొంచెం పోషక లోపాలకు దగ్గరగా ఉంటాయి. కాబట్టి తెగులు లక్షణాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

**అనుకూల వాతావరణ పరిస్థితులు:** సెప్టెంబర్ మరియు అక్టోబర్ మాసాల్లో అధిక వర్షపాతం గనుక ఉంటే ఈ తెగులు ఉధృతి అధికంగా ఉంటుంది. గాలిలో అధిక తేమశాతం, ఎడతెరిపి లేకుండా చిరుజల్లులు పడటం, అధిక వేగంతో గాలులు, ఉష్ణోగ్రతలు 22-26$^0$ సెంటిగ్రేడ్ వంటి సమయాల్లో ఉధృతి అధికంగా ఉంటుంది.

మన రైతులు సాగు చేస్తున్న రకాలకు (ఇంప్రూవ్డ్ సాంబ మషూరి తప్ప) బ్యాక్టీరియా ఎండాకు తెగులును పూర్తిగా తట్టుకునే శక్తి లేదు.

- రైతులు పైపాటుగా అధిక మోతాదులో నత్రజని ఎరువును వినియోగించడం వల్ల ఈ తెగులు ఉధృతి ఎక్కువగుతుంది.

**యాజమాన్యం:** ఈ తెగులు లక్షణాలు 5% కంటే ఎక్కువైతే నత్రజని ఎరువును వేయటం తాత్కాలికంగా నిలిపివేయాలి.

- ఈ తెగులు సాగు నీటి ద్వారా వ్యాప్తి చెందుతుంది కాబట్టి, ఈ తెగులు ఆశించిన పొలం నుండి ఇంకొక పొలంలోకి నీటిని పోనియకుండా చూసుకోవాలి.
- పొటాష్ ఎరువును 15 కిలోలు ఎకరానికి దమ్ములో మరియు ఆఖరి దఫాగా వేసుకోవాలి.
- ప్రతి సంవత్సరం మన పొలంలో గనుక ఈ తెగులు ఆశించినట్లైతే, ఈ తెగులును తట్టుకునే ఇంప్రూవ్డ్ సాంబ మషూరి (ఆర్.పి బయో 226) అనే రకాన్ని సాగు చేసుకోవాలి.

- తెగులు లక్షణాలు దుబ్బు కట్టే దశ నుండి చిరుపొట్ట దశలో గమనించినట్లైతే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. + (స్ట్రెప్టోమైసిన్ + టెట్రాసైక్లిన్) లేదా స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకొని తెగులు వ్యాప్తిని కొంతవరకు నివారించుకోవచ్చు.

**పాముపొడ తెగులు:** వరి మొక్కలు పిలకలు దశ నుండి ఎప్పుడైనా ఈ తెగులు ఆశించే అవకాశం ఉంది.

**తెగులు లక్షణాలు:** నీటి మట్టానికి దగ్గరగా ఉన్న ఆకుల తొడిమెల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. మచ్చలు చుట్టూ గోధుమ వర్ణంలో ఉండి మధ్య భాగంలో బూడిద రంగులో ఉంటుంది. వరి మొక్కలు వెన్నులు పైకి తీయు దశలో పైన ఆకులకు కూడా ఈ శిలీంధ్రం వ్యాపించి ఆకులు మరియు మొక్కలు కూడా ఎండిపోతాయి. తెగులు వల్ల ఏర్పడిన మచ్చలపై ఆవగింజ పరిమాణంలో నల్లటి శిలీంధ్ర బీజాలు ఏర్పడతాయి. ఈ బీజాలు రాలిపోయి నీటి ద్వారా ఒక పొలం నుండి ఇంకొక పొలానికి చేరి తెగులును వ్యాపింపచేస్తాయి.

**అనుకూల వాతావరణ పరిస్థితులు:**

- గాలిలో తేమ అధికంగా ఉండడం, ఉష్ణోగ్రతలు 23-35$^0$ సెంటీగ్రేడ్ మధ్యలో ఉండడం.
- వరి నాట్లు దగ్గర దగ్గరగా వేసుకోవడం.
- అధిక నత్రజని ఎరువులు వేసుకోవడం.

**నివారణ:**

- కిలో విత్తనానికి 3 గ్రా. కార్బండాజిమ్‌తో కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.
- నత్రజని ఎరువును 2-3 దఫాలుగా వేసుకోవాలి.
- ఈ శిలీంధ్రం వరి మొక్కల పైనే కాకుండా చాలా రకాల గడ్డిజాతి మొక్కల మీద నివాసముంటుంది. కాబట్టి తెగులుకు నివాసమైన గడ్డిజాతి కలుపు మొక్కలను తీసి పొలం గట్లను శుభ్రంగా ఉంచుకోవాలి.
- తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే ప్రొపికొనజోల్ 1 మి.లీ.లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

ఈ విధంగా తెగుళ్ళను సకాలంలో గుర్తించి, వ్యాప్తిని నివారించుకొని, నివారణ చర్యలు చేపట్టినట్లైతే పంటకి నష్టం కలుగకుండా కాపాడుకోవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.7981080696**

## ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

**పి.జె.టి.యస్.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి బుధవారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. సెప్టెంబర్, 2023 నెలలో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు**

| తేది | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 6-9-2023 | ప్రస్తుతం ప్రత్తి పంటలో చేపట్టవలసిన యాజమాన్య చర్యలు | డా॥ ఓ. శైల, యస్.యమ్.యస్ (కీటక శాస్త్రం) కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, 9951461694 |
| 13-9-2023 | వానాకాలం వరి సాగు సూచనలు | డా॥ జి. శివ ప్రసాద్, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) వ్యవసాయ పరిశోధనా స్థానం, కంపాసాగర్,9652329262 |
| 20-9-2023 | యాసంగి వేరుశనగ సాగులో అనువైన రకాలు - యాజమాన్య పద్ధతులు | కె. స్రవంతి, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం, 9550562393 |
| 27-9-2023 | యాసంగి అపరాల సాగు | డా॥ సి. సుధారాణి, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) & హెడ్ వ్యవసాయ పరిశోధనా స్థానం, తాండూరు, 9959807891 |

**రైతులు కాల్ చేయవలసిన ఫోన్ నంబర్ : 040-23244834 / 040-23244836**





# వర్షాధార మొక్కజొన్న సాగులో ఎదురయ్యే సమస్యలు - సూచనలు

డా॥ బి.మల్లయ్య, డా॥ వై. శివ లక్ష్మి, డా॥ కె. వాణిశ్రీ, డా॥ డి. భద్రు మరియు డా॥ యం.వి. నగేష్ కుమార్
మొక్కజొన్న పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్

మన రాష్ట్రంలో వర్షాధారంగా పండించే పంటలలో ప్రత్తి తర్వాత మొక్కజొన్న రెండవ ప్రధానపంట. వానాకాలంలో ఈ పంటను ఇప్పటివరకు సుమారు 5.0 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. వర్షాధారంగా పండించే మొక్కజొన్నలో వివిధ కారణాలతో రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించలేకపోతున్నారు. దీనికి గల ముఖ్య కారణాలను పరిశీలిస్తే, ఈ పంటను సారవంతమైన భూములలో సాగు చేయకపోవడం, మొలక దశలో పంట నీటి ముంపునకు గురికావడం, వర్షాభావ పరిస్థితులవలన విత్తనం ఆలస్యంగా వేయటం మరియు పంటకాలంలో బెట్ట పరిస్థితులను ఎదుర్కోవటం, కీలక దశలలో తగిన మోతాదులో ఎరువులు వేయలేకపోవడం, అధిక వర్షాల వలన కలుపు నివారణ సకాలంలో చేయలేకపోవటం, పంట సున్నితదశలలో తేమ అందకపోవడం మరియు చీడపీడలను నివారించడంలో తగు సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోలేకపోవడం ముఖ్యమైనవి. వర్షాకాలంలో మొక్కజొన్న సాగులో సరైన యజమాన్య పద్ధతులను సకాలంలో పాటించి, అధికదిగుబడులు సాధించవచ్చు.

### అధిక వర్షాలకు పంట నీటి ముంపుకు గురైనప్పుడు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు:

- పొలం చుట్టూ లోతైన మురుగు కాలువలు ఏర్పాటు చేసి అధిక వర్షపు నీటిని తీసివేయాలి.
- మురుగు నీరును తీసిన తర్వాత 10 గ్రా. పాలిఫీడ్ (19-19-19) / మల్టీ-కె (13-0-45) లేదా 20 గ్రా. యూరియా లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పంట 20-30 రోజుల దశలో హెక్టారుకు 30 కిలోల నత్రజని, 25 కిలోల పొటాష్‌ను అదనపు మోతాదులో వేయవలెను.
- తేమ ఆరిన తరువాత వరుసల మధ్య అంతరకృషి చేసినచో మొక్కల వేర్లకు గాలి ప్రసరించి ఎదుగుదల బాగుంటుంది.
- అధిక వర్షాల తర్వాత పంటను కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉంటుంది కనుక క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లీటరు నీటికి కలపి పిచికారి చేయవలెను.

### బెట్ట పరిస్థితులలో పాటించవలసిన మెళకువలు:

- విత్తనం వేయునపుడు ప్రతి 3-4 పంట సాళ్ళకు నాగలితో లోతుగా గొడ్డుచాళ్ళను వేయడం వలన వర్షపు నీరు ఇంకుటకు సహాయపడి 5 నుంచి 12 శాతము వరకు దిగుబడి పెరిగే వీలుంది.
- 40 రోజుల లోపు పంటకు అదనపు అంతరకృషి చేయడం వలన భూమిలోని తేమను త్వరగా ఆవిరి కాకుండ అదుపు చేయవచ్చు.
- నీటి ఎద్దడి ఉంటే యూరియా 2 శాతం ద్రావణాన్ని (20 గ్రా. యూరియా ఒక లీటరు నీటికి) పంటపై పిచికారి చేసినచో బెట్టపరిస్థితులను కొంత వరకు అధిగమించవచ్చును.
- గ్లైరిసీడియా లాంటి పచ్చిరొట్ట పైరు ఆకులు మరియు కొమ్మలను సాళ్ళ మీదుగా పరిచినట్లైతే బెట్ట పరిస్థితులలో తేమ ఆవిరి కాకుండా ఉపయోగపడడమే కాక 3 శాతము నత్రజని కలిగిన ఈ ఆకు మరియు కొమ్మలు తదుపరి సేంద్రియ ఎరువుగా మారుతాయి.

• వర్షాభావ పరిస్థితుల అనంతరం వచ్చిన వర్షాలకు ఎకరాకు 25 కిలోల యూరియాను అదనంగా వేసుకొని 20 శాతము దిగుబడిని పెంచవచ్చు.

**అంతర పంటలు:** వర్షాధారంగా మొక్కజొన్నను ఒకే పంటగా వేయడానికి బదులు రెండు పంటలను కలిపి వేయడం వలన తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పుడు ఒకపంట నష్టపోయినను ఇంకొక పంట నుండి ఆదాయం పొందడానికి అవకాశం ఉంటుంది. రైతులు మొక్కజొన్నను విత్తుకొన్నప్పుడు ప్రతి రెండు వరుసలకు అంతరపంటగా ఒక వరుస కందిని (2:1) వేసుకున్నచో భూసారము పెరిగి నీటి ఎద్దడి పరిస్థితులలో భూమిలోని తేమ శాతము పరిరక్షించబడును. అంతేకాకుండా 6 సాళ్ళ వేరుశనగ/పెసర/మినుము/బొబ్బర్లు/సోయా చిక్కుడు పంటలకు ఒక చాలు మొక్కజొన్న (6:1) మరియు పసుపు సాగు చేయు ప్రాంతాలలో మొక్కజొన్నను పసుపులో మిశ్రమ పంటగా సాగు చేసుకొని అదనపు ఆదాయము పొందవచ్చు. వరుస క్రమపంటలుగా అపరాలు, ముఖ్యముగా వేరుశనగను యాసంగిలో విత్తుకోవడం వలన తదుపరి వేసే వానాకాలపు మొక్కజొన్నకు భూమిలో స్థిరీకరించిన నత్రజని లభ్యమై రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుటకు రైతులకు వీలవుతుంది.

**కలుపు యాజమాన్యము:** మొక్కజొన్న విత్తిన వెంటనే అధికవర్షాల వల్ల కలుపు మందు పిచికారి చేయలేని పరిస్థితులలో పంట 15 నుండి 18 రోజుల దశలో మొలిచిన కలుపుపై ఎకరానికి టెంబోట్రయోన్ 115 మి.లీ. + అట్రజిన్ 400 గ్రా. లేదా టోప్రామిజోన్ 40 మి.లీ.+ అట్రజిన్ 400 గ్రా. లేదా మిసోట్రయోన్ + అట్రజిన్ 1400 మి.లీ. కలిపి పిచికారి చేసినచో వెడల్పాకు మరియు గడ్డిజాతి కలుపు నివారించుకోవచ్చు. విత్తిన 30 నుంచి 35 రోజులకు కల్టివేటర్‌తో అంతరకృషి చేసి కలుపు మొక్కలను పూర్తిగా నివారించవచ్చు. కల్టివేటర్ నడిపిన తరువాత నత్రజని ఎరువులను వేసి వెంటనే బోదె నాగలిని నడపడం వలన మొక్కల కుదుళ్ళపై మట్టి చేర్చబడి మొక్కలు పడిపోకుండా ఉంటాయి. అలాగే కలుపు మొక్కల నివారణతో పాటు వేసిన నత్రజని ఎరువును మొక్కలు బాగా ఉపయోగించుకొని ఏపుగా పెరుగుతాయి. దీని తరువాత అవసరాన్ని బట్టి సాళ్ళలో కలుపు తీయించాలి.

**చీడపీడల నివారణ:**

• వర్షాధారంగా పండించే మొక్కజొన్నలో పురుగుల సమస్య కూడా అధికంగా ఉంటుంది కనుక రైతులు కాండం తొలుచుపురుగు నివారణకుకు 10-20 రోజుల పైరుపై క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి ఆకుల సుడులలో పిచికారి చేయాలి.

• కత్తెర పురుగు సంవత్సరం పొడవునా ఆశించే అవకాశం ఉన్నది కనుక, పురుగు గమనించిన వెంటనే క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ.లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్క సుడిలో పిచికారిచేయాలి. ఎదిగిన లార్వాల నివారణకు విషపు ఎర మొక్క సుడిలో వేసుకోవాలి.

• పొడి వాతావరణంలో పేనుబంక ఉధృతి ఎక్కువగా ఉండి 30 రోజులు పైబడిన పైరును ఆశిస్తాయి. నివారించడానికి డైమిథోయేట్ 2.0 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

• అధిక ఉష్ణోగ్రత మరియు గాలిలో తేమశాతం అధికమైనప్పుడు బెట్టపరిస్థితులు పూతసమయంలో ఉన్నప్పుడు వడలు తెగులు ఆశిస్తుంది. ముందస్తు చర్యగా విత్తే ముందు 10 గ్రా. ట్రైకోడర్మా శిలీంద్రాన్ని కిలోవిత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. ఇదేకాక, 2 కిలోల ట్రైకోడర్మా శిలీంద్రాన్ని 100 కిలోల పశువుల ఎరువులో వృద్ధి చేసి వరుసగా 3-4 సంవత్సరములు భూమిలో కలపాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9440504167**







# కంది పంటలో చిగుర్లు తుంచే విధానం - ప్రయోజనాలు

డా॥ యం. మధు, డా॥ ఎన్. సంధ్య కిషోర్, డా॥ డి. వీరన్న, డా॥ జి. పద్మజ మరియు డా॥ ఆర్. ఉమారెడ్డి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్

కంది దేశంలో మరియు రాష్ట్రంలో వానాకాలంలో ఎక్కువ మొత్తంలో సాగు చేసుకునే ముఖ్యమైన అపరాల పంట. తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా వికారాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నారాయణ్‌పేట్, కోమురం ఆసిఫాబాద్, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో కందిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. కంది పంట రాష్ట్రంలో సాధారణ విస్తీర్ణం 7.69 ల ఎకరాలలో ఉండగా, ఈ సంవత్సరం (2023-24) 4.56 ల ఎకరాలలో సాగు చేస్తున్నారు.

కంది పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే మేలైన రకాల ఎంపికతో పాటు, వివిధ రకాల యాజమాన్య పద్ధతులను పాటించాలి. అందులో ముఖ్యమైనది తల కొనలు త్రుంచడం దీనినే "చిగుర్లు త్రుంచడం" లేదా "నిప్పింగ్" అని అంటారు.

కంది పంటను విత్తిన తరువాత 45వ రోజు నుండి 60 రోజులలోపు, అనగా దాదాపు మొక్క ఎత్తు 3.0 ఫీట్లు నుండి 4 ఫీట్ల ఎత్తు ఉన్నప్పుడు తల కొనలు 3 అంగుళాల మేర త్రుంచి వేయాలి. ఒక ఎకరం కంది మొక్కల తలకొనలను ఒక మనిషి 3-4 గంటలలో చేయగలడు. ఈ మధ్య కాలంలో రైతు సోదరులు తలకొనలు త్రుంచడం (నిప్పింగ్) పరికరం సహాయంతో చేయడం జరుగుతుంది.

ఈ నిప్పింగ్ పరికరాన్ని బ్యాటరీ స్ప్రేయర్‌కి అమర్చి కంది పంటలో కొనలు త్రుంచడాన్ని ఒక మనిషి 4-5 ఎకరాలల్లో శ్రమ లేకుండా చేసుకోవచ్చు. ఇలా కంది పంటలో తలకొనలు త్రుంచడం వలన, కంది మొక్కల ప్రక్క కొమ్మలు బలంగా వచ్చి పూత, కాత ఎక్కువ ఏర్పడి దిగుబడులు పెరుగుతాయి. ఇలా చేయడం వలన గాలి వెలుతురు బాగా ఆడి పురుగుల తెగుళ్ళ ఉధృతి కూడా తగ్గుతుంది. పూత సమయంలో పురుగుమందుల పిచికారి కూడా సులభం అవుతుంది.

కొనలు త్రుంచని పంటతో పోల్చినప్పుడు కొనలు త్రుంచిన పంటలో దాదాపు 15 శాతం అధిక దిగుబడి సాధించినట్లు పరిశోధనలో తేలింది. కాబట్టి రైతు సోదరులు కంది పంటలో తలకొనలు త్రుంచడం విధిగా చేయాలి.

అధిక వర్షాలు పడుతున్నప్పుడు ఇనుము పోషక లోపం (లేత ఆకుల ఈనెల మధ్య హరిత వర్ణం కోల్పోయి పసుపు రంగులో మారి ఎండి రాలిపోతాయి) కనబడినట్లైతే నివారణకై లీటరు నీటికి 5 గ్రా. ఫెర్రస్ సల్ఫేట్ (అన్నభేది) ఒక గ్రాము నిమ్మ ఉప్పుతో కలిపి పైరుపై వారం రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.

ప్రస్తుత పరిస్థితులలో కంది పంటలో కలుపు లేకుండా కలుపు మందులు పిచికారి చేసిన (20-30 రోజుల) తరువాత కూడా, సాళ్ళ మధ్య గుంటక లేదా గొర్రుతో లేదా మిని ట్రాక్టర్ సహాయంతో అంతరకృషి చేసుకున్నట్లైతే కలుపు నియంత్రించబడి, మొక్క వేర్లకి గాలి ఆడడంతో పాటు, నేలలో తేమని సంరక్షించుకోవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 6301553434



# ఉత్తర తెలంగాణ జిల్లాలలో వర్షాభావ పరిస్థితులు - వివిధ పంటలలో పాటించవలిసిన సూచనలు

డా॥ డి.శ్రీలత, డా॥ యస్. నవత, డా॥ జి. శ్రీనివాస్, డా॥ ఇ. రజనీకాంత్, డా॥ యస్. ఓంప్రకాశ్, డా॥ యస్. బలరామ్, పి.రవి, డా॥ బి. లక్ష్మిప్రసన్న, డా॥ పి. మధుకర్, పి. గోన్యానాయక్ మరియు డా॥ బి. శ్రీనివాస్
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాల



ఉత్తర తెలంగాణా జిల్లాలలో ఇటీవల జూలై మాసంలో దాదాపుగా అన్ని జిల్లాలలో సాధారణం కంటే అధిక వర్షపాతం (+107 శాతం) నమోదు చేయడం జరిగింది. అలాగే ఆగష్టు మరియు సెప్టెంబరు మాసంలో కూడా వర్షపాతం ముందస్తు వాతావరణ సూచనల ప్రకారం చూసినట్లయితే తక్కువగా నమోదు కావడం జరుగవచ్చు. జిల్లాలలో వాతావరణం ప్రధానంగా పొడిగా ఉండవచ్చు. సాధారణంగా ఉత్తర తెలంగాణా జిల్లాలలో వానాకాలంలో వరి, ప్రత్తి, కంది, మొక్కజొన్న, సోయాచిక్కుడు, పసుపు ప్రధానంగా సాగవుతున్న పంటలు. దాదాపుగా అన్ని పంటలు వివిధ దశలో ఉన్నాయి. వరి ప్రధానంగా ఆగష్టు నుండి సెప్టెంబరులో దుబ్బుదశ / పిలకదశ, మొక్కజొన్న మోకాలు ఎత్తుదశ నుండి జల్లు పీచుదశ, సోయాచిక్కుడు, ప్రత్తి, కంది మొక్క ఏపుగా పెరిగే దశ నుండి పూత దశలో ఉంటాయి.

ఈ దశలో ప్రధానంగా ఆచరించవలసిన యాజమాన్య పద్ధతులు మరియు సస్యరక్షణ చర్యలును ఈ క్రింద వివరించడం జరిగింది.

## యాజమాన్య పద్ధతులు:

- సాధారణంగా ఆరుతడి పంటలైన ప్రత్తి, కంది, సోయాచిక్కుడు మరియు మొక్కజొన్నలో నీటి తడులను చాలు విడిచి చాలుకి పారించిడం లేదా డ్రిప్ పద్ధతిలలో ఇచ్చినట్లైతే నీటిని ఆదా చేయవచ్చు.
- ముందస్తు వాతావరణ సూచనల మేరకు తక్కువ వర్షపాతం ఉండడం వల్ల వర్షాధారం క్రింద సాగు చేయు ప్రత్తి, మొక్కజొన్న, కంది, సోయాచిక్కుడు పంటలపై యూరియా లేదా 19-19-19 (పాలీఫీడ్) లేదా మల్టీ.కె (13:0:45) 10 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయడం వల్ల మొక్కలు బెట్ట పరిస్థితులను తట్టుకుంటాయి.
- వివిధ జిల్లాలలో ఈ పంటలు సెప్టెంబరు మాసంలో మొక్క ఏపుగా పెరిగే దశ నుండి పూత దశలో ఉంటాయి కావున రెండో దఫా నత్రజని ఎరువును పైపాటుగా వేసుకోవాలి. నత్రజని ఎరువు వేసిన తరువాత నీటిని పారించాలి. వర్షాధారం క్రింద సాగు చేస్తున్న రైతులు వర్షం పడిన వెంటనే తేమ ఉన్నప్పుడు పైపాటుగా ఎరువులు వేయాలి.
- రైతులు ఆగష్టు, సెప్టెంబర్ మాసాలలో తక్కువ వర్షపాత సూచన ఉండడం వల్ల పైపాటుగా వేసే ఎరువులను ఒకేసారి కాకుండా రెండు మూడు దఫాలుగా వేయడం వల్ల పోషక సామర్థ్యం పెరిగి మొక్కలు పెరుగుదల బాగుంటుంది.
- వర్షాభావ పరిస్థితులలో మొక్కల ఎదుగుదల తక్కువగా ఉన్న ప్రాంతాలలో భూమిలో తేమననుసరించి గుంటక/ గొర్రుతో అంతరకృషి చేసి కలుపును నివారించుకోవాలి.

## సస్యరక్షణ చర్యలు:

వివిధ పంటలలో రసంపీల్చే పురుగుల నివారణకు ఎకరానికి 10 జిగురు అట్టలను అమర్చుకోవాలి. రెక్కల పురుగుల నివారణకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలి.

**వరి:** సాధారణంగా వరి అన్ని జిల్లాలలో నీటి పారుదల క్రింద సాగవుతుంది. వరి ప్రస్తుతానికి పిలక/దుబ్బు దశ నుండి కొన్ని ప్రాంతాలలో పొట్టదశలో ఉంటుంది. వరి పంటలో కాండం తొలిచే పురుగు మరియు ఉల్లికోడు ఆశించే అవకాశం కలదు. పురుగు ఉధృతి గమనించినచో నివారణకు ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా 4 కిలోల క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు చల్లాలి. ఒకవేళ పంట నాటు వేసి 30-40 రోజుల దాటినట్లైయితే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 యస్.పి 2 మీ.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

అధిక వర్షాల తర్వాత బెట్ట పరిస్థితులు, మబ్బుతో కూడిన వాతావరణం, నాట్లు ఆలస్యం అయ్యి, అధిక నత్రజని ఎరువులు. అధిక ఉష్ణోగ్రతలు, కలుపు ఎక్కువగా ఉన్న పొలాల్లో ఆకుముడత, తాటాకు తెగులు, వరి ఈగ ఆశించినట్లైతే క్లోరిపైరిఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ప్రత్తి:**

- ప్రస్తుతం పచ్చదోమ ఆశించే అవకాశం కలదు. దీని నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- బెట్ట వాతావరణంలో పేనుబంక, తామర పురుగు ఆశించే అవకాశం ఉంది. నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**కంది:**

- తొలిదశలో పచ్చదోమ, పేనుబంక ఆశించే అవకాశం ఉంది కావున గమనించినట్లైతే డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- మొగ్గ, పూత సమయంలో అడపాదడపా చిరుజల్లులు కురిసినప్పుడు మారుకా మచ్చల పురుగు ఆశిస్తుంది. నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ప్రోఫెనోఫాస్ 2.0 మి.లీ లేదా నోవాల్యురాన్ 0.75 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- శనగపచ్చ పురుగు గమనించినట్లైతే ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచాకారి చేయాలి.
- ఉధృతి ఎక్కువగా ఉంటే ఇండాక్సాకార్బ్ 1.0 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచాకారి చేయాలి.

**మొక్కజొన్న:**

- కాండం తొలుచు పురుగు నివారణకు 30-35 రోజుల మధ్యకాలంలో మొక్కజొన్నలో కార్బోఫ్యురాన్ 3జి గుళికలు ఎకరానికి 3 కిలోలు మొక్క యొక్క ఆకు సుడులలో వేసుకోవాలి.
- నేలలో తేమ ఎక్కువగా మరియు ఆకాశం మేఘావృతం ఉన్నందున టర్సికమ్ ఆకుమాడు తెగులు ఆశించే అవకాశం కలదు. ముందస్తు చర్యగా నివారణకు మ్యాంకోజెబ్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచాకారీ చేయాలి.

**సోయాచిక్కుడు**

- చిత్తపురుగులు, తామరపురుగులు, కాండం తొలిచే ఈగ గమనించినట్లైతే ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- **పేనుబంక నివారణకు:** ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఎసిటామిప్రిప్ 0.2 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- మబ్బులతో కూడిన వర్షపు వాతావరణ పరిస్థితులలో బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఆశించడానికి అనుకూలం. ఈ తెగులు ఆశించినప్పుడు ఆకులు పసుపు రంగులోకి మారి తరువాత పండిపోయి రాలిపోతాయి. దీని నివారణకు 10 లీటర్ల నీటికి 1 గ్రా. స్ట్రెప్టోసైక్లీన్ + 30 గ్రా. కాపర్ ఆక్సిక్లోరైడ్ కలిపి పిచికారి చేయాలి.
- ఆకు తినే పురుగుల ఉధృతి గమనించినచో నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**పసుపు**

- పంటలో ఆకుమచ్చ తెగులు గమనించినట్లైతే 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 1 గ్రా. థయోఫానేట్ మిథైల్ లేదా 2 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ లేదా 1 మి.లీ. ప్రొపికోనజోల్ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.
- దుంపకుళ్ళు లక్షణాలు గమనించినట్లైతే 1 గ్రా. మెటాలాక్సిల్ + మ్యాంకోజెబ్ లేదా 2 గ్రా. కాప్టాన్ లేదా 3 గ్రా. కాపర్‌ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి తెగులు సోకిన మొక్కల మొదళ్ళు తడిచేలా పోయాలి.
- తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరానికి 1 కిలో సైమాక్సానిల్ + మ్యాంకోజెబ్ పొడి మరియు తగినంత యూరియా (10-20 కిలోలు) కలుపుకొని పొలం అంతట చల్లుకోవాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9849379930

# పంటల సాగులో ఆకర్షక మరియు రక్షక పంటల ప్రాముఖ్యత



డా॥ యస్. ఓంప్రకాశ్, డా॥ ఇ. రజనీకాంత్ మరియు డా॥ జి. శ్రీనివాస్
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాల

ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు సరిపడ ఆహార ఉత్పత్తులను సాధించే క్రమంలో మన రైతాంగం సమగ్ర పంటల యాజమాన్యం కంటే చాలా మంది తమకు ఉన్న అనుభవంతో కాని తోటి రైతులు చేపడుతున్న యాజమాన్య పద్ధతులు బేరీజు వేసుకుని కొన్ని సందర్భాలలో సిఫారసు చేసిన మోతాదును మించి రసాయనిక ఎరువులు మరియు పురుగుల మందులు వాడటం వలన పర్యావరణ సమతుల్యత లోపించడం, పురుగులలో రసాయనాలను తట్టుకునే శక్తి అధికమవడంతో పాటు సాగు ఖర్చులు పెరగడం జరుగుతుంది. వీటన్నింటికీ కారణం రైతులలో సాంకేతికపరమైన అంశాలకు సంబంధించిన అవగాహన లేకపోవడమే. ఈ నేపథ్యంలో సమగ్ర సస్యరక్షణలో భాగంగా పంటలలో ఎర పంటలు (ఆకర్షక పంటలు) మరియు కంచె పంటలు (రక్షక పంటలు) యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది.

**ఎర పంటలు (ఆకర్షక పంటలు):** కొన్ని రకాల పురుగులను కొన్ని రకాల పంటలు ప్రత్యేకంగా ఆకర్షిస్తాయి. ఈ పంటలను ప్రధాన పంటల్లో వేసినట్లైతే పురుగురాకను, ఉనికిని వెంటనే గుర్తించవచ్చు. ఈ పంటల ద్వారా పురుగులు ఆశ్రయించేట్లు చేసి సులభంగా నిర్మూలించవచ్చు. వీటి వలన ప్రధాన పంటపై పురుగుల ఒత్తిడి మరియు పురుగు మందులు వాడాల్సిన ఆవశ్యకత మరియు ఖర్చు తగ్గుతుంది. ఎర పంటలు అనేవి తక్కువ విస్తీర్ణంలో సాగు చేయడానికి అనువుగా చీడపురుగులను ఆకర్షించేదిగా మరియు ముఖ్యపంటను అన్ని దశల్లో కాపాడే విధంగా ఉండాలి. పురుగులు ఎర పంటపై ఎక్కువ ఉన్నట్లు గమనించిన వెంటనే సకాలంలో ఏరివేయాలి. అవసరమైతే రసాయనాలతో నిర్మూలించాలి.

**ప్రత్యేకాంశాలు:**

- ప్రత్తి, వేరుశనగ పంటల్లో ఆముదపు పంట ఎరపంటగా వేయవచ్చు. ఆశించిన పొగాకు లద్దె పురుగును సులభంగా ఏరి నాశనం చేయవచ్చు. బంతి మొక్కలు వేసి శనగపచ్చ పురుగును సులభంగా నివారించవచ్చును. పొగాకులో ఆముదం పంట వేసి లద్దె పురుగును, శనగపంట వేసి శనగపచ్చ పురుగు నివారించవచ్చు.
- క్యాబేజిలో సాధారణంగా వచ్చే డైమండ్ బ్యాక్‌మాత్ (రెక్కల పురుగు) నివారణకు ఆవాలు వేసుకోవచ్చు. వేరుశనగలో దోసవేసి లద్దెపురుగు, ఎర్రగొంగళి పురుగులను కొంతమేరకు అరికట్టవచ్చు. ప్రత్తిలో బెండవేసి పచ్చపురుగు/పచ్చదోమ/మచ్చల పురుగులను గమనించవచ్చు.
- అలసందలో ఆవాలు వేసి గొంగళి పురుగు, ప్రొద్దుతిరుగుడు వేసి కాయతొలుచు పురుగులను నివారించవచ్చు. వేరుశనగలో అలసంద వేసి ఎర్రగొంగళి పురుగు ఉధృతి, ఉనికిని గమనించి నివారించవచ్చు.
- సోయాచిక్కుడులో అలసంద, జీలుగవేసి శనగపచ్చ పురుగు, లద్దె పురుగులను నివారించవచ్చు.

**కంచె పంటలు (రక్షక పంటలు):** పొలంలో ముఖ్యపంటకు చుట్టూగాని, గట్టు వెంబడి గాని కొద్ది వరుసలలో వేసి ఎంపిక చేసిన పైర్లను కంచె పంటలు అంటారు. పురుగులు, తెగుళ్ళ సిద్ధ బీజాలు ప్రక్కపొలం నుండి రాకుండా ఇవి అడ్డుకుంటాయి. ఈ విధంగా చీడపీడల నియంత్రణ జరుగుతుంది. ఇవి ముఖ్య పంటల కన్నా ఎత్తు పెరిగేవిగా ఉండాలి.

- ప్రత్తి చేల చుట్టూ కంచెగా సజ్జ, జొన్న, మొక్కజొన్న పైర్లను 3-4 వరుసలలో వేసుకొంటే బయటనుండి పురుగులు రావడం నిరోధించవచ్చు. ఇవి మిత్రపురుగుల అభివృద్ధికి తోడ్పడుతాయి. ప్రత్యేకించి అల్లిక రెక్కల పురుగుల సంతతి వృద్ధి చెందుతుంది.
- మిరపలో జొన్న, మొక్కజొన్న 2-3 సాళ్ళు కంచె పంటగా వేసుకోవాలి. దీని వల్ల పేనుబంక తద్వారా ఆశించే వైరస్ తెగుళ్ళ తాకిడి తగ్గుతుంది. వేరుశనగకు జొన్న, సజ్జ కంచె పంటలుగా వేస్తే రసం పీల్చే పురుగులు, తిక్కా ఆకుమచ్చ తెగుళ్ళ ఉధృతి తగ్గుతుంది.
- కంచె పంటలను మినుము, పెసర వంటి పైర్లలో కూడా వేసి వెర్రి తెగుళ్ళను వ్యాప్తి చెందించే తెల్లదోమ, త్రిప్స్ వంటి రసం పీల్చు పురుగుల ఉధృతి, వలసలను నిరోధించవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9866373563

# ఆహార వికిరణం - ఆహారాన్ని నిల్వ చేయుటలో నూతన ఒరవడి

డా॥ సునీత దేవి మరియు డా॥ సిహెచ్. వేణు గోపాల రెడ్డి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్

భారతదేశంలో పండించిన కొన్ని రకాల పంటల ఉత్పత్తులు త్వరగా కుళ్ళిపోవడంతో రైతులు దాదాపు 25% వరకు నష్టపోతున్నారు. శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసినా కూడా అవి కొంతకాలానికి కుళ్ళిపోవడం లేదా మొలకెత్తడం జరిగి వృధాగా పోతున్నాయి. ఈ విధంగా నిల్వలో నష్టం జరగడం వలన సరఫరా కొరత ఏర్పడి ధరలు బాగా పెరిగి ముఖ్యంగా ఉల్లి, బంగాళా దుంపలు, వెల్లుల్లి మరియు కొన్ని రకాల కూరగాయల ధరలు బాగా పెరిగి సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి.

గడిచిన జూలై–ఆగష్టు మాసంలో చూసుకున్నట్లైతే దేశవ్యాప్తంగా టమాట ధరలు ఆకాశాన్నంటే పరిస్థితులను మనం గమనించడం జరిగింది. గతంలో ఉల్లిపాయల పరిస్థితి కూడా అలానే జరిగింది. ఇది దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ ఉత్పత్తుల నిల్వలో జరిగే వృధాన్ని తగ్గించి ధరల్ని నియంత్రించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆహారాన్ని ఎక్కువ కాలం నిల్వ చేసే 'ఇరేడియేషన్' అనే ఓ సరికొత్త సాంకేతికతను రైతులకు అందుబాటులోకి తీసుకొని రావడానికి సిద్ధమవుతోంది.

కేంద్ర ప్రభుత్వం ఈ 'ఇరేడియేషన్' అనే సాంకేతికతను ముందుగా ఉల్లిపాయలపై ప్రయోగాత్మకంగా పరిశీలించడానికి నిర్ణయం తీసుకుంది. ఈ పంట పండించిన రైతులు నష్టాల బారిన పడకుండా, ఉల్లిపాయలు ఎక్కువ కాలం కుళ్ళిపోకుండా ఉండటానికి మరియు ఉల్లిపాయల ధరల్లో హెచ్చుతగ్గులను నివారించేందుకు భారత ప్రభుత్వం ఈ ఏడాదిలో ఉల్లిని సేకరించి, బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్) సహాయంతో ఉల్లిపాయలపై "ఇరేడియేషన్" సాంకేతికతను ప్రయోగాత్మకంగా పరిశీలించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఇప్పటికే ఈ సాంకేతికత ఆస్ట్రేలియా, యునైటెడ్ స్టేట్స్, జపాన్, చైనా, ఫ్రాన్స్ మరియు హాలండ్‌తో సహా 40 దేశాల్లో ఉపయోగించి ఆహారాన్ని అయనీకరణం చేయడం అనేది ఆమోదించబడింది. దీనికి "ఇరేడియేషన్" ప్రక్రియతో ఆహారాన్ని రేడియేషన్‌కు గురి చేయడం జరుగుతుంది. దీనినే "ఆహార వికిరణం" అని పిలుస్తారు.

ఆహార వికిరణం (ఆహారానికి అయోనైజింగ్ రేడియేషన్ అప్లికేషన్) అనేది భద్రతను మెరుగుపరిచే సాంకేతికత. సూక్ష్మజీవులు మరియు కీటకాలను తగ్గించడం లేదా తొలగించడం ద్వారా ఆహార పదార్థాల నిల్వ సామర్థ్యాన్ని పొడిగిస్తుంది. ఈ ప్రక్రియలో, ఆహారాన్ని అయనీకరణ శక్తి లేదా రేడియేషన్ మోతాదులకు గురి చేయడం జరుగుతుంది. ఇందుకోసం గామా కిరణాలు, ఎక్స్ కిరణాలు, ఎలక్ట్రాన్ కిరణాలను వినియోగిస్తారు. ఇది తక్కువ



మోతాదులో అందించినట్లయితే, వికరణం వల్ల ఉత్పత్తి యొక్క నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. అదే అధిక మోతాదులో అయితే ఈ ప్రక్రియ కీటకాలు, బ్యాక్టీరియా మరియు ఇతర హానికరమైన సూక్ష్మజీవులను చంపుతుంది. పాలను పాశ్చరైజ్ చేయడం, పండ్లు, కూరగాయలను క్యానింగ్ చేయడం వల్ల వినియోగదారులకు ఎలాంటి లాభాలు కలుగుతున్నాయో అలాంటి ప్రయోజనాలే ఈ విధానంలోనూ కలుగుతాయి.

పేరులో రేడియేషన్ ఉంది గనక ఈ సాంకేతికత ఆహారాన్ని రేడియోధార్మికతగా మారుస్తుందని అపోహ ఉంది. అయితే ఆహార ప్రాసెసింగ్‌లో, అనుమతించబడిన రేడియోధార్మిక మోతాదులు ఆహారాన్ని రేడియోధార్మికత చేయడానికి తగినంత అధిక శక్తి గల గామా, ఎలక్ట్రాన్‌లు లేదా 'ఇ' కిరణాలను ఉత్పత్తి చేయవు. కావున చికిత్స తర్వాత ఆహారంలో రేడియోధార్మిక శక్తి ఉండదని మరియు నాణ్యత, రుచి, ఆకృతి తదితర విషయాల్లో ఎలాంటి మార్పు రాదు అని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి.

ఆహార వికిరణంలో ఈ మార్పు జరిగినా అది స్వల్పంగా ఉంటుందని, అందుకే ఏవైనా పదార్థం "ఇరేడియేషన్" కు గురైందా లేదా అనేది చూసి గుర్తించడం చాలా కష్టం అని తెలిపారు. ఈ విధానాన్ని అమెరికాలోని ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఆమోదించాయి. ఈ సాంకేతికతను మొదటిసారి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరికి చెందిన లెవిస్ స్టాడ్లర్ అనే శాస్త్రవేత్త విత్తనాలపై ప్రయోగం చేశారు. ఈ ప్రక్రియ తృణధాన్యాలు, ఉల్లిపాయలు, బంగాళ దుంపలు మరియు వెల్లుల్లిపై సమర్థవంతంగా పనిచేసిందని తెలిపారు. ఈ ఆహార వికిరణం ఫలితంగా ఆహారంలో గణనీయమైన పోషక మార్పులు లేవని, ఇది ఒక సురక్షితమైన మరియు ప్రభావవంతమైన ప్రాసెసింగ్ అని శాస్త్రీయ పరిశోధనల ద్వారా నిర్ధారించడం జరిగింది. అంతేకాకుండా వికిరణం చేసిన ఆహారాలు స్పష్టంగా లేబుల్ చేయబడతాయి. కాబట్టి వినియోగదారులు దాన్ని బట్టి ఎంపిక చేసుకోవచ్చు.

**ఈ సాంకేతికత వలన కలిగే ప్రయోజనాలు:**

- ఆహారంలోని సాల్మోనెల్లా, ఈకోలి వంటి హానికారక జీవులను సమర్థవంతంగా నిర్మూలించవచ్చు.
- పంట ఉత్పత్తులు కుళ్ళిపోవడానికి కారణమయ్యే జీవులను నాశనం చేయడం వలన ముఖ్యంగా పండ్లు, కూరగాయల నిల్వ కాలంలో గణనీయమైన పెరుగుదల ఉంటుంది.
- ఈ ప్రక్రియ వలన పండ్లలోని కీటకాలు నశిస్తాయి కాబట్టి, శీతల గిడ్డంగిలో వాటిని నిల్వ చేసేందుకు మళ్ళీ ప్రత్యేకంగా మందులు వాడాల్సిన అవసరం ఉండదు.
- ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, వెల్లుల్లి వంటివి ఎక్కువకాలం నిల్వ ఉంచితే మొలకలు వస్తాయి. ఈ ప్రక్రియ మొలకెత్తడం ఆపివేస్తుంది.
- కొన్ని రకాల ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు, పండు త్వరగా పక్వానికి రాకుండా అడ్డుపడుతుంది.
- ఆహారాన్ని క్రిమిరహితం చేయడానికి పని చేస్తుంది.

ఈ విధంగా ఆహార వికరణం చేసిన ఉత్పత్తులను శీతలీకరణ లేకుండా సంవత్సరాల పాటు నిల్వ చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఇంతేకాక ఈ ప్రక్రియ మార్కెట్‌లో ధరల స్థిరీకరణకు దోహదం చేస్తుంది.








# ప్రత్తిలో రసం పీల్చే పురుగుల యాజమాన్యం

డా॥ ఓ. శైల, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, డా॥ ఆది శంకర్, డా॥ బి. రాజశేఖర్, డా॥ ఎన్. లావణ్య,
కె. జ్ఞానేశ్వర్ మరియు ఇ. జ్యోత్స్న
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం

ప్రస్తుతం మన రాష్ట్రంలో ప్రధానంగా సాగవుతున్న పంట ప్రత్తి. ప్రత్తి పంటను వివిధ దశల్లో అనేక రకాల చీడపీడలు ఆశించి నష్ట పరుస్తాయి. పైరు తొలిదశలో ఉన్నప్పుడు ఆశించే రసం పీల్చు పురుగుల వలన ప్రత్తి పైరు బాగా దెబ్బతింటుంది. మొక్కలు చిన్నగా ఉండడం వలన వీటి ఉధృతిని తట్టుకొనడానికి కష్టం అవుతుంది. కావున రసం పీల్చే పురుగుల నివారణ కోసం సకాలంలో తగిన సస్యరక్షణ చర్యలు పాటించాలి.

**ప్రత్తిని ఆశించే రసం పీల్చు పురుగులు:** పచ్చదోమ, పేనుబంక, తామరపురుగులు, తెల్లదోమ, పిండి పురుగులు ప్రధానమైనవి.

**పచ్చదోమ:** పచ్చదోమ యొక్క పిల్ల మరియు తల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి ఆకుల నుండి రసాన్ని పీలుస్తాయి. ఆకులు మొదట దోనెలుగా ముడుచుకొని, లేత పసుపు రంగులోనికి మారి ఆ తర్వాత అంచుల నుండి ఎర్రబడి క్రమేపి ఎండి రాలిపోతాయి. ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పైరు పెరుగుదల క్షీణించి మొగ్గలు రాక దిగుబడి తగ్గుతుంది. ఈ పురుగు పైరు లేత దశ నుండి పంట కాలం చివరి వరకు కూడా ఆశించి నష్టపరుస్తుంది.

**నివారణ:** ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఎఫిడోఫైరిఫెన్ 2 గ్రా. లేదా క్లోథయానిడిన్ 0.8 గ్రా. లేదా డైనోటెఫ్యురాన్ 0.3 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా సల్ఫాక్సఫ్లోర్ 0.75 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**పేనుబంక:** పిల్ల మరియు తల్లి పురుగులు మొక్క లేత కొమ్మల నుండి మరియు ఆకుల నుండి రసాన్ని పీలుస్తాయి. ఆకులు దోనెలుగా మారి మొక్కల పెరుగుదల కుంటుపడుతుంది. ఇవి తేనె వంటి జిగురు పదార్థాన్ని విసర్జించడం వల్ల మొక్కల ఆకులపై, కాండం పైన నల్లని బూజు ఏర్పడుతుంది. దీని వలన కిరణజన్య సంయోగక్రియ తగ్గుతుంది. పేనుబంక విసర్జించిన తేనె వంటి జిగురు పదార్థానికి ఆకర్షింపబడిన చీమలు మొక్కలపై గమనించినట్లైతే పేనుబంక ఆశించినట్లుగా భావించవచ్చు. వర్షాలు పడినప్పుడు పురుగుల సాంద్రత తగ్గిపోతుంది.

**నివారణ:** ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా సల్ఫాక్సాఫ్లోర్ 0.75 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు:** ఈ పురుగులు సన్నగా పసుపు గోధుమ రంగులో ఉంటాయి. వీటి పిల్ల, పెద్ద పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి ఆకులను గీకి రసాన్ని పీలుస్తాయి. దీని వలన ఆకులు ముడుచుకొని పోయి పెలుసుగా మారతాయి. ఆకుల అడుగు భాగాన ఈనెల వెంబడి వెండి వలె మెరిసే చారలు కనపడతాయి. తామర పురుగుల వలన ప్రత్తి పంటలో తలమాడు తెగులు (టొబాకో స్ట్రీక్ వైరస్) వ్యాప్తి చెందుతుంది.

**తలమాడు తెగులు:** తామర పురుగుల ద్వారా వ్యాపించే ఈ తెగులు వలన వైరస్ సోకిన మొక్కల్లో కొమ్మల చివరి లేత ఆకులు కొద్దిగా ఇటుక రంగులోకి మారి చిన్నవిగా ఉంటాయి. కొంత భాగం ఆకులు మాడిపోతాయి మరియు కొంచెం వంకర తిరిగినట్లు కుచించుకుపోతాయి. ఈ వ్యాధి తీవ్రత ఎక్కువైనప్పుడు వైరస్ వ్యాపించిన కొమ్మకు ఉన్న మొగ్గలు ఎండి రాలిపోతాయి.

- ఈ తెగులు నివారణ కోసం ప్రత్తి పంట పొలంలో మరియు గట్ల వెంబడి ఉండే వయ్యారిభామ, ఉత్తరేణి, గడ్డి చామంతి వంటి కలుపు మొక్కలను పూతకు రాకముందే పీకి తగులబెట్టాలి.
- ఈ వ్యాధిని అదుపు చేయడానికి కలుపు మొక్కలను పూతకు రాకముందే నిర్మూలించడం ఈ రోగ నివారణకు ఏకైక మార్గం.

- తామర పురుగులను అరికట్టడం ద్వారా ఈ తెగులు వ్యాప్తిని కొంతమేరకు నివారించవచ్చును.

**తామర పురుగుల నివారణ:** తామర పురుగుల నివారణకు అవసరాన్ని బట్టి లీటరు నీటికి ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా స్పైనటోరం 0.9 మి.లీ. లేదా డైఫెన్‌థయూరాన్ 1.25 గ్రా. చొప్పున వారం రోజుల వ్యవధిలో 2 సార్లు మందులను మార్చి, మార్చి పిచికారి చేయాలి.

**తెల్లదోమ:** తెల్లదోమ పైరు పిందె, కాయ దశలో ఉన్నప్పుడు ఎక్కువగా ఆశిస్తుంది. తల్లి మరియు పిల్ల పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీలుస్తాయి. ఆకుల మీద పచ్చదనం కోల్పోయి మచ్చలు ఏర్పడి, ఆకులు పూర్తిగా పెరగకముందే రాలిపోతాయి. పురుగు సోకిన మొక్కలు గిడసబారి, పూ మొగ్గలు, పూలు, కాయలు రాలి, కాయలు తయారు కాక ముందే విచ్చుకొని దూది నాణ్యత తగ్గుతుంది. ఈ పురుగులు తేనె వంటి జిగట పదార్థాన్ని విసర్జించి దూదిని కలుషితపరుస్తాయి.

**నివారణ:** ఎకరానికి 10 పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి. ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 75 యస్.పి 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా డైఫెన్‌థయూరాన్ 1.25 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా సల్ఫాక్సాఫ్లోర్ 0.75 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వీలైనంత వరకు ఈ పురుగు మందులను వేప సంబంధిత మందులతో కలిపి పిచికారి చేయాలి.

**పిండినల్లి:** పిండినల్లి చిన్న పురుగులు లేత పసుపు రంగుతో కూడిన తెలుపు రంగులో ఉంటాయి. తల్లి పురుగులు రెక్కలు లేకుండా శరీరమంతా మైనపు పూత కలిగిన వెంట్రుకలతో కప్పబడి ఉంటాయి. ఈ పురుగులు ఆకుల తొడిమెల నుండి ఆకుల నుండి పూత, కాయల నుండి రసాన్ని పీల్చడం వలన ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. అలాగే పూత, పిందె రాలిపోతాయి. ఈ పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు పూర్తిగా ఎండిపోతాయి. ఈ పురుగులు తేనె వంటి జిగురు పదార్థాన్ని విసర్జించడం వలన నల్లబూజు తెగులు ఆశించి ప్రత్తి నాణ్యత తగ్గుతుంది.

**నివారణ:** ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి లేదా మిథైల్ పారాథియాన్ 50 ఇ.సి 3 మి.లీ. లేదా ఎసిఫేట్ 2 గ్రా. + ట్రైటాన్ లేదా సాండోవిట్ లాంటి జిగురు మందులను 1 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి మొక్క పూర్తిగా తడిచేటట్లుగా పిచికారి చేయాలి.

రెండు లేదా అంతకంటే ఎక్కువ రసం పీల్చే పురుగులు పంటను ఒకేసారి ఆశించినప్పుడు పిచికారి చేయవలసిన మందులు

ఎసిఫేట్ + బైఫెంత్రిన్ 1.6 గ్రా. లేదా

ఎసిఫేట్ + ఇమిడాక్లోప్రిడ్ 2 గ్రా. లేదా

బీటా సైఫ్లుత్రిన్ + ఇమిడాక్లోప్రిడ్ 1 మి.లీ. లేదా

బ్యుప్రొఫెజిన్ + ఎసిఫేట్ 2.5 గ్రా. లేదా

డైఫెన్‌థయూరాన్ + బైఫెంత్రిన్ 1.25 గ్రా. లేదా

డైనోటెఫ్యూరాన్ + ఎసిఫేట్ 1.76 గ్రా. లేదా

ఫిప్రోనిల్ + ఎసిటామిప్రిడ్ 2 గ్రా. లేదా

పైరిప్రాక్సిఫెన్ + డైఫెన్‌థయూరాన్ 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

**రసం పీల్చే పురుగుల నివారణకు ప్రత్యేక సూచనలు:**

- పచ్చదోమను తట్టుకునే నూగు ఎక్కువగా ఉన్న రకాలను ఎంచుకొని సాగు చేయాలి.
- ఇమిడాక్లోప్రిడ్ లేదా థయోమిథాక్సామ్‌తో విత్తనశుద్ధి చేయడం వలన దాదాపు 30 రోజుల వరకు రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చు.
- నత్రజని ఎరువులను సరైన మోతాదులో సకాలంలో వేయాలి. లేకుంటే పురుగుల ఉధృతి ఎక్కువ అవుతుంది.
- ప్రత్తిలో అంతర పంటలుగా పెసర, మినుము, సోయాచిక్కుడు అలసంద వంటి పంటలను సాగు చేయటం ద్వారా మిత్ర పురుగులు బాగా వృద్ధి చెంది కొంతవరకు రసం పీల్చు పురుగుల నియంత్రణకు దోహదపడతాయి.
- రసం పీల్చే పురుగుల నివారణకు తొలిదశలో విచ్చల విడిగా రసాయన మందులను పిచికారి చేయకుండా కాండానికి మందు పూసే పద్ధతిని పాటించాలి.
- కాండానికి మందుపూత 3 సార్లు అనగా 30, 45 రోజులలో మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలో మరియు 60 రోజుల వయస్సులో ఇమిడాక్లోప్రిడ్, నీరు లేదా ఫ్లోనికామిడ్, నీరు 1:20 నిష్పత్తిలో పూయాలి.
- ప్రత్తి పంట చుట్టూ మొక్కజొన్న లేదా జొన్న రక్షణ పంటగా 2-3 వరుసలలో విత్తుకోవాలి.
- కలుపు మొక్కలు ముఖ్యంగా వయ్యారిభామ, తుత్తుర బెండ లాంటి కలుపు మొక్కలు చేను చుట్టూ లేకుండా చూసుకోవాలి.
- తెల్లదోమ నివారణకు మందుల పిచికారీతో పాటు మార్కెట్‌లో లభించు జిరుగు పూసిన అట్టలను ఎకరానికి 10 చొప్పున అమర్చితే తెల్ల దోమలు ఆకర్షింపబడి జిగురుకు అంటుకొని చనిపోతాయి.



# సకశేరుక చీడల నుండి పంట రక్షణ

**కెమెకర్ పవన్ కుమార్, డా॥ చల్లా వేణు గోపాల రెడ్డి మరియు భూక్య శ్రీనివాస్**
వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం ప్రముఖమైన పాత్ర పోషించడంతో పాటు ఎంతో మందికి జీవనాధారం కల్పిస్తుంది. ఆధునిక సాంకేతిక విప్లవం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధిస్తున్నప్పటికీ, మన రైతాంగం వన్యజీవులు, పక్షులు మరియు ఎలుకల రూపంలో పంట నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. మన రాష్ట్రంలో చూసుకున్నట్లైతే అడవి పందులు, కోతులు, మనుపోతులు, జింకలు మరియు ఎలుకలు ఎక్కువ నష్టాన్ని చేస్తున్నాయి. ఒక సర్వే ప్రకారం అడవి పందులు మరియు కోతుల ద్వారా నందాదేవి బయోస్పియర్ ప్రాంతంలో 50 నుండి 60% పంట నష్టం జరిగింది. పక్షులలో నెమళ్ళు, కాకులు, పావురాలు, అడవి లిక్కు జిట్ట, గిజిగాడు, పిచ్చుకలు, చిలుకలు మరియు సరస్సు కొంగల వల్ల 12-85% పంట నష్టం జరిగింది.

**వన్యజీవుల బారి నుండి పంట రక్షణ:** 4-5 వరుసలలో కుసుమ పంటను పొలం చుట్టూ నాటడం ద్వారా వేరుశనగ పంటను అడవి పందుల బారి నుండి కాపాడవచ్చు. కాకపోతే కుసుమ పంటను అధిక సాంద్రతలో (30×15 సెం.మీ. అంతరం) నాటాలి. కుసుమ పంట వాసన వేరుశనగ పంట కంటే ఘాటుగా ఉండడం ద్వారా అడవి పందులు వేరుశనగ వాసనను పసిగట్టలేవు. ఒకవేళ అవి వాసనను పసిగట్టినప్పటికీ, కుసుమ పంట యొక్క ముళ్ళు అడవి పందులను లోపలకు ప్రవేశించకుండా కాపాడుతాయి. ఈ పద్ధతిని మొక్కజొన్న మరియు జొన్న పంటలలో కూడా వాడవచ్చు. ఈ పంటల రక్షణ కోసం కుసుమ పంటను 4-5 వరుసలలో 45×30 సెం.మీ. అంతరంలో పొలం చుట్టూ నాటాలి. ఈ పద్ధతిని అనుసరించడం వల్ల పంట రక్షణ మాత్రమే కాకుండా, కుసుమ పంట ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు. ఈ పద్ధతిని వానాకాలం మరియు యాసంగిలో కూడా పప్పు ధాన్యాలు మరియు నూనెగింజల పంటలలో అవలంభించవచ్చును.

వలయాకార ముళ్ళకంచెను పొలం గట్ల వెంబడి, పంటకు రెండు నుండి మూడు అడుగుల ఎత్తు, ఒక అడుగు దూరంలో అమర్చడం ద్వారా, అడవి పంది పొలంలో ప్రవేశించడానికి ప్రయత్నించినప్పుడు వాటి దేహానికి గాయాలను కలిగించడంతో పాటు మరోసారి పొలానికి రాకుండా చేస్తుంది. హెచ్‌డిపిఇ నైలాన్ తీగతో నిర్మితమైన వలను పంట పొలం చుట్టూ, వెదురు బొంగులు లేదా చెక్క స్థంబాల సహాయంతో 3-4 అడుగుల ఎత్తు వరకు అమర్చాలి. పైన పేర్కొన్న పద్ధతుల ద్వారా 70-90% వరకు పంట నష్టాన్ని అరికట్టవచ్చు. జి ఐ తీగ పంట చుట్టూ 3 వరుసలలో స్థంభాల సహాయంతో ఒక అడుగు ఎత్తు వరకు బిగించడం ద్వారా 55-70% వరకు పంట నష్టాన్ని తగ్గించవచ్చు. ఇదే విధంగా ఇనుప ముళ్ళ తీగ కంచెని అమర్చడం ద్వారా 60-74% వరకు నష్టం తగ్గించవచ్చు. ఇవే కాకుండా ఇనుప వల కంచె మరియు సౌరశక్తి కంచెను కూడా వాడుకోవచ్చు. కుళ్ళిన లేదా మామూలు కోడి గ్రుడ్లను సేకరించి ద్రావణం తయారు చేసుకోవాలి. 25 మి.లీ. ద్రావణాన్ని ఒక లీటరు నీటిలో కలిపి పంట చుట్టూ ఒక అడుగు దూరంలో చదును చేసిన భూమిపై పిచికారి చేసుకోవాలి. ఈ పద్ధతి ద్వారా 55-70% వరకు పంట నష్టాన్ని అరికట్టవచ్చు. మానవ వెంట్రుకలను క్షౌరశాల నుండి సేకరించి పొలంలో వెదజల్లడం ద్వారా అడవి పందులకు శ్వాసించడంలో ఇబ్బందిని కలిగించి వాటి బారి నుండి పంటలు







కాపాడబడతాయి. చాలా వరకు రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తూ ఉన్నారు. రంగుల చీరలను కర్రల సహాయంతో పొలం చుట్టూ కట్టడం ద్వారా అడవి పందులను పొలంలో రాకుండా చేయవచ్చు.

**కోతుల నుండి పంట రక్షణ:** కూరగాయ పంటలలో యాదృచ్ఛికంగా మిరప పంటను నాటడం ద్వారా, పాముల యొక్క ప్లాస్టిక్ ప్రతిరూపాన్ని పొలంలో ఉంచి తరచూ వాటి స్థానం మార్చడం ద్వారా, పేడ లేదా కర్రలను ఫినైల్‌లో ముంచి కాల్చడం ద్వారా పొలాన్ని కోతుల బారి నుండి కాపాడవచ్చు. ఆడియో డివైస్ (ధ్వని యంత్రం) సహాయంతో కోతులను భక్షించే జీవుల శబ్దాన్ని రోజుకి 6 గంటల పాటు వినిపించడం ద్వారా మరియు ఎండిపోయిన చేపలను ప్లాస్టిక్ సంచిలో లేదా పొలంలో ఉంచడం ద్వారా కోతులను పొలంలోకి ప్రవేశించకుండా చేయవచ్చు.

**పక్షుల నుండి పంట రక్షణ:** కాటన్ లేదా నైలాన్ వల ద్వారా మామిడితో పాటు ఇతర పండ్ల తోటలను కాపాడవచ్చు. దానిమ్మ మరియు బొప్పాయి పండ్లకి బ్యాగింగ్ పద్ధతిని అనుసరించడం ద్వారా పక్షుల బారి నుండి రక్షణ కల్పించవచ్చు. దిష్టిబొమ్మలను వివిధ ఆకారం మరియు పరిమాణంలో నిర్మించి పంట ప్రారంభ దశలో పక్షుల నుండి కాపాడవచ్చు. టపాసులను కాల్చడం ద్వారా, వేరే పక్షుల ధ్వనులను వినిపించడం ద్వారా, ప్రతిబింబించే రిబ్బన్లను పొలంలో అమర్చడం ద్వారా పక్షులను పొలంలో ప్రవేశించకుండా చేయవచ్చు.

**ఎలుకల నుండి పంట రక్షణ:** పొలంలో పంటలేని సమయంలో బొరియలు త్రవ్వడం మరియు పొలంలోని ఎలుకలను సేకరించి చంపడం ద్వారా ఎలుకల బారి నుండి పంటలను కాపాడవచ్చు. సజీవ ఎలకల బొరియలను గుర్తించి వాటిలో పొగబారించే యంత్రం ద్వారా గడ్డిని ఉపయోగించి పొగను ఆ కన్నాలలోకి వెళ్ళే విధంగా చేసినట్లయితే ఎలకలు వాటి పిల్లలు ఊపిరాడక చనిపోతాయి. పంట నాటిన 3-4 వారాల తర్వాత జింక్ ఫాస్పైడ్ లేదా బ్రోమడయోలోన్‌తో విషపు ఎర వేయడం మరియు తంజావూరు లేదా వెదురు ఎరను హెక్టారుకి 100 చొప్పున ఏర్పర్చడం ద్వారా ఎలుకల నుండి పంట రక్షణ కలిగించవచ్చు.

పైన పేర్కొన్న పద్ధతులతో మన పంటలని, వన్యజీవులు, పక్షులు మరియు ఎలుకల బారి నుండి సమర్థవంతంగా కాపాడుకోవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9767072427










# సెప్టెంబర్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
**వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట**

**మామిడి:** వివిధ మచ్చ తెగుళ్ళ నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఈ మాసం చివరిలో పొలాన్ని దున్నాలి. దీని వల్ల కలుపు నివారించబడటమే కాకుండా నిద్రావస్థలో ఉన్న పురుగులు నశిస్తాయి, నేల గుల్లబారి, నేల నుండి తడి ఆవిరై, పొడిగా తయారై బెట్ట పరిస్థితులు ఏర్పడతాయి. దీని వల్ల పూత రెమ్మలు త్వరగా ముదిరి, పూతకు సిద్ధమై శాఖీయ పెరుగుదల తగ్గుతుంది. పచ్చిరొట్ట పైర్లు వేసినట్లైతే ఈ మాసంలోనే భూమిలోకి కలియదున్నాలి. ఈ మాసంలో గూడుపురుగు, కొమ్మలను తొలిచే పురుగులు, ఆకులను కత్తిరించే పురుగులు ఆశించకుండా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**జామ:** జామలో నులిపురుగుల నివారణకు ప్రతి చెట్టు పాదులో 40 గ్రా. కార్బోఫ్యూరాన్ గుళికలు లేదా 25 గ్రా. పేసిలోమైసెస్ లిలాసినస్ వేసి నీరు పెట్టాలి. జామలో ఎర్ర రంగు మచ్చలు పోషక లోపాన్ని సూచిస్తాయి. నివారణకు ప్రతి మొక్కకు 1 కిలో యూరియా, 0.5 కిలో పొటాష్ వేసుకోవాలి. 15 రోజులకొకసారి సూక్ష్మపోషక మిశ్రమం 5 గ్రా. ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. ఈ మాసంలో మొదళ్ళలో నీరు నిల్వ ఉండటం వలన వచ్చే ఎండు తెగులు నివారణకు మొదళ్ళలో కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున మొదళ్ళు తడిచేటట్లు పోయాలి.

**అరటి:** అరటిలో పొటాష్ ధాతులోపం వల్ల అరటి ఆకులు అంచుల వెంబడి పసుపు రంగులో మారి, క్రమేపి ఆకు మొత్తం పండిపోయి ఎండిపోవును. దీని నివారణకు మొక్కకు 80 గ్రా. చొప్పున మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను 40 రోజుల వ్యవధిలో నాలుగు దఫాలుగా వేసుకోవాలి. ఆకులపై 5 గ్రా. సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌ను 1 లీ. నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**బత్తాయి, నిమ్మ:** ఈ మాసంలో పూత, పిందె, కాయ రాలుటను నివారించుటకు 100 గ్రా. కార్బండాజిమ్, 1 గ్రా. 2,4-డి లేదా 1.5 గ్రా. ప్లానోఫిక్స్‌లను 100 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి. మంగుని కలుగజేసే నల్లి నివారణకు 1 మి.లీ. స్పైరోమెసిఫెన్ లేదా 3 మి.లీ. డైకోఫాల్ లేదా 2 మి.లీ. ఇథియాన్ లేదా 3 గ్రా. నీటిలో కరిగే గంధకంను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ద్రాక్ష:** తామర పురుగుల నివారణకు 2 మి.లీ. ఫిప్రోనిల్ లేదా 0.5 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 0.3 గ్రా. స్పైనోశాడ్‌ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**సపోట:** మొగ్గ తొలిచే పురుగులు, ఆకు గూడు అల్లే పురుగులు లేత చిగురును, పూతను తిని నాశనం చేస్తాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**బొప్పాయి:** అధిక వర్షాల వల్ల కాండం మొదలు కుళ్ళిపోయి మొక్కలు వాలిపోతాయి. మొదలు నుండి జిగురు లాంటి ద్రవం కారుతుంది. నివారణకు లీటరు నీటికి 2 గ్రా. మెటలాక్సిల్ ఎమ్ జెడ్ కలిపి చెట్ల మొదళ్ళు మరియు కాండాన్ని తడుపుతూ పోయాలి.





**సీతాఫలం:** పిండినల్లి ఆశించకుండా పాదులో 50 గ్రా. క్లోరిపైరిఫాస్ పొడిమందును చల్లుకోవాలి. ప్రతి చెట్టుకి 250 గ్రా. యూరియా, 350 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 100 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి తడి పెట్టాలి.

**జీడి మామిడి:** ఈ మాసంలో ప్రతి చెట్టుకు 550 గ్రా. యూరియా, 375 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 120 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను చెట్టు మొదలుకు 1.5 మీ. దూరంలో చుట్టూ 15 సెం.మీ. వెడల్పు లోతు గల గాడిని తీసి, ఎరువులను వేసి కప్పవలెను.

**కూరగాయలు:**

**టమాట:** పచ్చదోమ నివారణకు డైమిథోయేట్ మందును 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. తేమతో కూడిన చల్లని వాతావరణంలో ఆకుమాడు తెగులు అధికంగా ఉంటుంది. దీని నివారణకు 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ మందును లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

**వంగ:** మొవ్వు మరియు కాయ తొలుచు పురుగు నివారణ కోసం పురుగు ఆశించిన మొవ్వు భాగాన్ని తుంచి వేయాలి. 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ లీటరు నీటికి చొప్పున కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.

**బెండ:** తెల్లదోమ నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**కాకర:** వర్షంతో కూడిన చల్లని వాతావరణంలో బూజు తెగులు ఆశిస్తుంది. ఆకుల పైభాగాన పసుపు రంగు మచ్చలు, అడుగు భాగాన ఊదా రంగు మచ్చలు, బూజు వంటి పదార్థం ఏర్పడుతుంది. నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా మెటలాక్సిల్ ఎమ్ జెడ్ 2 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**మిరప:** ఆరు వారాల వయస్సు గల మొక్కలను ప్రధాన పొలంలో ఈ మాసంలో నాటుకోవాలి. వర్షాధార పైరుకి 60×15 సెం.మీ. దూరంలో పాదుకు రెండు మొక్కలు చొప్పున, నీటి వసతి క్రింద 60×60 సెం.మీ. దూరంలో పాదుకు ఒక మొక్క చొప్పున నాటుకోవాలి.

**కూర మిరప:** కూర మిరపను బహిరంగ ప్రదేశాలలో ఈ మాసంలో నాటుకున్నట్లైతే అధిక దిగుబడులు సాధించవచ్చు.

**క్యాబేజి:** మధ్యకాలిక క్యాబేజి రకాలను నారుమడిలో విత్తుకొని నారు తయారైన తరువాత ప్రధాన పొలంలో నాటుకోవాలి.

**కాలిఫ్లవర్:** కాలీఫ్లవర్ శీతాకాలపు పంటను ఈ మాసం నుండి నాటుకోవచ్చు.

**చిక్కుడు:** పొద చిక్కుడు రబీ పంటను ఈ మాసంలో నాటుకోవచ్చు.

**పసుపు:** దుంప, వేరుకుళ్ళు తెగులు గమనించిన వెంటనే లీటరు నీటికి 2 గ్రా. కాప్టాన్ లేదా 3 గ్రా. కాపర్ఆక్సీక్లోరైడ్‌లను తెగులు సోకిన మొక్కల మరియు వాటి చుట్టూ ఉన్న మొక్కల మొదళ్ళు తడిచేలా పోయాలి. ఈ మాసంలో దుంప తొలుచు ఈగ ఆశించే అవకాశం ఉంది. నివారణకు ఎకరాకు 100 కిలోల వేప పిండిని మొక్కల మధ్య వేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం.9441168156**



# వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ కె. వాణిశ్రీ



## అడ్డం

1. ప్రస్తుతం వరి పైరు ఈనిక దశలో అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాలకు ఏ తెగులు ఉధృతి తీవ్రస్థాయికి చేరుకుని నష్టం కలుగుతుంది? (7)
2. కత్తెర పురుగు మరియు పొగాకు లద్దె పురుగులు ఎదిగిన లార్వాలను నివారించుటకు ఏమి తయారుచేసి సాయంత్రం వేళల్లో వెదజల్లాలి? (5)
3. గులాబి పువ్వుల రేకుల నుండి తయారుచేసే స్వీట్ పేరు? (4)
4. సాధారణంగా లద్దె పురుగుల గ్రుడ్లను ఆశించే పరాన్న జీవి ఏది? (4)
5. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి విడుదల చేసిన అధిక మాంసకృత్తులు కలిగి బూజు తెగులు, కాండం ఈగ మరియు కాండం తొలుచు పురుగులను తట్టుకునే పచ్చజొన్న రకం? (7)

## నిలువు

1. లద్దె పురుగుల నివారణకు విరివిగా వాడే రసాయనం పేరు? (7)
2. వరిలో ఏ పురుగు ఆశించడం వల్ల అంకురం ఉల్లికాడ వలే పొడుగాటి గొట్టంగా మారుతుంది? (4)
3. వానాకాలంలో పండే ఆఫ్ సీజన్ మామిడిని ఏమంటారు? (3)
4. అడవుల్లో ఎత్తైన కొండ ప్రాంతాల్లో సహజ సిద్ధంగా తీగలా అల్లుకొని వర్షాధారంగా పెరిగే కూరగాయ పంట ఏది? (4) (క్రింది నుండి పైకి)
5. గోరుచిక్కుడు నుండి తయారుచేసే జిగురు పదార్థం పేరు ఏమిటి?(3)
6. మిరపలో ఏ పురుగు పిందె దశలో ఆశించడం వల్ల కాయలు వంకర్లు తిరిగి గిడసబారతాయి? (5) (క్రింది నుండి పైకి)
7. ఆశ, మారుతి, ఉజ్వల ఏ పంట యొక్క రకాలు? (2)
8. వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా విడుదల కాబడిన టి.యస్.యఫ్.బి 15- 4 ఏ పంట యొక్క రకం? (7)

సమాధానాలు 39వ పేజీలో



# నిమ్మ, బత్తాయి తోటలలో వేరుకుళ్ళు తెగులు యాజమాన్యం

ఎ. రాములమ్మ, డా॥ యస్. శ్రీనివాసరావు, యస్. పల్లవి, కె. చంద్రశేఖర్ మరియు ఎ. సాయి కిరణ్
కృషి విజ్ఞాన కేంద్రం, కంపసాగర్

మన దేశంలో పండ్ల తోటల సాగులో నిమ్మజాతి పంటలు మూడవ స్థానంలో ఉన్నాయి. తెలంగాణలో చీని (బత్తాయి), నిమ్మ పండ్ల విస్తీర్ణంలో నల్గొండ జిల్లా అగ్రస్థానంలో ఉన్నది. బత్తాయి, నిమ్మ తోటల్లో వేరుకుళ్ళు తెగులు ఉధృతి ఎక్కువగా ఉండటం వల్ల అధిక దిగుబడి పొందడానికి అవరోధంగా మారింది. సరైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లైతే రైతులు వేరుకుళ్ళు తెగులు నివారించుకుని అధిక దిగుబడులు పొందడానికి ఆస్కారం ఉంటుంది.

### వేరుకుళ్ళు తీవ్రతకు దోహదపడే కారణాలు:

- అధిక తేమ, నేరుగా చెట్టు కాండానికి సాగు నీరు తగలటం, చెట్టుకు నీరు తక్కువగా అందటం, నీటి ఎద్దడి ఏర్పడటం-బత్తాయి, నిమ్మ మొక్కలకు బెట్ట పరిస్థితులు ఏర్పడినా లేదా అధికంగా నీరు పెట్టినా వేరుకుళ్ళు తెగులు ఆశించే అవకాశం ఉంది.
- వేర్లకు సరైన విధంగా గాలి సోకకపోవడం, వేర్లకు తరచుగా గాయాలేర్పడటం.
- మొక్కలను లోతైన నేలల్లో నాటక పోవడం, మొక్కల మధ్య దూరం తక్కువగా ఉండటం.
- ఎక్కువ మోతాదులో ఎరువులు ఒకే దఫా వేయడం.
- బరువైన నేలల్లో చెట్లను నాటడం వంటి కారణాల వల్ల బత్తాయి, నిమ్మ తోటల్లో వేరుకుళ్ళు తీవ్రత అధికంగా ఉంటుంది.

### తెగులు లక్షణాలు:

- తెగులు సోకిన చీని, నిమ్మ చెట్లు నీరు పెట్టినా కూడా వాడినట్లుంటాయి.
- ఆకులు వాడి, జీవం కోల్పోయి ఉంటాయి మరియు ఆకులు పసుపు రంగుకు మారిపోతాయి.
- తెగులు సోకిన చెట్లు అకాలంలో విపరీతంగా పూత పూసి, కాయలు ముదిరిపోవడం లేదా చెట్లు వాడిపోవడం జరుగుతుంది.
- వేర్ల బెరడు కుళ్ళిపోవడం ఈ తెగులు ప్రథమ లక్షణం, ఆ తర్వాత బెరడు ఎండిపోయి పొరలు, పొరలుగా విడిపోతుంది. కుళ్ళిన వేర్లు దుర్వాసన వస్తాయి. వేర్లపై నల్లటి స్క్లెరోషియాలు ఏర్పడుతాయి.
- జంబేరి వేరు మూలంపై అంటుకట్టిన బత్తాయి మొక్కలు ఎక్కువగా వేరుకుళ్ళుకు లోనవుతాయి.

### వేరుకుళ్ళు తెగులు యాజమాన్యం:

- రంగపూర్ నిమ్మ వేరుమూలంను ఉపయోగించి పెంపొందించిన అంట్లు ఈ తెగులును బాగా తట్టుకుంటాయి.
- వేసవిలో నేల తడారి పోకుండా చెట్టు పాదంతా ఆకులు లేదా ఊకతో కప్పాలి. దీనినే మల్చింగ్ అంటారు.
- లేత తోటల్లో జనుము, మినుము, పెసర, జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువు పంటలను పండించి భూమిలో కలిసేలా దున్నాలి.
- చెట్టుకు 10 కిలోల చొప్పున వేపపిండి లేదా ఆముదపు పిండి లేదా గానుగ పిండి వేయాలి.
- చెట్టులో వ్యాధి లక్షణాలు ప్రాథమిక దశలో ఉన్నప్పుడే నీరు కట్టిన మరుసటి రోజే 40 గ్రా. కార్బండాజిమ్ మరియు 50 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 40 గ్రా. క్లోరోథలోనిల్ 20 లీటర్ల నీటికి కలిపి చెట్టు పాదంతా తడిచేలా పోయాలి. నెల రోజుల వ్యవధిలో 2 లేక 3 సార్లు చెట్టు పాదంతా మందు నీటితో తడపాలి.
- 100 గ్రా. ట్రైకోడెర్మా, 100 గ్రా. అజోస్పైరిల్లమ్, 100 గ్రా. సూడోమోనాస్ 20 లీటర్ల నీటిలో కలిపి పాదంతా తడిచేలా చల్లాలి.
- 1 కిలో ట్రైకోడెర్మా కల్చర్‌ను 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండితో కలిపి 5 రోజులు మాగబెట్టి చెట్టుకి 10 కిలోల చొప్పున పాదులో వేసి కలియబెట్టాలి.
- 1 కిలో యూరియా 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8317505717



# లేత ఆయిల్‌పామ్ తోటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డా॥ ఇ. రాంబాబు, డా॥ ఎస్. మాలతి, డా॥ ఎన్. కిషోర్ కుమార్, బి. క్రాంతి కుమార్ మరియు డి. ఉషశ్రీ
కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల

తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ పంటను 1,25,000 ఎకరాల పైచిలుకు సాగు చేస్తున్నారు. అందులో 45,000 ఎకరాల పైచిలుకు ముదిరిన తోటలు (5 సం॥ పైబడిన) ఉండి ప్రతి సంవత్సరం రైతుకు ఆదాయాన్ని ఇచ్చే దశలో ఉండగా, మిగతా 80,000 ఎకరాల పైచిలుకు లేత తోటలు (4 సంవత్సరాలలోపు) ఉండి, రైతుకు ఎటువంటి ఆదాయాన్ని ఇచ్చే దశలో లేవు కనుక రైతులు లేత ఆయిల్ పామ్ తోటలో సరియైన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే ప్రతి సంవత్సరం కొంత నికరాదాయంతో పాటు 4-5 సంవత్సరాల వయస్సు తర్వాత మంచి దిగుబడిని పొందవచ్చు.

## నీటి యాజమాన్యం:

- ఆయిల్‌పామ్ పాదు చుట్టూ మొదటి సంవత్సరం ఒక మీటరు, 2వ సంవత్సరం 2 మీటర్లు, 3వ సంవత్సరం మరియు ఆపై వయసున్న మొక్కలకు 3 మీటర్ల వెడల్పులో తేమ తప్పనిసరిగా ఉండే విధంగా నీరందించాలి.

- 3 సంవత్సరాలు, ఆపై వయసున్న ఆయిల్‌పామ్ తోటల్లో మొక్కకు రోజుకు 200-250 లీటర్లు, వేసవిలో 300-350 లీటర్ల నీటిని అందించాలి. కాలువల ద్వారా అయితే వారానికి 2 సార్లు, డ్రిప్ ద్వారా అయితే రోజుకు 6 గంటలు నీరందివ్వాలి.
- ఆయిల్‌పామ్ మొక్కలకు నీటి కొరత ఉన్నట్లైతే మొవ్వ ఆకులు విచ్చుకోకుండా ఉండటమే గాక ఆకుల ఉత్పత్తి తగ్గిపోతుంది. అందువలన ఎక్కువ మగ/పోతు గెలలు రావడం మరియు ఆడ గెలలు సరిగ్గా ఎదగకపోవడం వలన దిగుబడి తగ్గుతుంది.

## బేసిన్ యాజమాన్యం:

- ఆయిల్‌పామ్ పాదు చుట్టూ నీరు మరియు పోషక పదార్థాలను గ్రహించే పీచు వేర్లు ఉంటాయి. కావున పాదులలో కలుపు మొక్కలను తొలగించి మొదట సంవత్సరం ఒక మీటరు, 2వ సం॥ 2 మీటర్లు, 3వ సం॥ మరియు పై వయస్సున్న మొక్కలకు 3 మీటర్ల వెడల్పులో బేసిన్‌ను నిర్మించుకోవాలి.
- ఆయిల్‌పామ్ మొక్క చుట్టూ మొదటి 3 సం॥ లు గజమున్నర దూరంలో జనుము పంట నాటితే వేసవిలో వేడి గాలుల నుండి మొక్కలను కాపాడుకోవచ్చు. పెరిగి పూత దశలో ఉన్న జనుమును కోసి ఆయిల్‌పామ్ మొక్క పాదులలో కలపడం ద్వారా నేలలో తేమ, సేంద్రియ పదార్థ లబ్ధి పెరగడమేకాక కలుపు నివారణకు కూడా దోహదపడుతుంది.
- **మల్చింగ్:** ముక్కలు చేసిన ఎండు ఆయిల్‌పామ్ ఆకులు, మగ పూగుత్తులు, ఖాళీ గెలలు, వేరుశనగ, పెసర మరియు మినుము వంటి పంటల వ్యర్థాలతో పాదులలో మల్చింగ్ చేస్తే భూమిలో తేమని కాపాడి, కలుపును నివారించుకోవచ్చును.

## పోషకాల యాజమాన్యం:

- ఆయిల్‌పామ్‌లో నత్రజని మరియు పొటాష్ సమతుల్యతా లోపం వల్ల మొవ్వ ఆకులలో మధ్య ఈనెకు రెండు వైపులా తెల్లని చారలు ఏర్పడతాయి.
- మెగ్నీషియం లోపం వలన ముదురు ఆకులపై నారింజ రంగు మచ్చలు కనిపిస్తాయి.
- బోరాన్ లోపం ఉన్నట్లైతే లేత ఆకులు కొక్కెలుగా మరియు చేప ముల్లులా ఏర్పడతాయి.

కావున ఒక్కొక్క చెట్టు/మొక్కకు కింద సూచించిన ఎరువులను మూడు నెలల ఎడంతో సంవత్సరానికి 4 సార్లు వేసుకోవాలి. కలుపు తీసిన పాదుల్లో చెట్టు మొదలు నుండి 1 మీటరు దూరంలో (1వ సంవత్సరం వయస్సు మొక్కలు), 2 మీటర్ల దూరంలో (2వ సంవత్సరం మొక్కలు) మరియు 3 మీటర్ల దూరంలో (3వ సంవత్సరం మరియు ఆ పై వయస్సున్న మొక్కలు) ఎరువులు చల్లి మట్టితో కలిపి వెంటనే నీరు అందించాలి.

| మొక్క వయస్సు | నత్రజని (యూరియా) | భాస్వరం (సింగిల్ సూపర్ ఫాస్ఫేట్) | పొటాషియం (మ్యూరేట్ ఆఫ్ పొటాష్) | మెగ్నీషియం (మెగ్నీషియం సల్ఫేట్) | బోరాన్ (బోరాక్స్) |
|---|---|---|---|---|---|
| 1వ సం॥ | 870 | 1250 | 667 | 125 | 25 |
| 2వ సం॥ | 1740 | 2500 | 1333 | 250 | 50 |
| 3వ సం॥ & ఆపైన | 2610 | 3750 | 2000 | 500 | 100 |

**పోషక పదార్థాలు ఎరువుల రూపంలో (సంవత్సరానికి / చెట్టుకు/గ్రాములలో)**

**అంతర పంటలు:**

- మొదటి 3 నుండి 4 సంవత్సరాలలో ఆయిల్‌పామ్ నుండి పంట దిగుబడి రానందున అంతర పంటలు వేసుకుంటే రైతుకు కొంత నికరాదాయం లభిస్తుంది. దీనితో పాటు కలుపు మొక్కలను నివారించి, అంతర పంట యొక్క వ్యర్థాలను తిరిగి నేలలో కలపడం ద్వారా అవి కుళ్ళి భూసారాన్ని పెంచడంలో తోడ్పడుతుంది.
- వరి తప్ప, కూరగాయ పంటలు, పూల మొక్కలు, మిరప ప్రత్తి, పొట్టి అరటి, పొగాకు, బొప్పాయి, పశుగ్రాసాలు లాంటి పంటలను ఆయిల్‌పామ్ మొక్కలకు 2-3 మీటర్ల దూరంలో నాటుకోవాలి.
- ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు వేసినప్పుడు మొక్కలకు దగ్గరగా దున్నరాదు, ఆకులను కోయరాదు మరియు ఆకులను దగ్గర చేర్చి కట్టరాదు. ఇవి పాటించనిచో రాబోయే పంట దిగుబడులు తగ్గుతాయి.

**అబ్లేషన్:**

- ఆయిల్‌పామ్ మొక్క నాటిన తర్వాత 3 సంవత్సరాల వరకు ఆడ, మగ పూగుత్తులను తీసివేయాలి. దీనితో మొక్క కాండం, వేరు బాగా ఎదిగి మొక్క ఏపుగా పెరుగుతుంది.

**చీడపీడలు:**

**ఎ) నల్ల కొమ్ము పురుగు:**

- ఈ పురుగు ఆశించితే ఆకులలో 'జ' ఆకారపు ఖాళీలు మరియు ఆకు మొదలు భాగంలో రంధ్రాలు ఉండి అక్కడ నమిలిన పిప్పి కనబడుతుంది.
- నివారణకు 20 గ్రాముల నాఫ్తలీన్ ఉండలను రంధ్రాలున్న ప్లాస్టిక్ సంచిలో పోసి మొవ్వులో ఉంచాలి.

**బి) మొవ్వు కుళ్ళు:**

- ఈ తెగులు సోకిన మొక్కల్లో మొవ్వు ఎండిపోయి ఉంటుంది. లాగితే సులభంగా ఊడి వస్తుంది.
- నివారణకు తెగులు సోకిన, కుళ్ళిన మొవ్వు భాగాన్ని లాగి తీసివేసి కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని మొవ్వులో పోయాలి.

**ఆయిల్‌పామ్ పంటపై తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వివరాలు:**

| ఆయిల్‌పామ్ సాగు (ఎకరాకు) | రాయితీ రూ. |
|---|---|
| 1. మొదటి సంవత్సరం మొక్కలపై | 11,600/- |
| 2. బిందు సేద్యంకు రాయితీ | 22,518/- |
| 3. మొదటి సంవత్సరం ఎరువులు మరియు అంతర పంటల సాగుకు | 4,200/- |
| 4. రెండవ సంవత్సరం ఎరువులు మరియు అంతర పంటల సాగుకు | 4,200/- |
| 5. మూడవ సంవత్సరం ఎరువులు మరియు అంతర పంటల సాగుకు | 4,200/- |
| 6. నాల్గవ సంవత్సరం ఎరువులు మరియు అంతర పంటల సాగుకు | 4,200/- |

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **8247350264**




# ఆస్టరు పూల సాగుకు - శీతాకాలం బాగు

డా॥ డి. రజని, డా॥ ఆర్. నీలారాణి, డా॥ కె. ఇందూదర్ రెడ్డి, డా॥ టి. కమలజ, డా॥ శ్వేత కొడాలి

అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం – డబ్ల్యు.ఐ.ఏ, రాజేంద్రనగర్, హైదరాబాద్

మన రాష్ట్రంలో శీతాకాలంలో విడిపూలకు ఉన్న గిరాకి ఇతర పూలకు ఉండదు. పండుగలు, పెళ్ళిళ్ళ సీజన్లలో వీటికి ఉన్న గిరాకీ అంతా ఇంతా కాదు. బంతి, చామంతి తర్వాత విడిపూల కొరకు అధికంగా సాగుచేస్తున్న పంట చైనా ఆస్టర్. దీనిని మనం విడిపూలు గాను మరియు కట్‌ఫ్లవర్ గాను ఉపయోగించవచ్చు. చామంతి పూల తర్వాత మార్కెట్‌లో అందుబాటులో ఉండే విడిపూలు ఆస్టర్ పూలు.

శీతాకాలం ఆస్టరు సాగుకు బాగా అనుకూలం. వర్షాకాలం దీని సాగుకు అనుకూలం కాదు. దీని వేరు వ్యవస్థ నేల పై పొరలలో మాత్రమే విస్తరించి ఉంటుంది కాబట్టి నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

ఆస్టరు పూలు పూల దండలుగా, పుష్పగుచ్ఛాలలో ఫ్లవర్ ఫిల్లరుగా, ఉద్యాన ప్రదర్శనలలో ఫ్లవర్‌బెడ్స్‌గా, పూల కుండీలలో కూడా పెంచుటకు అనువైన పూజాతి.

**వాతావరణం మరియు నేలలు:** మన రాష్ట్రంలో ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాలలో రైతులు దీనిని అధికంగా సాగు చేస్తున్నారు. రాత్రి, పగలు ఉష్ణోగ్రతలలో వ్యత్యాసం అధికంగా ఉన్న ప్రాంతాలలో దీనిని లాభసాటిగా సాగు చేయవచ్చు.

ఆస్టరు పూలు వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగే కొద్ది నాణ్యత కోల్పోతాయి. కాబట్టి మన రాష్ట్రంలో ఫిబ్రవరి చివరి వరకు పూలు పొందవచ్చు. తర్వాత పూల దిగుబడులు మరియు నాణ్యత తగ్గుతాయి.

శీతాకాలంలో పగటి ఉష్ణోగ్రతలు $20-30^{0}$ సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రత $15-17^{0}$ సెల్సియస్ మరియు గాలిలో తేమ 60-70% ఉన్నట్లైతే దీనిని లాభదాయకంగా సాగు చేయవచ్చు.

మురుగు నీటి సౌకర్యం కలిగిన ఎర్రగరప నేలలు దీని సాగుకు అనుకూలం. నీరు నిలవ ఉండే బరువైన నేలలు దీని సాగుకు అనుకూలం కాదు.

**రకాలు:** చైనా ఆస్టరులో తెలుపు, గులాబి, ఊదా రంగు రకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో గులాబి రంగు పూలకు మార్కెట్‌లో మంచి డిమాండు ఉంది.

**తెలుపు రంగు రకాలు:** అర్కా అర్చన, అర్కా పూర్ణిమ మరియు అర్కా శశాంక్

**గులాబి రకాలు:** అర్కా ఆద్య, అర్కా కామిని, లోకల్ పింక్

**ఊదా రంగు రకాలు:** వైలెట్ కుషన్ వీటిలో కామిని, వైలెట్ కుషన్ మరియు లోకల్ పింక్ రకాలు కట్‌ఫ్లవర్‌గా సాగుకు అనుకూలం.

**యాజమాన్యం:** ఆస్టరును విత్తనం ద్వారా ప్రవర్ధనం చేస్తారు. ఎకరా ఆస్టరు సాగుకు ఒక కిలో విత్తనం సరిపోతుంది. సెప్టెంబర్ మాసం విత్తనం విత్తుకోవడానికి అనుకూలం. రైతులు విత్తనాన్ని ఎత్తైన నారుమడిలో విత్తుకోవచ్చు. లేదా వాణిజ్య సరళిలో పెంచే నర్సరీ నుండి రైతులు తమకు కావలసిన నారును సేకరించవచ్చు. రైతులు నర్సరీ నుండి నారును సేకరించేటప్పుడు మొదలు దృఢంగా ఉండి

3 జతల ఆకులు ఉన్న నారును ఎంచుకొని నాటుకోవాలి. 30-40 రోజుల వయస్సు గల నారును 30×20 సెం.మీ. ఎడంలో అక్టోబర్ మాసంలో ప్రధాన పొలంలో నాటుకోవాలి.

**ఎరువుల వాడకం:** ఆఖరి దుక్కిలో ఎకరాకు 8-10 టన్నుల బాగా మాగిన పశువుల ఎరువు, 40 కిలోల యూరియా, 100 కిలోల డి.ఎ.పి మరియు 50 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి బాగా దున్నుకోవాలి. నాటిన 30 రోజులకు ఎకరాకు 40 కిలోల యూరియాను పై పాటుగా వేసుకోవాలి.

పూలు మంచి రంగు పొందడానికి వీలుగా ఫార్ములా-4 లేక ఫార్ములా-6 ను 2.5 గ్రా. ఒక లీటరు నీటిలో కలిపి పూ మొగ్గ రాకముందు ఒకసారి, మరల మొగ్గ విచ్చేముందు ఒకసారి పిచికారి చేసుకోవాలి.

**కత్తిరింపులు:** నాటిన 20-30 రోజులలోపు లేదా 30 సెం.మీ. ఎత్తు పెరిగిన మొక్కల తలలు తుంచాలి. అప్పుడు కింది నుండి పక్క కొమ్మలు అధికంగా వచ్చి అధిక పూల దిగుబడిని పొందవచ్చు.

**పూల కోత:** ఆస్టరు మొక్కలు నాటిన 60 రోజులలో మొగ్గకు వచ్చి, 80 రోజులలోపు పూలు కోతకు వస్తాయి. ఒక్కో మొక్కకు సుమారు 50-60 పూలు వస్తాయి. ఎకరాకు 4 నుండి 5 టన్నుల దిగుబడి వస్తుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9553444589**

## 34 వ పేజీలోని వ్యవసాయ పదవినోదం సమాధానాలు

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | 1 క్లో | | 2 ఉ | | | 2 వి | ష | 3 పు | ఎ | ర |
| | రాం | | ల్లి | | | | | నా | | క |
| | ట్రా | | కో | | | | | స | | గా |
| 1 మా | ని | పం | డు | తె | 5 గు | లు | | | | 4 అ |
| | లి | | | | ర్గ | | | 8 ప | | |
| | ప్రో | | | | మ్ | | | శు | | |
| 3 గు | ల్ | 7 కం | ద్ | | | 4 ట్రై | కో | గ్రా | మా | |
| రు | | ది | | | | | | స | | |
| పు | | | | | | | | పు | | |
| త | | | | 5 పా | లెం | ప | చ్ఛ | జొ | న్న | -1 |
| 6 పూ | | | | | | | | న్న | | |



# కిచెన్ గార్డెనింగ్... ఆరోగ్యానికి వరం

**కెమెకర్ పవన్ కుమార్ మరియు డా॥ చల్లా వేణు గోపాల రెడ్డి**
వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

## కిచెన్ గార్డెన్ అంటే....

వంట గది యొక్క వ్యర్థపు నీటిని ఉపయోగించి ఇంటి పెరట్లో పండ్లు మరియు కూరగాయలను పండించడాన్ని కిచెన్ గార్డెన్ అంటారు. దీనిని హోమ్‌గార్డెన్, న్యూట్రిషన్ గార్డెన్ మరియు వెజిటెబుల్ గార్డెనింగ్ అని కూడా పిలుస్తారు. మనదేశంలో 2011-2012 సంవత్సరంలో కిచెన్ గార్డెనింగ్ యొక్క ఉత్పత్తి విలువ 51,072 మిలియన్ రూపాయలు కాగా ఇది క్రమేపి పెరిగి 2020-21 లో 59,074 మిలియన్ రూపాయలకు చేరింది.

## ఎందుకు అవసరం?

గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 2021 ప్రకారం అభివృద్ధి చెందుతున్న 116 దేశాలతో పోలిస్తే మనదేశం 101వ స్థానంలో ఉంది. సుస్థిర అభివద్ధి రిపోర్ట్ 2021 ప్రకారం మనదేశం 117వ స్థానాన్ని పొందింది. మనదేశంలో 60% ఐదు సంవత్సరాలలోపు పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఇది సూక్ష్మ పోషకాల యొక్క లోపాన్ని సూచిస్తుంది. ఆహార ఉత్పత్తి పెరుగుదల ఉన్నప్పటికినీ, ఆహార పంపిణీలో అసమానత ఒక ప్రధాన కారణంగా చెప్పవచ్చు. కాబట్టి పైన పేర్కొన్న సమస్యలకు స్థిరమైన పరిష్కారంగా, వారి రోజూవారి ఆహారంగా అవసరమైన సూక్ష్మపోషకాలు అందుబాటులో ఉండేలా చేయడం కిచెన్ గార్డెన్ ద్వారా సాధ్యమయ్యే అవకాశం ఉంది.

## ప్రయోజనాలు:

కిచెన్ గార్డెన్ ద్వారా మనం పోషక విలువలు ఎక్కువగా ఉండే పండ్లు మరియు కూరగాయలను తాజాగా పొందవచ్చు. ఇది మనమే నిర్వహించడం ద్వారా విషపూరిత రసాయనాలు లేని పండ్లు మరియు కూరగాయలను భుజించవచ్చు. మన ద్వారే మన పెరట్లో నిర్వహించడం వలన పండ్లు మరియు కూరగాయలపై వచ్చే ఖర్చును ఆదా చేయవచ్చు. కిచెన్ గార్డెన్ ద్వారా పండించిన పండ్లు మరియు కూరగాయలు మార్కెటు నుండి కొనుగోలు చేసిన వాటి కంటే అధిక రుచిని కలిగి ఉంటాయి. కిచెన్ గార్డెన్ ద్వారా వంట గది యొక్క వ్యర్థ పదార్థాలు మరియు వ్యర్థపు నీటిని సమర్ధవంతంగా వినియోగించవచ్చు. కిచెన్ గార్డెన్ నిర్వహణ మనకి శారీరక మరియు మానసిక వ్యాయామ రూపంలో కూడా దోహదపడుతుంది.

## నిర్వహణలో ప్రధాన అంశాలు:

**స్థలం ఎంపిక మరియు పరిమాణం:** కిచెన్ గార్డెన్ కోసం సాధారణంగా ఇంటి పెరడును ఎంపిక చేసుకోవచ్చు. ఈ స్థలం సూర్యకాంతి వచ్చే ప్రాంతం అయి ఉండి, నిర్వహణకి అందుబాటులో ఉండాలి. కిచెన్ గార్డెన్ యొక్క పరిమాణం భూమి లభ్యత, కుటుంబంలోని వ్యక్తుల సంఖ్య మరియు దాని నిర్వహణకి అందుబాటులో ఉన్న సమయాన్ని బట్టి నిర్ణయించాలి. సాధారణంగా 200 చ.మీ. భూమి, ఐదుగురు సభ్యులతో కూడిన కుటుంబానికి ఏడాది పొడవునా కూరగాయలను అందించడానికి సరిపోతుంది.

**అనుకూలమైన పంటలు:** పండ్లలో ముఖ్యంగా మామిడి, అరటి, సపోట, జామ, బొప్పాయి, ఉసిరి మరియు దానిమ్మ మొదలగునవి. కూరగాయలలో టమాట, వంకాయ, మిరప, ఉల్లి, బెండకాయ, కాకరకాయ, సొరకాయ, పొట్లకాయ, తోటకూర, చిక్కుడు మరియు కరివేపాకు ముఖ్యమైనవి. మసాల పంటలలో పసుపు, ధనియాలు మరియు మెంతి మొదలైనవి.

### లేఅవుట్ ఎలా?

కిచెన్ గార్డెన్‌కి చుట్టూ ముళ్ళ కంచెను వేయాలి. శాశ్వత పంటలను (మామిడి, సపోట లాంటి పంటలను) పరిధీయ ప్రాంతాల్లో వేయాలి. ఒకవైపు ఒకటి లేదా రెండు కంపోస్టు గుంటలు నిర్మించాలి. అన్ని వైపులా నిర్మించిన కంచెలపై తీగజాతి కూరగాయలను పండించాలి. కొన్ని మొక్కలను నేరుగా కిచెన్ గార్డెన్‌లో నాటవచ్చు. టమాట, వంకాయ, మిరప మరియు ఉల్లి వంటి పంటలను నారు వేయు పద్ధతిలో నాటాలి. పంట నాటడం జూన్-జూలై మరియు సెప్టెంబర్-అక్టోబర్ మాసాలలో చేయవచ్చు. రసాయనిక ఎరువుల వాడకం ద్వారా కొంత అధిక దిగుబడి పొందవచ్చు. స్థలాన్ని రెండు భాగాలుగా విభజించాలి. రెండు భాగాలలో గట్లు మరియు గాళ్ళను నిర్మించాలి. సరైన మోతాదులో సేంద్రియ ఎరువులను వేస్తూ జీవసంబంధిత రసాయనాలను వాడాలి.

### నీటి పారుదల:

మొదట్లో నీరు అందించి అవసరమైన అంతరంలో నారును నాటాలి మరియు నాటిన మూడవ రోజుకి మరోసారి నీరందించాలి. నేరుగా నాటు విధానంలో విత్తనం నాటిన తర్వాత తగినంత నీరు అందించాలి మరియు అంకురోత్పత్తి తర్వాత సన్నగా రెండు మొలకలు వచ్చిన తర్వాత (విత్తిన మూడవ రోజు) నీరు అందించాలి. దీని తర్వాత అవసరాన్ని బట్టి నీరు అందించాలి.

### కిచెన్ గార్డెన్ నిర్వహణ:

వంట గదిలోని వ్యర్థ పదార్థాలను కంపోస్టు గుంటలలో వేయాలి మరియు దీనిని తడి స్థితిలో ఉండేలా చూసుకోవాలి. కుళ్ళిపోయిన వంటగది వ్యర్థాలను కంపోస్టింగ్ అయిన తర్వాత అన్ని పంటలకు అందించాలి. నాటిన 30, 60 మరియు 90 రోజులకు 5 గ్రా. ప్రతి మొక్కకు చొప్పున కాంప్లెక్స్ ఎరువులను వేయాలి.

**కలుపు మొక్కల నిర్వహణ:** కలుపు మొక్కల యాజమాన్యం అవసరానికి అనుగుణంగా నిర్వహించాలి.

**సస్యరక్షణ:** పండ్లు మరియు కూరగాయలపై కనిపించే లార్వాలను ఎంపిక చేసి వాటిని నాశనం చేయాలి. ఆపై వేపనూనె (నీమ్ ఆయిల్) 4 మి.లీ. లీటరు నీటికి చొప్పున లేదా నీమ్ సీడ్ కెర్నల్ ఎక్స్ట్రాక్ట్ 3% చొప్పున పిచికారి చేయాలి. వీలైనంత వరకు విషపూరిత రసాయనాలు చల్లడం మానేయాలి. సేంద్రియ సస్యరక్షణలో పైన పేర్కొన్న వాటితో పాటు పంచగవ్య పిచికారి చేయవచ్చును.

**పంటకోత:** ప్రతి పంటకి పేర్కొన్న కోత లక్షణాల ఆధారంగా పంటకోత నిర్వహించాలి.

కిచెన్ గార్డెన్‌తో కుటుంబానికి అవసరమైన పోషకాహారాన్ని సమకూర్చుకుంటూ మంచి ఆరోగ్యంతో ఆహ్లాదకరంగా జీవించవచ్చును.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9767072427**

## గత మాసంలో పి.జె.టి.యస్.ఏ.యు వారి అగ్రికల్చర్ వీడియో - యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు

| | | |
|---|---|---|
| 1. | 19-08-2023 | సోయాచిక్కుడు పంటలో పల్లాకు తెగులు - యాజమాన్యం |
| 2. | 19-08-2023 | సోయాచిక్కుడు పంటలో పొగాకు లద్దెపురుగు - యాజమాన్యం |
| 3. | 29-08-2023 | పురుగు మందుల పిచికారి - తీసుకోవాల్సిన జాగ్రత్తలు |
| 4. | 31-08-2023 | డా॥ బాబు జగ్జీవన్ రాం వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల ప్రోమో |

**మరింత సమాచారం కోసం ఈ క్రింది లింక్‌ను క్లిక్ చేయండి**

https://www.youtube.com/channel/UCXPH9Z_h47zxJqrV7svmFKg



# రక్త హీనతకు పోషకాహారంతో పరిష్కారం

యం. హేమలత
గృహ విజ్ఞాన శాస్త్రవేత్త, డిడియస్ కృషి విజ్ఞాన కేంద్రం, జహీరాబాద్

భారతదేశంలో సూక్ష్మపోషక లోప సమస్యలను చాలా సాధారణంగా చూడగలము. ఇందులో ఇనుము, ఖనిజలోప సంబంధింత రక్తహీనత (అనీమియా) చెప్పుకోదగిన ప్రజారోగ్య సమస్య. ఈ సమస్యను ముఖ్యంగా బడికి వెళ్ళే వయస్సురాని చిన్న పిల్లలు, కౌమార దశలోని అమ్మాయిలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లుల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2019 గణాంకాల ప్రకారం చిన్న పిల్లల్లో (6-59 నెలలు) 53.4%, గర్భిణీలల్లో (15-49 సంవత్సరాలు) 50.1%, పునరుత్పత్తి వయసు గల మహిళల్లో (15-49 సంవత్సరాలు) 53% రక్తహీనత సమస్య ఉంది. రక్తహీనత ఉన్నప్పుడు, రక్తంలో హిమోగ్లోబిన్ పాళ్ళు తక్కువవుతాయి. ఇందువలన ఆక్సిజన్‌ను శరీర కణజాలాలకు అందించే సామర్థ్యం తగ్గుతుంది. ఇది ఆరోగ్యం పై దుష్ప్రభావం చూపుతుంది.

రక్తహీనతలో అనేక రకాలు ఉన్నాయి అందులో ఇనుము లోపం రక్తహీనతను ప్రధానంగా చూడగలము

**రక్తహీనతకు లక్షణాలు:**

- అలసట, బలహీనత, శక్తి లేకపోవడం
- గర్భిణీ స్త్రీలలో ఫోలిక్‌యాసిడ్ తక్కువ ఉన్నట్లైతే వెన్నుపాము లోపాలను కలిగి ఉన్న బిడ్డకు జన్మనిస్తారు, మరియు కొన్ని సార్లు నెలలు నిండక ముందే ప్రసవిస్తారు.
- గర్భస్రావాలు, మృతశిశు జననాలు
- తల్లుల్లో రుగ్మతలు
- పిల్లల్లో అభిజ్ఞా మరియు శారీరక అభివృద్ధి తగ్గడం
- తక్కువ బరువులో శిశువులు పుట్టడం
- చేతి గోర్లు చెంచాలా వంగడం
- మెట్లు ఎక్కిన తర్వాత శ్వాస ఆడకపోవడం
- బలపం, బియ్యం వంటి పదార్థాలను పదే పదే తినాలనిపించడం
- జుట్టు రాలడం

**రక్తహీనతకు కారణాలు:**

- రోజూవారి ఆహారంలో తగిన మోతాదులో ఇనుము మరియు ఫోలేట్లు తక్కువగా అందడం.
- ఇనుము సూక్ష్మపోషక అవసరాలు ఎక్కువై, ఆహారంలో ఈ పోషకం అధికంగా లభించనప్పుడు.
- అధిక మొత్తంలో రక్తం నష్టపోవడం, రక్తస్రావం.
- కొక్కెర పురుగు (హుక్ వార్మ్) శరీరంలో ఉండటం.
- ఫోలేట్, విటమిన్ బి12 లోపం.

**రక్తహీనతను నివారించుటలో పోషకాహార పాత్ర**

- ఆహార ధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పులు, ఆకు కూరలలో ఇనుము అధికంగా లభిస్తుంది. ఆకు కూరలలో ఇనుము,

విటమిన్ 'ఎ' క్యాల్షియం, ఫోలేట్స్, విటమిన్ 'సి' వంటి సూక్ష్మపోషకాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఆకు కూరలను రోజు ఏదో ఒక పూట భోజనంలో ఉండేటట్లు చూసుకోవాలి లేదా వారంలో కనీసం 4-5 సార్లు ఆకు కూరలను తీసుకోవడం ద్వారా పోషకాలను పొందగలుగుతాం. ఆకు కూరల్లో ఇనుముతో పాటు క్యాల్షియం కూడా అధిక మొత్తంలో లభిస్తుంది. క్యాల్షియం ఎముకలను ధృఢంగా ఉంచడంతోపాటు, దంతాలు, చిగుళ్ళు కూడా బలంగా ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడతాయి. ఆకు కూరల్లో ఫోలిక్ యాసిడ్ కూడా పుష్కలంగా లభిస్తుంది. ఫోలిక్ యాసిడ్ అన్న పదం ఆకులు అని అర్థమిచ్చే 'ఫోలియా' నుండి వచ్చింది. ఆకు కూరల్లో ఉండే పీచు పదార్థం వలన మలబద్ధక సమస్యను తగ్గిస్తుంది.

- పళ్ళలో కూడా అన్ని రకాలైన సూక్ష్మపోషకాలు లభిస్తాయి, మాంసహారం ముఖ్యంగా మటన్ కాలేయంలో, గ్రుడ్డులో, ఫోలిక్ యాసిడ్ లభిస్తుంది. సజ్జలు, సామలు, రాగులు వంటి చిరుధాన్యాల్లో కూడా ఇనుము అధికంగా లభిస్తుంది. మనం తినే ఆహారంలో ఉండే ఇనుమును శరీరం చక్కగా గ్రహించి, శోషణ జరగాలంటే, ఆహారంలో విటమిన్ 'సి' అధికంగా ఉండే పదార్థాలను తగినంత చేర్చాలి (జామ, నిమ్మ, ఉసిరి, నారింజ).

**ఇనుము ఖనిజ పోషకం అధికంగా ఉండే ఆకు కూరలు**
**(ప్రతి 100 గ్రా.)**

| | | |
|---|---|---|
| సిరాకు | - | 38.5 మి.గ్రా. |
| తోట కూర | - | 27.3 మి.గ్రా. |
| శనగ ఆకు | - | 23.8 మి.గ్రా. |
| ముళ్ళ తోటకూర | - | 22.9 మి.గ్రా. |
| చిన్న తోటకూర | - | 18.7 మి.గ్రా. |
| రాజ్‌గిర | - | 18.4 మి.గ్రా. |
| పప్పుతోట కూర | - | 14.8 మి.గ్రా. |

మూలం: న్యూట్రీటివ్ వ్యాల్యు ఆఫ్ ఇండియా ఫుడ్స్ ఎన్.ఐ.ఎన్, 1987

**పోషకాలు అధికంగా లభించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

- ఆకు కూరలను తరగడానికి ముందే నీటిలో శుభ్రపరచాలి. సన్నగా తరిగిన తర్వాత కడగడం వలన ఆకు కూరలో ఉండే నీటిలో కరిగే విటమిన్లను కోల్పోతాము.
- ఆకు కూరలను వండటానికి అవసరమైన నీటిని మాత్రమే వాడాలి, ఎక్కువ నీటిలో ఉడికించిన నీరును వృధా చేయకుండా పప్పు, చారు, సూప్‌లలో వాడుకోవాలి.
- ఆకు కూరలను వండుతున్నప్పుడు కొంచెం నూనె వేస్తే వాటిలోని బీటా కెరోటిన్ (విటమిన్ ఎ) క్రొవ్వు పదార్థంలో కరిగి నష్టపోదు.
- విటమిన్ 'సి' అధికంగా లభించే పదార్థాలను ఎక్కువ మంటపై, ఎక్కువ సమయం ఉడికించడం వలన విటమిన్ 'సి'ను కోల్పోతాం, కాబట్టి దీనిని గమనించుకోవాలి.
- ఇనుము అధికంగా లభించే ఆహారపదార్థాలను తీసుకున్న వెంటనే టీ, కాఫీ త్రాగకూడదు. ఇందులో ఉండే టానిక్స్ ఇనుము ఖనిజం శరీరానికి అందకుండా చేస్తుంది.
- గ్రుడ్డులోని పచ్చసొన బ్లు-గ్రీన్ అయ్యే వరకు ఉడికించ కూడదు. సూక్ష్మపోషకాల లోపాన్ని తగ్గించడంలో పోషకాహార పెరటి తోటలు ఎంతో సహాయపడతాయి, పెరటి తోటల్లో అన్ని రకాల కూరగాయలు, పండ్ల మొక్కలు ఉండేలా చూసుకోవాలి. ఇనుము లోపాన్ని నివారించడంలో ఫోర్టిఫైడ్ ఆహారం (ఆహారాన్ని ఇనుములోవ బలపరచడం) ఎంతో దోహదపడుతుంది. రక్తహీనత సమస్యను అధిగమించడానికి మనం తినే ఆహారంలో ఒక రోజులో 20-30 యం.జి ఇనుము లభించేటట్లు చూసుకోవాలి. ఆహారం అందించే శక్తిలో 60% కార్బోహైడ్రేట్ల నుండి, 10-15% మాంసకృతుల నుండి, 20-25% కొవ్వు పదార్థాలు నూనెల నుండి లభించినట్లైతే మనం తీసుకునే ఆహారం సమతుల్యంగా ఉన్నట్లు, ఆహారధాన్యాలను పప్పులను ఎక్కువ మోతాదులో, కూరగాయలు మరియు పండ్లను ఉదారంగా, పాలు మరియు మాంస ఉత్పత్తులను మితంగా కొవ్వు పదార్థాలను మరియు నూనెలను పొదుపుగా తినాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9542770314









# మేలుజాతి పందుల ఎంపిక-వాటి రవాణాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డా॥ ఎన్. రాజన్న, డా॥ జె. సాయి కిరణ్ మరియు డా॥ జె. శశాంక్
కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు. పి.వి. నర్సింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, వరంగల్

పశువుల జాతులలో పంది చాలా ముఖ్యమైనది. సమాజంలోని సామాజిక-ఆర్థికంగా బలహీన వర్గాలచే పెంచబడుతున్నందున పందికి ఒక ముఖ్యమైన స్థానం ఉంది. ఇతర పశువుల జాతులతో పోలిస్తే పంది రైతులకు వేగవంతమైన ఆర్థిక రాబడికి దోహదపడుతుంది, ఎందుకంటే అధిక సంతానోత్పత్తి, మంచి-ఫీడ్ మార్పిడి సామర్థ్యం, ప్రారంభ పరిపక్వత మరియు తక్కువ తరం విరామం వంటి కొన్ని స్వాభావిక లక్షణాలను కలిగి ఉన్నాయి. పందుల పెంపకానికి భవనాలు మరియు పరికరాలపై కూడా చిన్న పెట్టుబడి అవసరం. సమాజంలోని బలహీన వర్గాలకు పోషకాహార మరియు ఆర్థిక భద్రతను నిర్ధారించడానికి ఇది అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. నేల సారాన్ని కాపాడుకోవడానికి పందుల మలాన్ని ఎరువుగా ఉపయోగిస్తారు. ఇవి మాత్రమే కాదు పందుల పెంపకం నుండి చాలా లాభాలు ఉన్నాయి.

మేలుజాతి పందులు నిర్దిష్టమైన జాతి లక్షణాలను కలిగి వుంటాయి. వీటి యొక్క ఎదుగుదల దేశీయ పందుల కంటే అధికంగా ఉండి, అధిక బరువు తూగుతాయి. మేలుజాతి పందుల ద్వారా నాణ్యమైన మాంసం ఉత్పత్తి చేయవచ్చును. ఈ పందులు 8-9 నెలలకు ఎదకు వస్తాయి. మేలుజాతి పందులకు ప్రతి ఈతకు 8-14 పిల్లలు పుడతాయి. మంచి యాజమాన్యం మరియు పోషణతో వీటిని సంవత్సరంలో రెండు సార్లు ఈనేటట్లు చేయవచ్చు మరియు మంచి ఆరోగ్యవంతమైన పిల్లలను పోందవచ్చు. మేలుజాతి పందులలో పిల్లల మరణాల శాతం తక్కువ వుంటుంది. మేలుజాతి పందులలో పంది పిల్లలను సరిగ్గా 2 నెలల వయస్సులో తల్లినుండి పాలు మాన్పించవచ్చు. ఈ విధంగా చేయడం వలన ఈతకు ఈతకు మధ్య సమయం తగ్గుతుంది. దీని వలన ఎక్కువ పిల్లలను ఉత్పత్తి చేయవచ్చును.

మేలుజాతి పందులను శాస్త్రీయ పద్ధతిలో పెంచడం వలన తక్కువ సమయంలో ఎక్కువ బరువు తూగుతాయి మరియు పందులను రోగాల నుండి కాపాడుకుని మరణాల శాతం తగ్గించవచ్చు. ప్రతి పంది పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవచ్చు. ఎదుగుదల లేని పందులను గుర్తించి వాటిని "ఏరివేయడం" సులభంగా వుంటుంది. పందులకు సరియైన దాణా ఇవ్వవచ్చు. దాణా వృధా జరుగదు.

### మేలుజాతి పంది పిల్లల ఎంపిక:

- నమ్మకమైన చరిత్ర కలిగిన ఉత్పత్తిదారుల నుండి గాని లేదా పందుల పరిశోధన స్థానాల నుండి గాని పందులను కొనాలి.
- పంది పిల్లలను కొనేటప్పుడు 2 నెలల కంటే ఎక్కువ వయసుండి, తల్లి నుండి పాలు మానివేసి ఉండాలి. ఎలాంటి వ్యాధులు లేకుండా ఆరోగ్యమైన పంది పిల్లలను ఎంపిక చేసుకోవాలి.
- పందుల గుంపులో ఇంతకు ముందు ఏమైనా వ్యాధులు ఉన్నాయా వంటి చరిత్రను తెలుసుకోవాలి.
- పంది పిల్ల యొక్క తల్లికిగాని, తండ్రికిగాని జన్యుసంబంధమైన వైకల్యం ఉంటే వాటిని ఎంపిక చేసుకోరాదు.

- పందుల గుంపులో ఏవైనా అంటువ్యాధులు ఉంటే పిల్లలను పశువైద్యాధికారిచే పరీక్ష చేయించుకుని మాత్రమే తీసుకోవాలి.
- పంది పిల్లలు 2 నెలల వయసులో 12-15 కేజీల బరువు ఉండి ఎలాంటి అంగవైకల్యం లేకుండా ఉండాలి.
- అంటువ్యాధులు ప్రబలిన సమయాల్లో పందులను కొనరాదు.

**మేలుజాతి విత్తనపు పందుల ఎంపిక:**

- విత్తనపు పందిని కొనేటప్పుడు మంచి జాతి లక్షణం కలిగి ఉండాలి.
- పందికి మంచి కండబలం ఉండి, బలిష్టమైన ఎముకలను కలిగి ఉండాలి. నాలుగు కాళ్లపై సరిగా నిలబడి ఉండాలి.
- సమాన పరిమాణం గల వృషణాలు కలిగి ఉండాలి.
- విత్తనపు పందులు 10-12 నెలల వయసులో 100 కేజీల బరువు ఉండాలి. దీనికంటే అధికబరువు ఉన్నచో ఆడపంది పైకి ఎక్కినప్పుడు దానికి గాయాలు అయ్యే అవకాశం ఉంటుంది.
- విత్తనపు పందులను ఆరోగ్యంగా ఉంచడం కొరకు వ్యాయామం చేయించాలి.
- ఒక మగపంది 8-10 ఆడపందులను దాటగలదు. కావున పందుల పెంపకంలో లాభాల కోసం మంచి విత్తనపు పందితో జతపర్చాలి.
- ఒక విత్తనపు పందిపై సగం మంద ఆధారపడి ఉంటుంది కావున మంచి లైంగికాసక్తి ఉన్న పందులను ఎంచుకోవాలి. ప్రతి పది ఆడపందులకు రెండు విత్తనపు పందులను ఉపయోగించాలి.
- విత్తనపు పందికి ఎలాంటి లైంగిక సంబంధ వ్యాధులు లేకుండా చూసుకోవాలి. తప్పనిసరిగా వీర్యపరీక్ష చేయించాలి.

**మేలుజాతి ఆడపందుల ఎంపిక:**

- ఆరోగ్యంగా, చురుకుగా ఉన్న మరియు జాతి లక్షణాలను కలిగిన పందులను ఎంచుకోవాలి.
- ఆడపందులను కొనేటప్పుడు వాటికి ఒక ఈతలోఎన్ని పిల్లలు పుడతాయి మరియు పిల్లల బరువు ఎంత ఉంటుందో వంటి చరిత్రను తెలుసుకోవాలి. పిల్లలు పాలు మరిచే వయసు, ఈతకు ఈతకు మధ్య ఎంత సమయం ఉందో తెలుసుకోవాలి.
- పంది యొక్క వెన్నుపై తక్కువ కొవ్వు ఉండాలి. బలిష్టమైన శరీరంను కలిగి వుండాలి. జననేంద్రియాలు అభివృద్ధి చెంది ఉండాలి. బాగా ఎదిగిన పొదుగు వుండాలి. పొదుగు మెత్తగా వుండి ఎలాంటి గాయాలు ఉండరాదు. పాలధార రాకుండా లోపలి వైపు రొమ్ములు తిరిగి ఉన్న పందులను కొనరాదు.
- పందులకు మంచి మాతృగుణం ఉండి పిల్లలను మంచిగా పెంచగలిగి వుండాలి. పుట్టిన పిల్లలను కొరికి చంపే అలవాటు ఉన్న పందులను ఎంచుకోరాదు.
- పందులను రవాణా చేయునప్పుడు సాధ్యమైనంత వరకు చల్లటి సమయం అయిన ఉదయం, సాయంత్రం మాత్రమే చేయాలి. పందులను రవాణా చేసే వాహనం క్రిమిసంహారక మందులతో శుభ్రపరచిన తర్వాత మాత్రమే పందులను ఎక్కించాలి. పందులను వాహనంలోకి ఎక్కించేటప్పుడు, దించేటప్పుడు గాయాలు కాకుండా చూసుకోవాలి. అందుకు అవసరమైన ప్రయాణ సమయంలో రాంప్పు ఏర్పాటు చేయాలి. పెద్ద పందులను, పిల్ల పందులను వేరువేరుగా రవాణా చేయాలి. ఎందుకంటే తొక్కే ప్రమాదం వుంటుంది.
- ఎక్కువ దూరం ప్రయాణం చేసేటప్పుడు పందులకు ప్రయాణం మధ్యలో నీరు, దాణా ఏర్పాటు చేయాలి. తగినంత విశ్రాంతిని కూడా ఇవ్వాలి. వాహనం అడుగుభాగం జారకుండా ఎండుగడ్డిని ఏర్పాటు చేయాలి. పందులను కిక్కిరిసినట్టుగా ఉంచకూడదు.
- ఒక్కొక్క పెద్ద పందికి 0.06 స్థలం కేటాయించాలి. ఒక్క ట్రక్కులో 43 పందులను రవాణా చేయాలి.
- పందులను రవాణా చేసేటప్పుడు ఈ దశలను అనుసరించాలి. మంచి లాభాలను పొందేందుకు మంచి నిర్వహణ పద్ధతులను అనుసరించాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9440153884

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు, డా॥ ఎ. రామ కృష్ణ బాబు మరియు డా॥ జె.ఎస్. సుధారాణి
ఎలక్ట్రానిక్ మీడియా వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 6.00-7.00 | | | |
| 1. | 01.09.2023 | చెఱకులో అధిక దిగుబడికి సూచనలు | డా॥ యమ్. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త వ్యవసాయ పరిశోధనా స్థానం, బసంతపూర్, 9849535756 |
| 2. | 04.09.2023 | ప్రస్తుతం వరి పంటలో చేపట్టవలసిన యాజమాన్య చర్యలు | డా॥ టి. కిరణ్ బాబు, శాస్త్రవేత్త (ప్లాంట్ పాథాలజి) వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, 9848329394 |
| 3. | 06.09.2023 | కంది సాగులో మెళకువలు | డా॥ యన్. సంధ్యా కిషోర్, సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్, 9948976575 |
| 4. | 11.09.2023 | ప్రత్యామ్నాయ పరిస్థితులలో నువ్వు సాగు యాజమాన్యం | డా॥ డి. పద్మజ, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,జగిత్యాల, 9959306929 |
| 5. | 13.092023 | వర్షాకాలంలో సాగు చేసే ప్రధాన పంటలలో స్థూల మరియు సూక్ష్మ పోషకాల ఆవశ్యకత మరియు యాజమాన్యం | డా॥ యమ్. రాజేశ్వర్ నాయక్, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి, 9100229854 |
| 6. | 20.09.2023 | వర్షాధార పంటలలో సమస్యలు మరియు సూచనలు | డా॥ యమ్. మల్లా రెడ్డి, సహ పరిశోధన సంచాలకులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం, 9848199544 |
| 7. | 27.09.2023 | వర్షాకాలంలో ఉద్యాన పంటలలో చేపట్టవలసిన యాజమాన్య చర్యలు | డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ వ్యవసాయ కళాశాల, అశ్వరావుపేట, 7386069313 |

II. టి-శాట్ (రైతు మిత్ర): సాయంత్రం 4.00-5.00

| | | | |
|---|---|---|---|
| 1. | 4-9-2023 | మిరపలో మేలైన యాజమాన్య పద్ధతులు | శ్రీ. ఇ. రాంబాబు, యస్.యమ్.యస్ (ఉద్యాన శాస్త్రం) కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల, 8247350264 |
| 2. | 11-9-2023 | వానాకాలం పంటలలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు | శ్రీ. పి. విజయ్ కుమార్, యస్.యమ్.యస్ (ప్లాంట్ ప్రొటెక్షన్) కృషి విజ్ఞాన కేంద్రం, రుద్రూరు, 9701456634 |
| 3. | 25-9-2023 | వానాకాలం పంటలలో కలుపు నివారణ | డా॥ వై. శివ లక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త (అగ్రో) మొక్కజొన్న పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, 9949190389 |

III. టి-శాట్ (రైతుబంధు సమితి): శనివారం సాయంత్రం 4.00-5.00

| | | | |
|---|---|---|---|
| 1. | 2-9-2023 | వరిలో సస్యరక్షణ | డా॥ యన్. రామ గోపాల వర్మ, ప్రధాన శాస్త్రవేత్త (కీటక శాస్త్రం) వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, 9912079464 |
| 2. | 16-9-2023 | కందిలో సస్యరక్షణ | డా॥ టి. రాజేశ్వర్ రెడ్డి, శాస్త్రవేత్త (ప్లాంట్ పాథాలజి) వ్యవసాయ పరిశోధనా స్థానం, తాండూరు, 9390898305 |
| 3. | 26-8-2023 | ప్రత్తిలో సస్యరక్షణ | డా॥ యమ్. శంకర్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం, 9490992296 |
| 4. | 30-9-2023 | వివిధ పంటలలో పోషక లోపాలు-సవరణ | డా॥ టి. శ్రీజయ, సీనియర్ శాస్త్రవేత్త భూసార పరీక్షల ఆధారిత పరిశోధనా విభాగం, రాజేంద్రనగర్, 7396193111 |



# రైతన్నకో ప్రశ్న...

డా|| సిహెచ్. వేణు గోపాల రెడ్డి మరియు డా|| ఆర్. సునీత దేవి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. వరిలో సుడిదోమ ఉధృతిని నివారించాలంటే ఎలాంటి యాజమాన్య పద్ధతులను ఆచరించాలి?**

ఎ) ప్రతి 2 మీ. లకు 20 సెం.మీ. కాలిబాటలు తీయటం

బి) నత్రజని ఎరువులను దఫదఫాలుగా వేయటం

సి) సరియైన పురుగు మందులను పిచికారి చేయటం

డి) పైవన్నీ

**2. ప్రత్తిలో గులాబి రంగు పురుగు ఆశించితే ఎలాంటి లక్షణాలు ఏర్పడతాయి?**

ఎ) గుడ్డిపూలు ఏర్పడతాయి

బి) తొలిదశలో ఆశించితే మొగ్గలు, పూలు రాలిపోతాయి

సి) లేత కాయలను ఆశించితే కాయ పరిమాణం పెరగక కొన్నిసార్లు గుడ్డికాయలు ఏర్పడతాయి

డి) పైవన్నీ

**3. వయ్యారిభామ కలుపును నివారించాలంటే ఏం చేయాలి?**

ఎ) జైగోగ్రామా బైకొలరేటా పెంకు పురుగులను వదలటం

బి) బంతి పంటతో పంట మార్పిడి చేయటం

సి) పూతకు రాకముందే మొక్కలను పీకి వేయటం

డి) పైవన్నీ

**4. పురుగులు, తెగుళ్ళ నివారణకు వివిధ పంటలలో మందు ద్రావణం పిచికారి చేసేటప్పుడు రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

ఎ) ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు, గాలి వేగం ఎక్కువగా ఉన్నప్పుడు, మంచు పడేటప్పుడు, వర్షం కురిసేటప్పుడు మందులు పిచికారి చేయరాదు

బి) కాలపరిమితి దాటిపోయిన మందులను వాడకూడదు

సి) పిచికారి సమయంలో రక్షక దుస్తులు, చేతికి గ్లౌసులు, ముక్కుకి మాస్క్, కళ్ళకు రక్షణ కవచాలు విధిగా ధరించాలి

డి) పైవన్నీ

**5. ఐ.సి.ఏ.ఆర్ ఆధ్వర్యంలోని జాతీయ పప్పుధాన్యాల పరిశోధన సంస్థ ఎక్కడ ఉంది?**

ఎ) కాన్పూర్ బి) ఝాన్సీ

సి) ఇండోర్ డి) సూరత్

**6. ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్‌లో ఎంత శాతం భాస్వరం ఉంటుంది?**

ఎ) 16% బి) 24%

సి) 48% డి) 20%

**7. నీటి ఎద్దడిని తట్టుకొని తక్కువ కాలపరిమితి గల యాసంగికి అనువైన వేరుశనగ రకం?**

ఎ) కదిరి–8 బి) కదిరి–9

సి) జెసిజి–88 డి) కదిరి–6

**8. బెండలో పల్లాకు తెగులు (శంఖు రోగం) ఏ పురుగు ద్వారా వ్యాప్తి చెందుతుంది?**

ఎ) పేనుబంక బి) తెల్లదోమ

సి) పచ్చదోమ డి) తామర పురుగు

**9. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను ఏ నేలలకు వేయరాదు?**

ఎ) పాల చౌడు నేలలకు బి) ఎర్ర చల్కా నేలలకు

సి) నల్లరేగడి నేలలు డి) ఏదీకాదు

**10. చెఱకులో జడ చుట్లు వేయటం వలన ఈ క్రింద పేర్కొన్న ఈ పురుగుల ఉధృతిని తగ్గించవచ్చు?**

ఎ) తెల్లనల్లి బి) తెల్లపేను

సి) దూదేకుల పురుగు డి) పైవన్నీ

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు




## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో జరిగిన 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండాను ఆగష్టు 15న రిజిస్ట్రార్ డా॥ ఎమ్. వెంకట రమణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే యూనివర్సిటీ పరిధిలోని అన్ని కేంద్రాలలో జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు.

## ఘనంగా నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాలు

తెలంగాణ స్వరాష్ట్ర స్థాపకుడు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతిని ఆగష్టు 6న విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ద్వారం వద్ద ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి రిజిస్ట్రార్ డా॥ ఎం. వెంకట రమణ పూలదండ వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని జయశంకర్ గారికి నివాళులర్పించారు.

## విశ్వవిద్యాలయంతో అటవీ, సహజ వనరుల నిర్వహణ అధ్యయన కేంద్రం ఒప్పందం

వ్యవసాయ విశ్వవిద్యాలయంతో అటవీ, సహజ వనరుల నిర్వహణ అధ్యయన కేంద్రం, దూలపల్లి ఆగష్టు 7న అటవీ వ్యవసాయం, జీవవైవిధ్య సంరక్షణపై కలిసి పనిచేసేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డా॥ ఎం. వెంకట రమణ మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తలకు, రైతులకు, అటవీ వ్యవసాయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు మరియు ఇరు సంస్థలు కలిసి అటవీ వ్యవసాయంలో పరిశోధనలు విస్తృతం చేసేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అటవీ అకాడమి సంచాలకులు, అటవీ వ్యవసాయ విభాగం శాస్త్రవేత్తలు మరియు అటవీ అకాడమీకి చెందిన అధికారులు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన అమెరికా వ్యవసాయ విభాగం నిపుణులు

అమెరికా వ్యవసాయ విభాగంకు చెందిన వ్యవసాయ నిపుణులు డా॥ ధ్రువ్ సూద్ ఆగష్టు 21న విశ్వవిద్యాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా డా॥ ధ్రువ్ సూద్ మాట్లాడుతూ భారతదేశంలో అమెరికా వ్యవసాయ విభాగం కార్యకలాపాలను, పంటల ధరలు, డిమాండ్ పై సూచనలు ఇవ్వడంలో అనుసరిస్తున్న విధివిధానాలను ఆయన వివరించారు. ప్రత్తి పంట విస్తీర్ణం, దిగుబడి వంటి అంశాలపై చర్చించారు. రిజిస్ట్రార్ డా॥ ఎం. వెంకట రమణ మాట్లాడుతూ యుయస్‌డిఏ, వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం కోసం కృషి చేయాలని మరియు ఫ్యాకల్టీ, శాస్త్రవేత్తల సామర్థ్యాల పెంపుకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు పరస్పరం చేపట్టేందుకు సహకారం అందించాలని కోరారు.

## ఘనంగా నిర్వహించిన జాతీయ క్రీడల దినోత్సవం

వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో ఆగష్టు 29న జాతీయ క్రీడల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతోపాటు అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారని, విద్యార్థులకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని, మానసిక ఉల్లాసానికి, సమిష్టి కృషి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. రిజిస్ట్రార్ డా॥ ఎం. వెంకట రమణ మాట్లాడుతూ వర్సిటీలోని క్రీడా ప్రాంగణంలోని సౌకర్యాలను విద్యార్థులు చక్కగా ఉపయోగించుకోవాలని, క్రీడలతో మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా॥ సి. నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కోసం మేజర్ ధ్యాన్ చంద్ క్రీడల క్లబ్‌ను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

పి.సుధాకర్ మరియు మార్ప్వ బాబు

# సమగ్ర వ్యవసాయంతో అభివృద్ధి పథంలో నడుస్తున్న సిద్ధిపేట జిల్లా ఇబ్రహీంపూర్ గ్రామ యువరైతు - దర్ని పరశురాములు

డా॥ ఎస్. శ్రీదేవి, డా॥ సి.హెచ్. పల్లవి, డా॥ ఎన్. సాయినాథ్, ఏ. సరిత, డా॥ ఈ. ఉమా రాణి, డా॥ డి. శ్వేత,
జె. విజయ్ మరియు ఎల్. రాజు
వ్యవసాయ పరిశోధన స్థానం మరియు ఏరువాక కేంద్రం, తోర్నాల, సిద్దిపేట






వ్యవసాయ పరిశోధన స్థానం, తోర్నాలకు దత్తత గ్రామమైన ఇబ్రహీంపూర్‌కు చెందిన 31 సంవత్సరాల విద్యాధికుడైన యువరైతు దర్ని పరశురాములు. డిగ్రీ చదివిన ఈయన ఐదు సంవత్సరాలుగా తనకున్న నాలుగు ఎకరాల భూమిలో సాంకేతిక పరంగా సమగ్ర వ్యవసాయ పద్ధతులను ఆచరిస్తూ, ఆర్థికంగా సుస్థిరతను సాధిస్తున్నారు. తన నాలుగు ఎకరాల భూమిలో, రెండున్నర ఎకరాలకు బోరు ద్వారా నీటి వసతి ఉండగా, ఎకరం భూమి పూర్తిగా వర్షాధారం. తనకు నీటి సౌకర్యాన్ని పెంపొందించుకోవడానికి తన భూమిలో వర్షపు నీటిని ఒడిసి పట్టుకునే విధంగా వాలుకు అనుకూలంగా 10 గుంటలలో నీటి గుంటను ఏర్పాటు చేసుకున్నారు. దీని ద్వారా నీటిని నిలువ చేసుకుని యాసంగి పంటను కూడా సాగు చేస్తున్నారు.

నీటి వసతి కలిగిన తనకున్న రెండున్నర ఎకరాలలో వర్షాకాలంలో జెజిఎల్ 24423 రకం వరిని, మిగిలిన ఎకరం భూమిలో వర్షాకాలంలో 30 గుంటలలో బీర, పది గుంటలలో టమాట సాగు చేస్తున్నారు. యాసంగిలో ఒకటిన్నర ఎకరాలలో కేఎన్ఎం 118 వంటి కొత్త వరి రకాలను సాగు చేస్తూ, 30 గుంటలలో కాకర, పది గుంటలలో మిరప సాగు చేస్తున్నారు. అలాగే మరో ఎకరాలో వర్షాకాలం వరి తర్వాత జీరో టిల్లేజ్ పద్ధతిలో ప్రొద్దుతిరుగుడు పంట సాగు చేస్తున్నారు.

పంటల్లో కూడా సమగ్ర పోషణ మరియు సస్యరక్షణ పద్ధతులైన పచ్చిరొట్ట పైర్లను సాగుచేయడం, భూసార పరీక్షలను అనుగుణంగా ఎరువులు వేసుకోవడం, భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువులను వాడడం, లింగాకర్షక బుట్టలను వినియోగించడం, జిగురు అట్టలను పెట్టడం, సుడోమోనాస్ వంటి శిలీంద్రాలను వినియోగించడం వంటి పద్ధతులను పాటిస్తూ సాగు ఖర్చులను తగ్గించుకుంటూ దిగుబడులు పెంచుకుంటున్నారు. అలాగే, నీటి యాజమాన్యం కొరకు సూక్ష్మ నీటి పారుదల వ్యవస్థలైన డ్రిప్ మరియు ఫర్టిగేషన్ పద్ధతులను పూర్తిగా సమర్థవంతంగా వాడుకుంటూ సాంకేతికపరంగా ఎరువుల యాజమాన్యం చేపడుతున్నారు. నీటి కుంటలలోని నీటిని పంటలు సాగుకు వినియోగించడంతోపాటు చేపల పెంపకం కూడా చేపడుతూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు.

వ్యవసాయంతోపాటు, 10 గుంటల విస్తీర్ణం పశువుల కొట్టంను ఏర్పాటు చేసుకొని, రెండు బర్రెలను, అలాగే 50 పెరటి కోళ్లను కూడా అనుబంధ రంగాలుగా ఎంచుకొని సంవత్సరం పొడవునా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. పశుపోషణ కొరకు 10 గుంటల భూమిలో సూపర్ నేపియర్ పశుగ్రాసాన్ని సాగు చేస్తూ, వరి గడ్డితో కలిపి వినియోగిస్తూ పశుపోషణను లాభదాయకంగా సాగిస్తున్నారు. పశువుల నుండి వచ్చే వ్యర్థాలను నేలకు ఎరువుగా వాడుకుంటూ నేల సారవంతతను కాపాడుకుంటున్నారు. వివిధ పద్ధతులను మరియు పంటల సరళిలను సాంకేతిక పరంగా పాటిస్తూ ఇతర రైతులకన్నా రెట్టింపు ఆదాయాన్ని పొందుతున్నారు.

వ్యవసాయ విద్యాలయం, ఆఖరి సంవత్సరం విద్యార్థులకు గ్రామీణ ప్రాంతాలలో శిక్షణ అందించే భాగంగా జరిగే కార్యక్రమంలో అతిథేయ రైతుగా తన సహాయసహకారాలను అందిస్తున్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం మరియు ఏరువాక కేంద్రాల ద్వారా ఏర్పాటు చేసే వివిధ శిక్షణ మరియు అవగాహన కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ వ్యవసాయంలో ముందడుగు వేస్తూ తోటి రైతులకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.

## దర్శి పరశురాములుకు నాలుగు ఎకరాలలో ఆదాయ వ్యయాలు

| పంట/అనుబంధ రంగం | పాటిస్తున్న సాంకేతిక పద్ధతి | దిగుబడి | ఖర్చు(రూ.) | స్థూల ఆదాయం | నికరాదాయం |
|---|---|---|---|---|---|
| **వానాకాలం** | | | | | |
| వరి (2.5 ఎకరాలలో) | జేజియల్ 244423 రకం వర్షాధారంగా | 65 క్వింటా/2.5 ఎ | 55,000/- | 1,33,900/- | 78900 |
| బీర (30 గుంటలు) | ప్రైవేట్ రకాలు వర్షాధారంగా | 6.75 టన్నులు/30 గుంటలు | 30,000/- | 46,200/- | 16,200/- |
| టమాట (10 గుంటలు) | ప్రైవేట్ రకాలు వర్షాధారంగా | 3.5 టన్నులు/10 గుంటలు | 10,000/- | 64,000/- | 54,000/- |
| **యాసంగి** | | | | | |
| వరి (1.5 ఎకరాలలో) | కేఎన్మ్ 118 రకం బోరు ఆధారంగా | 45 క్వింటా/1.5 ఎ | 33,000/- | 92,700/- | 59,700/- |
| ప్రొద్దుతిరుగుడు (1.0 ఎకరాలలో) | డి ఆర్ ఎస్ హెచ్ 1 సంకర రకం, (డ్రిప్ క్రింద వానాకాలం వరి తర్వాత జీరో టిల్లేటి పద్ధతిలో | 8 క్వింటా/ఎ | 20,000/- | 52,000/- | 32,000/- |
| కాకర-ప్రైవేట్ రకం (30 గుంటలు) | ప్రైవేట్ రకాలు నీటి కుంట నుండి డ్రిప్ ద్వారా | 7.8 టన్నులు/30 గుంటలు | 30,000/- | 1,80,000/- | 1,50,000/- |
| పచ్చి మిరప (10 గుంటలు) | | 8 క్వింట/20 గుంటలు | 10,000/- | 30,000/- | 20,000/- |
| **సంవత్సరం పొడవునా** | | | | | |
| పశుగ్రాసం (10 గుంటలు) | సూపర్ నేపియర్ నీటి కుంట నుండి | 10 గుంటలు | పశువులకు | | |
| పాడి (10 గుంటలు) | రెండు బర్రెలు | 5 లీ.×365 రోజులు | 40,000/- | 91,250/- | 51,250/- |
| కోళ్ళు | 50 నాటు కోళ్ళు | 50 కిలోలు | 3,000/- | 150,000/- | 12,000/- |
| చేపలు (10 గుంటలు) | రవ్వలు నీటి కుంటలో | 500 కిలోలు | 1,000/- | 40,000/- | 39,000/- |
| మొత్తం (4 ఎకరాలు) | | | 2,32,000 | 7,45,050 | 5,13,050 |
| ఎకరాకు (సరాసరి) | | | 58,000 | 1,86,263 | 1,28,263 |

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9849822270**

**47 వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు : 1. డి 2. డి 3. డి 4. డి 5. ఎ 6. సి 7. బి 8. బి 9. ఎ 10. డి**

# క్యాబేజిలో రెక్కల పురుగు యాజమాన్యం

డా॥ ఆర్. సునీత దేవి మరియు డా॥ సిహెచ్. వేణు గోపాల రెడ్డి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్




1. లోతు దుక్కులు చేయడం
2. విత్తనశుద్ధి చేయడం
3. ఆవాలను ఎర పంటగా వేయడం
4. లింగాకర్షక బుట్టల ద్వారా నిఘా పెట్టడం
5. ట్రైకొగ్రామా బదినికలను విడుదల చేయడం
6. తొలిదశలో వేపగింజల కషాయం పిచికారి చేయడం
7. బి.టి సంబంధిత మందును పిచికారి చేయడం
8. అవసరాన్ని బట్టి పురుగు మందులను పిచికారి చేయడం

RNI No : TELTEL/2015/60296 September, 2023 Postal Regd.No:HSE/1013/2021-2023
Total No. of Pages : 52
Date of Publication : 06.09.2023
Date of Posting : 09.09.2023



**మధిర పెసర-1 (యం.జి.జి-385)**

మొవ్వ కుళ్ళు మరియు ఆకు ముడతను సమర్ధవంతంగా
తట్టుకునే అన్ని కాలాలకు అనువైన పెసర రకం.

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. Ch. Venu Gopala Reddy on behalf of Professor Jayashankar Telangana State Agricultural University,
Owned by Professor Jayashankar Telangana State Agricultural University,
Printed At : PJTSAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana State
Published From : Professor Jayashankar Telangana State Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana State
Editor : Dr. Ch. Venu Gopala Reddy, RNI File No. 1262077, Title-Code : TELTEL00152